PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 309 | విజయవాడ, శుక్రవారం 14 జూన్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 14 June 2024 | Rs

సిటీ

ఆ సంతకం అమలుకు ఆటంకాలెన్నో!

- ఇప్పుడప్పుడే కాదంటున్న నిపుణులు
- మండలిలో వైసిపి మెజార్టీ ఓ అడ్డంకి
- బిజెపి డబుల్ యాక్షన్
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ఆర్డినెన్స్‌పై సర్కారు గురి

లోపలి పేజీలో..



8

రాణించిన రూథర్‌ఫర్డ్

- సూపర్-8కు వెస్టిండీస్
- న్యూజిలాండ్‌పై 13పరుగుల తేడాతో గెలుపు



రాజధాని గ్రామాల్లో చంద్రబాబుపై పూలవర్షం కురిపించిన అభిమానులు

డిఎస్‌సి ఫైల్‌పై తొలి సంతకం చేస్తున్న ముఖ్యమంత్రి

16,347 పోస్టులతో మెగా డిఎస్‌సి

- తొలి సంతకం చేసిన చంద్రబాబు
- రాష్ట్ర సచివాలయంలో బాధ్యతల స్వీకరణ
- మరో నాలుగు హామీలపైనా సంతకాలు
- జులై నెలలో బకాయిలతో కలిపిరూ.7వేల పెన్షన్ ఇళ్ల వద్దకు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 16,347 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి మెగా డిఎస్‌సి నిర్వహణకు సంబంధించిన ఫైలుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలి సంతకం చేశారు. గురువారం సాయంత్రం 4.41 గంటలకు వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడుకు, ఆయన సతీమణి భువనేశ్వరికి వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇచ్చిన ఐదు హామీల అమలుకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేశారు. తొలి సంతకాన్ని మెగా డిఎస్‌సి నిర్వహణకు సంబంధించిన ఫైలుపై చేశారు. రెండో సంతకం ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, మూడవ సంతకం సామాజిక పింఛన్లను మూడు వేల నుండి 4 వేలరూపాయలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ ఫైలుపై నాల్గవ సంతకం, నైపుణ్య గణనకు సంబంధించిన ఫైలుపై ఐదవ సంతకం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇక నుండి ప్రజల పాలన ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. అంతకుముందు సచివాలయంలో ఉద్యోగులు ఆయనకు ఘనస్వాగతం పలికారు.సిఎస్, డిజిపితోపాటు అఖిల భారత సర్వీసు అధికారులు సిఎంను కలిసి అభినందనలు తెలిపారు. ఐదు సంతకాల అనంతరం నిరుద్యోగులు, వికలాంగులు, యువత, పెన్షనర్లు వేర్వేరుగా సిఎంను కలిసి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఉద్యోగులతో కొద్దిసేపు చర్చించారు. ఐదు సంతకాలు చేసే సమయంలో ఏ సంతకం ఎందుకు చేస్తున్నామనే అంశంపై ఆ పథకం లబ్దిదారుల సమక్షంలోనే రెండునిముషాలపాటు వివరించారు

ఐదు సంతకాలు ఇవే

- మెగా డిఎస్‌సి
- ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు
- ఏప్రిల్ నుండి పెన్షన్ల పెంపు అమలు
- యువత ఉపాధి కోసం స్కిల్ సర్వే
- అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ

నిరుద్యోగుల బాధను అర్థం చేసుకున్నాం...

గత ప్రభుత్వంలో ఉద్యోగాలు లేవని ఎన్నికల సమయంలో యువత తన ఆవేదనను తెలిపిందని తెలిపారు. మెగా డిఎస్‌సి ఫైలుపై సంతకం సందర్భంగా సచివాలయానికి మిగతా 7లో

మెగా డిఎస్‌సి ఇలా..

మొత్తం పోస్టులు	16,347
ఎస్‌జిటి	6,371
స్కూల్ అసిస్టెంట్స్	7,725
టిజిటి	1781
పిజిటి	286
పిఇటి	132
ప్రిన్సిపల్స్	52

ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ 27వ నెంబరు జిఓను జారీ చేసింది.

గ్రేస్ మార్కులు తొలగిస్తాం

నీట్ పరీక్షపై సుప్రీంకు కేంద్రం వెల్లడి

23న తిరిగి పరీక్ష, 30న ఫలితాలు

న్యూఢిల్లీ : నీట్ పరీక్ష సందర్భంగా సమయం కోల్పోయారనే కారణంతో 1563మంది విద్యార్థులకు కలిపిన గ్రేస్ మార్కులను ఉపసంహరించు కుంటామని కేంద్రప్రభుత్వం గురువారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. వారిలో పరీక్ష తిరిగి రాసేందుకు సిద్ధమైన విద్యార్థులకు జూన్ 23న పరీక్ష నిర్వహించే అవకాశం వుందని తెలిపింది. ఈ విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలపకుండా వారికి వచ్చిన ఒరిజినల్ స్కోర్‌ను తెలియజేస్తామని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన వెకేషన్ బెంచ్‌కు కేంద్రం తెలియజేసింది. పరీక్ష రాయడానికి అవసరమైన 3.2 గంటల సమయాన్ని వారికి అనుమతించలేదనే కారణంతో నార్మలైజేషన్ ఫార్ములా ప్రాతిపదికన 1563మంది అభ్యర్థులకు గ్రేస్ మార్కులు కలపడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై కోర్టు విచారణ జరుపుతోంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సు మేరకు ఈ గ్రేస్ మార్కులు కలిపారు. ఈ చర్యపై పెద్దఎత్తున విద్యార్థులు ఆందోళనలు చేశారు. దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తం కావడంతో ఎన్‌టిఎ మరో కమిటీని నియమించింది. ఈ కమిటీ ఈ నెల 10, 12 తేదీల్లో చర్చలు జరిపింది. కేంద్రం తరపున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది కనూ అగర్వాల్ మాట్లాడుతూ, గ్రేస్ మార్కులు కలపడం వల్లనే ఈ ఆందోళనకర పరిస్థితి ఎదురైందని కమిటీ అభిప్రాయపడినట్లు చెప్పారు. అసలు ప్రయత్నం చేయని ప్రశ్నలకే ఈ గ్రేస్ మార్కులు పరిమితం చేశారు. మే 5న జరిగిన పరీక్షలో పొందిన గ్రేస్ మార్కులు కలపకపోయినప్పటికీ, తిరిగి పరీక్ష రాయడానికి ఇష్టపడని బాధిత విద్యార్థుల వాస్తవ మార్కులను వెంటనే ప్రకటించాలని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. 1563 మంది అభ్యర్థుల్లో తిరిగి పరీక్ష రాసే అభ్యర్థులకు కొత్తగా వచ్చిన మార్కులనే పరిగణనలోకి తీసుకుంటామని, ముందు పరీక్ష నాటి మార్కులను రద్దు చేస్తారని కోర్టు తెలిపింది.

తిరిగి పరీక్ష ఎప్పుడు నిర్వహించేది తేదీ కూడా ఈ రోజే చెబుతామని ఎన్‌టిఎ తరపు న్యాయవాది నరేష్ కౌశిక్ అంతకుముందు తెలిపారు. జూన్ 23న పరీక్ష నిర్వహించి, 30న ఫలితాలు ప్రకటిస్తామని ఆ తరువాత ఎన్‌టిఎ తెలిపింది. జులై 6 నుండి జరగాల్సిన కౌన్సెలింగ్ సెషన్‌కు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా జాగ్రత్తలు తీసుకుంటామని కూడా ఎన్‌టిఎ వివరించింది. గ్రేస్ మార్కులపై దాఖలైన పిటిషన్లను బెంచ్ విచారించింది. ప్రశ్నాపత్రం లీక్‌ల ఆరోపణలపై స్పందనను రెండు వారాల్లోగా దాఖలు చేయాలని కోర్టు ఎన్‌టిఎను ఆదేశించింది. పది మంది అభ్యర్థులు దాఖలు చేసిన మరో పిటిషన్‌ను విచారించిన కోర్టు, విచారణను జులై 8కి వాయిదా వేసింది.

61కి తగ్గిన టాప్ ర్యాంకర్లు

గ్రేస్ మార్కులను ఉపసంహరించుకోవడంతో టాప్ ర్యాంకర్ల సంఖ్య 67 నుంచి 61కి తగ్గినట్లు ఎన్‌టిఎ అధికారులు గురువారం సాయంత్రం తెలిపారు. హర్యానాలో ఒక కేంద్రం నుంచి మెడికల్ ప్రవేశపరీక్షకు హాజరైన వారిలో ఆరుగురు టాప్ ర్యాంకు సాధించిన వారిలో ఉన్న సంగతి తెలిసిందే.



విమాన ఛార్జీలు తగ్గేలా చూస్తా

- సమర్థవంతంగా విధులు నిర్వహిస్తామన్న కింజరాపు, పెమ్మసాని

లోపలి పేజీలో..

శ్రేణులకు అండగా ఉండండి

వైసిపి ఎమ్మెల్సీలకు జగన్ దిశానిర్దేశం



వైసిపి శాసన మండలి సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ శ్రేణులకు అండగా నిలవాలని ఎంఎల్‌సిలకు మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. తాడేపల్లిలోని తన కార్యాలయంలో గురువారం ఉదయం ఆయన వైసిపి ఎంఎల్‌సిలతో సమావేశమైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంత కాలం గెలిచిన వారికి అవకాశం ఇద్దామని అన్నారు. ఆ తర్వాత ప్రజల పక్షాన ప్రజల్లో తిరిగే కార్యక్రమాలను చేపడదామని తెలిపారు. భవిష్యత్ తమదేనని చెప్పారు. వైసిపి శ్రేణులపై దాడులు చేయిస్తూ చంద్రబాబునాయుడు తొలి తప్పు చేశారని చెప్పారు. దాడులకు గురవుతున్న పార్టీ కార్యకర్తలకు ధైర్యం చెప్పాలని అన్నారు. ఇటువంటి పరిస్థితులను ఎదుర్కొని గతంలో లేచి నిలబడ్డామని, ఇప్పుడు కూడా అలాగే నిలబడతామని ఆయన చెప్పారు. కన్ను మూసి తెరిచే లోగానే ఐదేళ్ల అధికార కాలం గడిచిపోయిందని, మరో ఐదేళ్లు కూడా అలాగే గడిచిపోతాయని అన్నారు. ఈ కాలంలో కార్యకర్తలకు, ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. ఎన్నికల్లో 11 స్థానాలకు పరిమితమైనా 40 శాతం మంది ప్రజలు తమతోనే ఉన్నారని ఆయన చెప్పారు. ఈ విషయాన్ని విస్మరించవద్దని, ఎవరూ మనోధైర్యాన్ని కోల్పోవద్దని ఎంఎల్‌సిలకు ఆయన సూచించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ వైసిపి శ్రేణులపై దాడులు చేస్తోందని చెప్పిన ఆయన, అవకాశం ఉన్నా హోదాను అడగకపోవడం రెండవ తప్పు అని అన్నారు. ఇలా చూస్తూ ఉండగానే శిశుపాలుడిలా 100 తప్పులు పూర్తిచేస్తారని వ్యాఖ్యానించారు. తెలుగుదేశం తప్పులను శాసనసభలో సంఖ్యాబలం రీత్యా నిలదీసే అవకాశాలు తక్కువగా వున్నాయని, మండలిలో మనకున్న సంఖ్యాబలంతో ప్రజా సమస్యలు, రాష్ట్రాభివృద్ధిపై నిలేయాలని అన్నారు. సంఖ్యాపరంగా ఎమ్మెల్యేలు తక్కువ వున్నందున వైసిపికి ప్రతిపక్షహోదా ఇస్తారా లేదా అనేది వేచి చూడాలన్నారు. నైతికవిలువల ప్రకారం మిగతా 2లో

గిరిజన ప్రత్యేక డిఎస్‌సి

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్

గిరిజన ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కె.సురేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో గురు వారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను గిరిజన నిరుద్యోగ యువతీ యువకులతో ప్రత్యేక డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం జిఒ నెంబర్ 3 పున:రుద్ధరణ చేయకుండా ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నపుడు టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జిఒ 3 అమలు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు.16,350 పోస్టులలో మెగా డిఎస్‌సి ప్రకటించడాన్ని వారు స్వాగతించారు. గిరిజన ప్రత్యేక డిఎస్‌సికి కూడా నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 39 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఐదేళ్లపాటు ఐటిడిఎ పరిధిలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

విమల విద్యాలయం మూసివేత

- నిధులు సమకూర్చని విశాఖ ఉక్కు యాజమాన్యం !
- పాఠశాలకు రావద్దని అధ్యాపకులకు మెసేజ్
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన
- నేడు సిఎమ్‌డి బంగ్లా ముట్టడికి పిలుపు



విద్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

ఉక్కునగరంలో విశాఖ విమల విద్యాలయం గురువారం మూతపడింది. సుమారు 40 సంవత్సరాలుగా పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న పాఠశాల ఒక్కసారిగా మూతపడడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల అధ్యాపకులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇక పాఠశాలకు రావద్దని అధ్యాపకులకు సైతం మెసేజ్ పంపడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ పాఠశాలలో ఎల్‌కెజి నుంచి నుంచి పదవ తరగతి వరకూ దాదాపు 2400 మంది విద్యార్థులు చదువుతున్నారు. 20 మంది అధ్యాపకులతో కలిపి మొత్తం 60 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి తెలుగు మీడియం ఉచిత విద్య, ఇంగ్లీష్ మీడియం వారికి నామమాత్రపు ఫీజును వసూలు చేస్తున్నారు. అగనంపూడి, వడ్లపూడి, కూర్మన్నపాలెం, గాజువాక తదితర ప్రాంతాల విద్యార్థులు ఈ పాఠశాలలోనే చదువుతున్నారు. అధిక శాతం మంది రోజువారి కూలీలు, స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల పిల్లలు, ఆటో డ్రైవర్ల పిల్లలే ఈ పాఠశాలలోనే విద్యను అభ్యసిస్తున్నారు. 2024-25 సంవత్సరానికిగానూ అడ్మిషన్లు ఇచ్చి మొదటి టెర్మ్ ఫీజులు సైతం కట్టించుకున్న తర్వాత హఠాత్తుగా పాఠశాలను మూసివేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. విద్యాలయానికి నిధులు సమకూర్చలేని పరిస్థితిలోకి చేరిందని, అందుకనే పాఠశాల మూసివేత తప్పడం లేదని యాజమాన్యం నుంచి సమాధానం మిగతా 2లో

వేట నిషేధ పరిహారం ఏదీ?

- నేటికీ ఖాతాల్లో జమ కాని డబ్బులు
- ఖరారు కాని లబ్ధిదారుల తుది జాబితా
- ప్రాథమికంగా 1,30,128 మంది అర్హులుగా గుర్తింపు
- నేటి నుంచి చేపల వేటపై నిషేధం ఎత్తివేత



వేటకు సిద్ధమవుతున్న మత్స్యకారులు

ప్రజాశక్తి - యంత్రాంగం

సముద్రంలో చేపల వేటపై ఉన్న నిషేధం శుక్రవారం నుంచి తొలగనుంది. అయితే ఇంత వరకు పరిహారానికి సంబంధించిన మొత్తం మత్స్యకారుల చేరలేదు. జాబితాలో ఇంకా పూర్తిస్థాయిలో సిద్ధంకాలేదని, ప్రభుత్వ ఆమోదం ముద్ర పడలేదని అధికారులంటున్నారు. దీనితో రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారుల్లో ఆందోళన నెలకొంది. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల పాటు చేపల వేటపై ప్రభుత్వం వేట నిషేధం అమలు చేస్తోంది. వేటకు దూరంగా ఉంటున్న మత్స్యకారులకు ప్రభుత్వం 61 రోజుల కాలానికి రూ.10వేలు చొప్పున పరిహారం అందిస్తోంది. గతేడాది మే 16నే డబ్బులు జమ చేయగా, ఈ ఏడాది ఎన్నికల సంఘం అనుమతులతో కొంత ఆలస్యంగా లబ్ధిదారుల సర్వే చేపట్టారు. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అధికారులు ప్రాథమిక జాబితాను సిద్ధం చేశారు. అయితే పరిహారం జాబితాకు ప్రభుత్వ ఆమోద ముద్ర లభించలేదు.

వేట నిషేధ భృతి కోసం లబ్ధిదారుల సర్వే మే రెండో తేదీ నుంచి నిర్వహించింది. మూడు, నాలుగు తేదీల్లో డేటా వెరిఫికేషన్, ఎంట్రీ చేశారు. ఆరు నుంచి పదో తేదీ వరకు లబ్ధిదారుల వివరాలను నవశకం పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. 14న మిగతా 2లో

కుటుంబపోషణ కోసం అప్పులు చేశాం



60 రోజులు పాటు బోటు, వలలు మరమ్మతులు పనులను చక్కబెట్టుకున్నాం. రెండు నెలలు కుటుంబపోషణ కోసం అప్పులు చేశాం. కొత్త ప్రభుత్వం స్పందించి వెంటనే పరిహారం అందించాలి. హామీ మేరకు పరిహారం రూ.20వేలు ఇవ్వాలి

\- మెరుగు దావీదు, ఉప్పాడ

ఉచిత సిమ్ కార్డ్‌పై వేటు

- కొత్త కనెక్షన్లకు ఛార్జీ వసూలు
- ట్రాయ్ ప్రతిపాదన

న్యూఢిల్లీ : టెలికం కంపెనీల మధ్య ఉన్న పోటీ వల్ల ఇప్పటి వరకు సిమ్ కార్డులు ఉచితంగా అందించాయి. ప్రస్తుతం దేశంలో బిఎస్‌ఎన్‌ఎల్ మినహా మూడు ప్రయివేటు టెల్కోలు మాత్రమే మిగలడంతో టెలికం మార్కెట్‌పై గుత్తాధిపత్యం పెరిగింది. క్రమంగా చార్జీలు పెంచుతూ.. వినియోగదారులపై భారం మోపుతున్నాయి. ఇదే క్రమంలో సిమ్ కార్డులను ఉచితంగా జారీ చేసిన కంపెనీలు.. ఇకపై కొత్త కనెక్షన్లకు ఛార్జీ వసూలు చేయనున్నాయి. ఇందుకోసం టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ప్రతిపాదనలు సిద్ధం చేసిందని సమాచారం. ఫోన్ నంబర్‌కు, ల్యాండ్‌లైన్ నంబర్‌కు ఛార్జీలు వసూలు చేయాలని యోచిస్తోందని రిపోర్టులు వస్తున్నాయి. సహజ వనరుల్లానే ఫోన్ నంబర్ కూడా చాలా విలువయ్యిందని ట్రాయ్ భావిస్తుందని ఓ ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. కానీ.. ఇంతకాలం ఈ విషయాన్ని ఎవరి ప్రయోజనం కోసం పట్టించుకోలేదో స్పష్టం చేయలేదు. తక్కువ వినియోగ నంబర్ల విషయంలో ఆయా కంపెనీలకు జరిమానా విధించాలని ట్రాయ్ యోచిస్తోంది.

యడ్యూరప్పపై అరెస్టు వారెంట్

- పోక్సో కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఆదేశాలు
- నేడు హైకోర్టు విచారణ



బెంగుళూరు : కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బిజెపి సీనియర్ నాయకులు బిఎస్ యడ్యూరప్పకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు (పోక్సో కోర్టు) గురువారం సాయంత్రం నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. 2012 మార్చి 14న పోక్సో చట్టం కింద నమోదైన కేసులో ఈ అరెస్టు వారెంట్ ఇచ్చింది. 2012 ఫిబ్రవరిలో సహాయం కోరి తన తల్లితోపాటు వచ్చిన 17 ఏళ్ల బాలికపై యడ్యూరప్ప లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కేసు నమోదైంది. అరెస్టు వారెంట్ జారీ కావడంతో ఆయనను అరెస్టు చేసేందుకు ఈ కేసును విచారిస్తున్న సిఐడి సిద్ధమవుతోంది. యడ్యూరప్ప కోసం సిఐడి బృందాలు గాలింపు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం యడ్యూరప్ప బిజెపి పార్లమెంటరీ బోర్డు, కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యులుగా ఉన్నారు. యడ్యూరప్ప కార్యాలయం విడుదల చేసిన సమాచారం ప్రకారం ప్రస్తుతం ఆయన న్యూఢిల్లీలో ఉన్నారు. బాధితురాలు వేసిన రిట్ పిటిషన్‌ను విచారిస్తూ యడ్యూరప్పను ఇంకా ఎందుకు అరెస్టు చేయలేదని కర్ణాటక హైకోర్టు ఇటీవల ప్రశ్నించింది. దీంతో, ఈ నెల 12న విచారణకు హాజరు కావాలని యడ్యూరప్పకు సిఐడి సమన్లు జారీ చేసింది. దీనికి ఆయన స్పందిస్తూ ప్రస్తుతం తాను న్యూఢిల్లీలో ఉన్నానని, ఈ నెల 17న విచారణకు హాజరవుతానని సమాధానం ఇచ్చారు. దీంతో ఆయనను అరెస్టు చేయడానికి వారెంట్ జారీ చేయాలని కోరుతూ సిఐడి ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఆశ్రయించింది. దీనిని అంగీకరిస్తూ గురువారం సాయంత్రం యడ్యూరప్పపై కోర్టు నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది.

ఈ కేసులో బాధితురాలి తరపున ఆమె తల్లి 2014 మార్చి 14న సదాశివనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ప్రకారం ఒక సహాయం కోసం యడ్యూరప్ప ఇంటికి వెళ్లారు. బాలికను గదిలోకి తీసుకెళ్లిన యడ్యూరప్ప తలుపులకు తాళం వేసి ఆమెపై వేధింపులకు పాల్పడ్డారు. ఈ ఘటన గురించి వెల్లడించకుండా ఉండటానికి డబ్బును ఆశగా చూపినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. అనారోగ్య కారణాలతో ఆమె ఈ ఏడాది మేలో మరణించడంతో, బాధితురాలి సోదరుడు న్యాయ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. యడ్యూరప్పను అరెస్టు చేయాలని బాధితురాలి సోదరుడు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై, కేసు రద్దు చేయాలని యడ్యూరప్ప వేసిన పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం చేపట్టనుంది.

ఆ సంతకం అమలుకు ఆటంకాలెన్నో!

- ఇప్పుడప్పుడే కాదంటున్న నిపుణులు
- మండలిలో వైసిపి మెజార్టీ ఓ అడ్డంకి
- బిజెపి డబుల్ యాక్షన్
- ఆర్డినెన్స్‌పైనే కూటమి సర్కారు గురి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ భూయాజమాన్య హక్కు చట్టం- 2023 (ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్) రద్దుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం రెండో సంతకం చేయగా, ఆ సంతకం ఇప్పుడప్పుడే చెల్లు బాటయ్యే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు యాక్ట్ రద్దుకు రెండో సంతకం చేసి హామీని నిలబెట్టుకున్నామని సిఎం చంద్రబాబు, కూటమి నేతలు చెబుతున్నారు. కాగా యాక్ట్ రద్దుకు చాలా సమయం పడుతుందని, అంత సులువు కూడా కాదని, రాజ్యాంగ, న్యాయపరమైన పలు అంశాలు ముడిపడి ఉన్నాయని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల్లో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ దుమారంతో వైసిపి రాజకీయంగా తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుంది. వైసిపి ఓటమికి అదొక కారణంగా విశ్లేషకులూ చెబుతున్నారు. సదరు చట్టం నిజ మైన యజమానుల హక్కులను హరిస్తుందని, కార్పొరేట్లకు భూములు ధారాదత్తం చేయడానికి అనువుగా ఉంటుందన్న భయాందోళనలు ఉన్నాయి.

ఒక్క కలం పోటుతో కాదు

యాక్ట్ రద్దు సిఎం ఒక్క కలం పోటుతో కాదు. అది కేబినెట్‌కు వెళ్లాలి. తక్షణం యాక్ట్ రద్దు కావాలంటే ఆర్డినెన్స్ జారీ చేయాలి. అది గవర్నర్ ఆమోదం పొందాక రాజ్యాం గంలోని 254(2) అధికరణ మేరకు రాష్ట్రపతి ఆమోదానికి వెళ్లాలి. రాష్ట్రపతి పరిశీలన, ఆమోదం లభించాకనే చట్టం అయింది. కనుక ఇప్పుడు రద్దు ఆర్డినెన్స్ కూడా ఆ విధంగానే రాష్ట్రపతికి వెళ్లి అక్కడి నుంచి ఆమోదం వస్తేనే రద్దు అవుతుంది. ఆర్డినెన్స్ కాబట్టి దాని కాలపరిమితి ఆరు మాసాలే ఉంటుంది. ఆ లోపు ఆర్డినెన్స్‌ను బిల్లు రూపంలో ఉభయ సభల్లో ప్రవేశపెట్టి ఆమోదం తీసుకొని, రాష్ట్రపతికి పంపాలి. రాష్ట్రపతి ఆమోదంతోనే పూర్తిగా చట్టం రద్దు అవుతుంది. త్వరలో కొత్త ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలి. కాబట్టి ఆర్డినెన్స్‌కు బదులు నేరుగా ఉభయ సభల్లో బిల్లు పెట్టి ఆమోదం తీసుకొని గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపితే అక్కడి నుంచి ఆమోదం తీసుకుంటే సరి పోతుంది. ఇక్కడే ప్రభుత్వానికి పెద్ద సమస్య ఉంది.

శాసనసభలో కూటమికి మెజార్టీ ఉంది కనుక అక్కడ సునాయాసంగా రద్దు బిల్లు ఆమోదం పొందుతుంది. శాసనమండలిలో ప్రస్తుతం వైసిపికి మెజార్టీ ఉంది. 58 మంది సభ్యులున్న మండలిలో ఆరు ఖాళీ అయ్యాయి. 41 మంది వైసిపి ఎంఎల్‌సిలు ఉన్నారు. వారిలో అధికారికంగా 30 మంది, నామినేటెడ్ 8 మంది, ముగ్గురు ఇండిపెండెంట్లు ఉన్నారు. సీట్ల లెక్కల ప్రకారం చూస్తే మండలిలో రద్దు బిల్లు ఆమోదం పొందే పరిస్థితి లేదు. వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల బిల్లు పెడితే మండలిలో ఏ విధంగా అయితే అప్పుడు మెజార్టీ ఉన్న టిడిపి అడ్డుకుందో, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లును వైసిపి అడ్డుకొనే అవకాశం ఉంది. ఆ మేరకు గురువారం వైఎస్ జగన్ నిర్వహిం చిన వైసిపి ఎంఎల్‌సిల సమావేశంలో దిశా నిర్దేశం చేశారని సమాచారం. అదే జరిగితే ల్యాండ్ టైటిలింగ్ బిల్లు మండలిలో ఆమోదం పొందదు. అందుకే త్వరిత గతిన ఆర్డినెన్స్ తీసుకొచ్చి యాక్ట్ రద్దును అమల్లో పెట్టి, ఆరు మాసాల్లోపు ఏదొక విధంగా మండలిలో మెజార్టీ పొంది, అప్పుడు బిల్లు పెట్టి ఆమోదం పొందా లన్న అంశంపై కూటమి ఆలోచనలు చేస్తోందని సమాచారం. కుదిరితే ఇప్పుడే మండలిలో మెజార్టీ సాధించడం ఎలా అనే విష యాలపైనా కూటమి సమాలోచనలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

బిజెపితోనే చట్టం రావడం..రద్దు..

నీతిఆయోగ్ సూచనల మేరకు వైసిపి సర్కారు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తెచ్చానంటోంది. ఆ యాక్టుకు రాష్ట్రపతి నుంచి ఆమోదం వచ్చింది. అంటే కేంద్రంలోని అప్పటి బిజెపి సర్కారు వైసిపికి మద్దతిస్తేనే జరిగిందన్నది నిర్వివాదాంశం. ఇప్పుడు టిడిపిపై కేంద్రంలో ఆధారపడ్డ ఎన్‌డిఎ సంకీర్ణ ప్రభుత్వం తప్పకుండా యాక్ట్ రద్దుకు రాష్ట్రపతి నుంచి ఆమోదం వచ్చేలా చేస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అప్పుడు యాక్ట్ తేవడానికి, ఇప్పుడు ఆ యాక్ట్ రద్దుకు బిజెపియే ప్రధాన పాత్రధారి అని అర్థమవుతోంది. కాగా ల్యాండ్ టైట్లింగ్ చట్టం అంశం హైకోర్టులో ఉంది. అక్కడ క్లియర్ అయ్యే వరకు ప్రభుత్వం చేపట్టిన రద్దు ప్రక్రియ ముందుకు సాగడానికి వీలుండదని కొందరు న్యాయ నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం మారింది కాబట్టి చట్టాన్ని తామే రద్దు చేయబోతున్నామని కోర్టుకు చెబితే కేసు క్లోజ్ అవుతుంది. ఆ ప్రక్రియకు కూడా కొంత సమయం పడుతుంది.

గాడి తప్పిన వ్యవస్థలను దారిన పెడతా

- ఐఎఎస్, ఐపిఎస్‌లతో సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గాడి తప్పిన వ్యవస్థలను దారిన పెడతానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు ఐఎఎస్, ఐపిఎస్‌లు ముఖ్యమంత్రిని కలిసి గురువారం శుభాకాంక్షలు తెలిపారు. 1995లో తాను మొదటిసారి ముఖ్యమంత్రి అయ్యానని, అప్పుడు తనతో పనిచేసిన వారిలో కొందరు ఇక్కడ ఉండి ఉంటారని చెప్పారు. నాలుగోసారి ఇప్పుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నానని, రాష్ట్రంలో నేడు చూసిన దారుణమైన పరిస్థితులు ఎప్పుడూ చూడలేదని అన్నారు. ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అత్యంత గౌరవప్రదమైన ఉద్యోగాలు అని తెలిపారు. ఒక రాష్ట్రంతో సంబంధం లేకుండా వివిధ రాష్ట్రాల నుంచి నియామకమవుతారని వివరించారు. ఇక్కడున్న కొందరు అధికారులు గతంలో ఆదర్శవంతంగా పనిచేశారని అన్నారు. గత ఐదేళ్లలో మాత్రం ఏం చేశారో ఆత్మవిమర్శ చేసుకోవాలని వారికి చెప్పారు. పరిపాలన ఇంత అన్యాయంగా తయారవుతుందని తాను ఎప్పుడూ ఊహించలేదన్నారు. డిపార్టుమెంట్లన్నీ నిస్తేజమయ్యాయని, సిస్టమ్స్ అన్నీ నిర్వీర్యం అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అభీష్టం మేరకే ఎవరైనా పని చేయాల్సి ఉంటుందన్నారు. తనకు జరిగిన అన్యాయం గురించి మాట్లాడటం లేదని, ఎప్పుడూ మాట్లాడనని చెప్పారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయం గురించే తన బాధ అని పేర్కొన్నారు. పరిపాలన గాడిలో పెట్టే విషయంలో కొన్ని నిర్ణయాలు తీసుకుంటానని తెలిపారు. త్వరలో అందరితో మరలా మాట్లాడి పాలనను చక్కదిద్దుతానని చెప్పారు. అనంతరం తన కార్యాలయం నుంచి బయటకు వచ్చిన చంద్రబాబు మీడియా ప్రతినిధులను చూసి కారు ఆపి వారితో మాట్లాడారు. చంద్రబాబుకు ఈ సందర్భంగా వారు శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలో వార్తలు కవర్ చేసే తాము ఐదేళ్ల తరువాత ముఖ్యమంత్రిని కలిశామని సిఎంతో ప్రతినిధులు అన్నారు.



సచివాలయంలో ఉన్నతాధికారులకు సమావేశమైన సిఎం చంద్రబాబు

ప్రజల కోసమే 5 సంతకాలు: మంత్రులు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐదు సంతకాలు చేశారని, గత ప్రభుత్వ హయాంలో ఇబ్బందులు పడ్డ పేదల కోసమే వాటికి తొలి ప్రాధాన్యత ఇచ్చారని మంత్రులు నిమ్మల రామానాయుడు, డోలా బాలవీరాంజనేయస్వామి, సవిత అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన అనంతరం వారు వెలగపూడి సచివాలయంలోని నాలుగో బ్లాకులో మీడియాతో మాట్లాడారు. ఐదు సంతకాలతో నిరుద్యోగ యువత, రైతులు, వృద్ధులు, వితంతువులు, విలాంగులు, నిరుపేదలకు భద్రత, భరోసా కల్పించారని చెప్పారు. ఎన్నికల సందర్భంగా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు 16,347 టీచర్ పోస్టుల భర్తీకి డిఎస్‌సిని నిర్వహించే ఫైల్‌పై సంతకం చేశారని చెప్పారు. ప్రజల ఆస్తులకు రక్షణలేని విధంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుపై రెండో సంతకం చేశారని అన్నారు. సామాజిక భద్రతా పెన్షన్ల కింద ప్రతినెలా వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఇచ్చే పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచడంపై మూడో సంతకం చేశారని, ఏప్రిల్ నుండే ఈ పెంపు వర్తిస్తుందని అన్నారు. ఏప్రిల్, మే, జూన్ మాసాలకు పెంచిన మూడువేలు కలుపుకుని ఏడువేల రూపాయలు జులై నెలలో ఇస్తారని చెప్పారు. వికలాంగులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.3 వేల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచుతామని అన్నారు.

ఇళ్ల వద్దే జులై ఒకటో తేదీన పెన్షన్ అందిస్తామని చెప్పారు. నిరుపేదలకు పట్టెడన్నం పెట్టే అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించడంపై నాలుగో సంతకం చేశారన్నారు. ఉదయం టిఫిన్, భోజనం, రాత్రి భోజనం రూ.5 చొప్పున అందిస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత అభిరుచికి అనుగుణంగా వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇచ్చి వారి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలనే లక్ష్యంతో స్కిల్ సెన్సన్ పథకాన్ని అమలు పర్చే ఫైల్‌పై ముఖ్యమంత్రి ఐదో సంతకం చేశారు. రాష్ట్ర ప్రజలు టిడిపిపై నమ్మకంతో పెద్దఎత్తున ఓట్లు వేసి మెజార్టీ సీట్లలో గెలిపించారని పేర్కొన్నారు. రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని, విజన్ ఉన్న ముఖ్యమంత్రి పాలనతో రానున్న ఐదేళ్లు స్వర్ణయుగమేనని పేర్కొన్నారు.

సిఎం చంద్రబాబుకు ఉద్యోగ సంఘాల అభినందనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడుకు, మంత్రిగా బాధ్యతలు చేపడుతున్న పవన్‌కల్యాణ్‌కు, రాష్ట్ర మంత్రులందరికీ ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ వర్కర్స్ జెఎసి శుభాకాంక్షలు తెలియజేసింది. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రత్యేక హోదా, విభజన హామీలు, రాజధాని నిర్మాణం, పోలవరంతోపాటు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పూర్తి, ధరల నియంత్రణ, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, సిపిఎస్ రద్దు, సామాజిక భద్రతపై నూతన ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, కో ఛైర్మన్ దయా మణి తదితరులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీరితోపాటు ఆప్కాస్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ, ఎపి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య, తదితరులు నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు.



సిఎం చంద్రబాబును కలిసిన సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నారా చంద్రబాబు నాయుడును సిపిఐ నాయకులు కలిశారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు మనోహర్ నాయుడు సచివాలయంలో గురువారం కలిసి శు భాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం జరిగే ప్రతి చర్యకూ తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని మీడియాతో అన్నారు.

పోరాటాలతోనే విశాఖ ఉక్కును కాపాడుకుంటాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

పోరాటాలతోనే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారంనాటికి 1218వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఎల్ఎంఎం, ఎస్‌బిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా డి.ఆదినారాయణ మాట్లాడుతూ.. ఉక్కు రంగానికి అత్యంత భవిష్యత్తు ఉన్నప్పటికీ, ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేయాలనే కేంద్ర ప్రభుత్వ ఆలోచనతో విశాఖ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి కాకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. ఒకవైపు కార్మికులు భవిష్యత్తును ఫణంగా పెడుతూ పోరాడుతుంటే మరోవైపు స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేయడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ఎంపిలతో కేంద్ర ప్రభుత్వంతో పోరాడి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలని కోరారు.

వైసిపిపై దాడుల కేసుల వివరాలివ్వండి

- రాష్ట్రానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాల తర్వాత వైసిపిలోని కొందరిపై జరిగిన దాడులకు సంబంధించిన వివరాలను నివేదించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, డిజిపిలకు నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 19కి వాయిదా వేస్తూ, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల ఫలితాల తర్వాత వైసిపి కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని హింసకు పాల్పడుతున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదంటూ వైసిపి రాజ్యసభ్య సభ్యుడు వైవి సుబ్బారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది రాజు రామచంద్రన్ వాదిస్తూ, దాడులకు సంబంధించిన వీడియో ఆధారాలు ఉన్నాయన్నారు. పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. ఫిర్యాదు చేయగానే కేసు నమోదుకు పోలీసులకు ఆదేశాలివ్వాలని కోరారు. బాధితులను ఇళ్ల, ఊళ్ల ఖాళీ చేసి వెళ్లాలని బెదిరిస్తున్నారని చెప్పారు. పిల్ విచారణార్హతపై తమ వాదనలు వినిపిస్తామని హోంశాఖ తరపున ప్రభుత్వ న్యాయవాది వేలూరి మహేశ్వరరెడ్డి చెప్పారు. దీంతో విచారణ ఈ నెల 19కి వాయిదా పడింది.

అసెంబ్లీలో పార్టీలకు కార్యాలయాలు కేటాయింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పలు పార్టీలకు శాసనసభ ప్రాంగణంలో కార్యాలయాలను కేటాయిస్తూ అసెంబ్లీ కార్యదర్శి రామాచార్యులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి వినియోగించుకుంటున్న ముఖ్యమంత్రి ఛాంబర్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కేటాయించారు. అలాగే వైసిపి శాసనసభాపక్ష కార్యాలయాన్ని టిడిపికి కేటాయించారు. అలాగే ప్రస్తుతం టిడిపి వినియోగించుకుంటున్న కార్యాలయాన్ని జనసేన పార్టీకి, ప్రతిపక్ష నేతగా చంద్రబాబుకు కేటాయించిన కార్యాలయాన్ని పవన్‌కల్యాణ్‌కు, గతంలో బిజెపికి కేటాయించిన కార్యాలయాన్ని వైసిపికి కేటాయించారు. ప్రభుత్వ విప్‌కు కేటాయించిన మెట్ల దగ్గర వున్న కార్యాలయాన్ని బిజెపికి కేటాయిస్తూ అసెంబ్లీ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

జలాశయాల్లోకి చేరుతున్న వరద నీరు

- తుంగభద్రలో 5.59, శ్రీశైలంలో 33.7180 టిఎంసిలు
- గతేడాది కంటే పెరగనున్న నిల్వలు



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

గతేడాది తీవ్ర వర్షాభావం వల్ల పలు ప్రాజెక్టులు కనిష్ట నిల్వలకు నీటి మట్టాలు పడిపోయాయి. ఈ ఏడాది జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాల రాకతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పడడంతో జలశయాల్లోకి వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది జలాశయాల నీటి నిల్వ పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

తుంగభద్ర జలాశయ నీటి నిల్వ సామర్థ్యం 105.78 టిఎంసిలు కాగా గతేడాది ఇదే సమయానికి 5.029 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం జలాశయంలో 5.59 టిఎంసిల నీరు నిల్వ ఉంది. తుంగభద్ర జలాశయ గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు కాగా ప్రస్తుతం నీటి మట్టం 1582.13 అడుగులుగా ఉంది. గతేడాది ఇదే సమయానికి నీటి మట్టం 1581.10 అడుగులుగా ఉంది. కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వరద నీరు వచ్చి తుంగభద్ర జలాశయంలోకి చేరుతోంది. ప్రస్తుతం 3215 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. గతేడాది ఇదే సమయానికి 405 క్యూసెక్కుల నీరు మాత్రమే వచ్చి చేరింది. గత పదేళ్ల సరాసరి ఇన్‌ఫ్లో 1501 క్యూసెక్కులుగా ఉంది.

శ్రీశైలం జలాశయంలోకి ఎగువ నుంచి వరద నీరు రావడం లేదు. ఈ నెల 10న ఒక్క రోజు సుంకేసుల నుంచి 4052 క్యూసెక్కుల నీరు వచ్చి ఆగిపోయింది. శ్రీశైలం జలాశయ గరిష్టనీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 809 అడుగులుగా ఉంది. గతేడాది ఇదే సమయానికి జలాశయ నీటి మట్టం 809 అడుగులుగానే ఉంది. జలాశయ నీటి నిల్వ సామర్థ్యం 215.807 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 33.7180 టిఎంసిల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి జలాశయ నీటి నిల్వ 33 టిఎంసిలుగా ఉంది. ప్రస్తుతం జలాశయం నుంచి మహాత్మగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1283 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం కుడి, ఎడగ గట్టు విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. గాజులదిన్నె ప్రాజెక్టు (దామోదరం సంజీవయ్య సాగర్)కు వరద నీరు వచ్చి చేరుతోంది. హంద్రీనదిపై ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రస్తుతం 800 క్యూసెక్కుల నీరు గాజులదిన్నె ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్నాయి. జలాశయ నీటి నిల్వ సామర్థ్యం 4.5 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం నీటి నిల్వ 0.9 టిఎంసిలుగా ఉంది. గతేడాది ఇదే సమయానికి జలాశయంలో 0.8 టిఎంసిల నీటి నిల్వ ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జలాశయాలకు ముందుగానే వరద నీరు వచ్చి చేరుతున్నాయి. దీంతో జలాశయాల్లో నీటి నిల్వ గతేడాది కంటే పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

వాసుదేవరెడ్డికి హైకోర్టులో నిరాశ

- ముందస్తు బెయిల్ మంజూరుకు నిరాకరణ

ప్రజాశక్తి-అమరావతి

సిఐడి నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఎపి రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపి ఎస్‌బిసిఎల్) మాజీ ఎమ్‌డి డి వాసుదేవరెడ్డికి హైకోర్టులో నిరాశ ఎదురైంది. సిఐడి వ్యతిరేకిస్తున్న కారణంగా ముందస్తు బెయిల్ ఉత్తర్వులు జారీ చేయలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలు అందజేయాలని సిఐడిని ఆదేశించింది. విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. సిఐడి వాదనలు విన్న తర్వాతే ముందస్తు బెయిల్ మంజూరు పిటిషన్‌పై తగిన ఉత్తర్వులు జారీ చేయగలమని న్యాయమూర్తి జస్టిస్ న్యాపతి విజయ్ గురువారం వెల్లడించారు. ఎపి ఎస్‌బిసిఎల్ ఫైళ్లను, కంప్యూటర్ పరికరాలను ఆ సంస్థ కార్యాలయం నుంచి వాసుదేవరెడ్డి కారులో తీసుకెళుతుంటే చూశానంటూ కంచికచర్లకు చెందిన గద్దె శివకృష్ణ ఫిర్యాదు మేరకు సిఐడి ఈ నెల 6న కేసు నమోదు చేసింది. ఈ కేసులో తనను అరెస్టు చేసే అవకాశం ఉందని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును వాసుదేవరెడ్డి ఆశ్రయించారు. సిఐడి స్పెషల్ పిపిగా ఎం లక్ష్మీనారాయణను, తనను సిఐడి సీనియర్ కౌన్సిల్‌గా ప్రభుత్వం నియమించిందని సీనియర్ అడ్వకేట్ పోసాని వెంకటేశ్వర్లు చెప్పారు. వివరాలు సమర్పించేందుకు గడువు కావాలని కోరారు. దీనిపై పిటిషనరు తరపున న్యాయవాది ఎస్ నగేష్ రెడ్డి కల్పించుకుని మధ్యంతర ముందస్తు బెయిల్ నిమిత్తం అనుబంధ వ్యాజ్యాన్ని వేశామన్నారు. రాజకీయ కక్షతో పిటిషనరుపై కేసు నమోదు చేశారన్నారు. గతంలో చంద్రబాబుపై ఫిర్యాదు చేసినందుకే వాసుదేవరెడ్డిపై కేసు నమోదు చేశారన్నారు. ఇప్పటికే పిటిషనర్ ఇంట్లో సోదాలు కూడా అయ్యాయని చెప్పారు. ఏడేళ్ల కన్నా తక్కువ శిక్షపడే కేసుల్లో సిఆర్‌పిసి సెక్షన్ 41ఏను అనుసరించాలన్నారు. పోసాని కల్పించుకుని, పిటిషనర్‌పై ఐపిసి సెక్షన్లు 409, 467, 471 కింద కూడా కేసులు నమోదయ్యాయని చెప్పారు. సోదాలు జరిగిన రోజున పిటిషనర్ ఢిల్లీలో ఉన్నారని, వాసుదేవరెడ్డి మామ, బావమరిది ఇళ్లల్లో కూడా సోదాలు జరిగాయన్నారు. వాసుదేవరెడ్డి కారులో కీలక పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. కారులో రూ.4 కోట్ల విలువ చేసే 6 కేజీల బంగారం 2023లో కొనుగోలుకు చెందిన బిల్లులు కూడా దొరికాయని చెప్పారు. బెయిల్ ఇస్తే సాక్ష్యాలు తారుమారవుతాయని చెప్పారు. వాదనల తర్వాత ముందస్తు బెయిల్ మంజూరుకు నిరాకరించిన హైకోర్టు, తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

గార్లదిన్నె ఎంపిపి పాఠశాలకు తాళం

- రెగ్యులర్ ఉపాధ్యాయుల కోసం విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు రూరల్ (కర్నూలు)



పాఠశాలకు తాళం వేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమిం చాలని డిమాండ్ చేస్తూ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం గార్లదిన్నె గ్రామ ఎంపిపి పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రు లు తాళం వేశారు. తాత్కాలికంగా పని చేస్తున్న ఉపా ధ్యాయుడిని పాఠశాల నుంచి బయటకు పంపించివేసి ఆందో ళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యారుల్థ తల్లిదండ్రులు మాట్లాడుతూ.. గతేడాది నుంచి ఎంపిపి పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులు లేక 90 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో ఉన్న రెగ్యులర్ ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారని, అప్పటి నుంచి ఒక్క రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించలేదని, తాత్కాలికంగా ఒక్క ఉపాధ్యాయుని మాత్రమే నియమించారని చెప్పారు. ఐదవ తరగతి పూర్తయిన విద్యార్థుల టిసిపై రెగ్యులర్ ఉపాధ్యాయుడి సంతకం కోసం విద్యార్థులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారని తెలిపారు. గతంలో ఈ సమస్యపై గ్రామస్తులందరమూ కలిసి జిల్లా విద్యాధికారులకు, మండల విద్యాధికారులకు విన్నవించామని తెలిపారు. సమస్యను పరిష్కరించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. గ్రామస్తులు సుధాకర్, దావీదు, రాజన్న, ప్రతాప్, దేవిపుత్ర, హుస్సేని, దినేష్ పాల్గొన్నారు.

శ్రేణులకు అండగా ఉండండి

(మొదటిపేజీ తరువాయి)

సభలో ప్రతిపక్షాన్ని గుర్తించాలన్నారు. కేంద్రంలో ఇప్పుడున్న పరిస్థితులు ఈ మధ్య కాలంలో ఎన్నడూ లేదు.కేంద్రంలో అధికారపార్టీ 240 సీట్లకు పరిమితమైంది. రాష్ట్రంలో టిడిపికి మంచి సంఖ్యలో సీట్లు రావడంతో పాటు ఎన్‌డిఎలో కీలకంగా ఉన్న పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి సమయంలో కూడా ప్రత్యేకహోదాను అడగకపోవడం చంద్రబాబు చేసిన శాపం. ఇలాంటి పరిస్థితుల్లో కూడా హోదా అడక్కపోతే, రాష్ట్రంలో ఏ ఒక్క యువకుడు కూడా క్షమించడు.' అని జగన్‌మోహన్ రెడ్డి అన్నారు.

విమల విద్యాలయం మూసివేత

(మొదటిపేజీ తరువాయి)

వస్తోంది. సిఎస్ఆర్ నిధుల కింద విడుదలవుతున్న పాఠశాల నిర్వహణ ఖర్చును భరించే బాధ్యత స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీసుకోకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. 1984లో ప్రారంభమైన ఈ పాఠశాల సుమారు నాలుగు దశాబ్దాలుగా పేద విద్యార్థులకు అండగా నిలుస్తోంది.

పాఠశాల వద్ద ఆందోళన

పాఠశాల మూసివేస్తున్నట్లు చెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న కార్మిక సంఘాల నేతలు, జివిఎంసి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పాఠశాల వద్దకు చేరుకొని విద్యార్థులకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా గంగారావు, సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ.. యథావిధిగా పాఠశాలను కొనసాగించాలని, దీనికోసం అలుపెరగని పోరాటం చేస్తామని హెచ్చరించారు. విద్యాలయం మూసివేతను నిరసిస్తూ శుక్రవారం స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్‌భట్ బంగ్లాను ముట్టడించాలని కార్మిక సంఘాల నాయకులు నిర్ణయించారు. పాఠశాల మూసివేత నిర్ణయంపై గాజువాక ఎమ్మెల్యే పలా శ్రీనివాసరావును విద్యార్థుల తల్లిదండ్రులు కలిశారు. యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వేట నిషేధ పరిహారం ఏదీ?

(మొదటిపేజీ తరువాయి)

సచివాలయాల్లో జాబితాలను ప్రదర్శించారు. 15 నుంచి 17వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించారు. 18, 19న అభ్యంతరాలను పరిష్కరించారు. మే 22న లబ్ధిదారుల వడపోత, జాబితా తయారీ చేపట్టారు. ఈనెల రెండో తేదీ నాటికి ప్రాథమిక జాబితా పూర్తయింది. ఆ జాబితా ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 1,30,128 మంది మత్స్యకారులను నమోదు చేశారు. వీరిలో ప్రాథమికంగా 1,05,387 మందిని అర్హులుగా గుర్తించారు. మత్స్యకార భరోసాకు గత ప్రభుత్వం విధించిన రకరకాల కారణాలతో 24,741 మందిని అనర్హులుగా పెండింగ్‌లో ఉంచారు. వీటిని కొత్త ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన తర్వాత పరిహారం చెల్లింపుపై ఒక స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.

పరిహారం చెల్లింపునకు డీజిల్ వాడకం మెలిక

మత్స్యకార భరోసా చెల్లింపునకు ప్రభుత్వం ఈసారి కొత్తగా డీజిల్ వాడకాన్ని మెలిక పెట్టింది. మత్స్యకారుల బోట్లకు ప్రభుత్వం ఏడాదికి లీటరుకు రూ.9 చొప్పున సబ్సిడీతో 300 లీటర్ల డీజిల్‌ను అందిస్తోంది. కనీసం వంద లీటర్లను కూడా వినియోగించని వారిని అనర్హుల జాబితాలో చేర్చినట్లు తెలుస్తోంది. పెండింగ్ జాబితాలో ఉన్న 24,741 మందిలో సుమారు 18 వేల మందిని ఈ నిబంధనతోనే అనర్హులుగా మారినట్లు తెలుస్తోంది. గతేడాది ఈ నిబంధన ఉన్నా మొదటిసారి మినహాయింపు ఇచ్చారు. ఈ సంవత్సరం ఆ నిబంధనను అమలు చేయాలని నిర్ణయించి అందుకనుగుణంగా జాబితాను తయారు చేశారు. వాస్తవానికి ఇందులో ప్రభుత్వ తప్పిదమే కనిపిస్తోంది. మత్స్యకారులకు సబ్సిడీపై డీజిల్ అందించేందుకు ప్రతి జిల్లాలో ప్రత్యేకంగా పెట్రోల్ బంకులను ప్రభుత్వం గుర్తించింది. ప్రభుత్వం కొందరు బంకు యజమానులకు సబ్సిడీ డబ్బులు సకాలంలో విడుదల చేయకపోవడం, సాంకేతిక కారణాలతో డీలర్లు మత్స్యకారులకు డీజిల్ అందించేందుకు నిరాకరించారు. దీంతో వారు వేరే బంకుల్లో నుంచి కొనుగోలు చేసి చేపల వేటకు వెళ్లారు. ప్రభుత్వ తప్పిదంతో తమను అనర్హులుగా చేయడమేమిటని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. ఆ నిబంధన తొలగించి చేపల వేటకు వెళ్లే ప్రతి ఒక్కరికి కొత్త ప్రభుత్వం పరిహారం అందించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

15 రోజుల్లో పరిహారం జమ

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులకు పరిహారం అందే విషయంలో జాప్యం జరిగింది. శుక్రవారంతో వేట విరామం సమయం ముగుస్తున్నందున మత్స్యకారులు యథావిధిగా చేపల వేటకు వెళ్ళవచ్చు. మరో 15 రోజుల్లో పరిహారం లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యే అవకాశం ఉంది.

\- కె.కరుణాకరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి, కాకినాడ

సిఎం ముఖ్యకార్యదర్శిగా రవిచంద్ర బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శిగా యం. రవిచంద్ర గురువారం సచివాలయం మొదటి బ్లాకులో బాధ్యతలు చేపట్టారు. అనంతరం పలువురు అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌ను రవిచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకముందు టిఆర్అండ్‌బి ముఖ్యకార్యదర్శి ప్రద్యుమ్న, గుంటూరు జిల్లా కలెక్టరు యం వేణుగోపాల్ రెడ్డి, ఎస్‌పి తుషార్ గూడి, న్యాయశాఖ కార్యదర్శి సత్యప్రభాకర్, ప్రొటోకాల్ డైరెక్టరు బాల సుబ్రమణ్యం రెడ్డి, సచివాలయ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కన్న తండ్రిని చంపిన కూతురు

- ప్రేమించిన యువకుడితో పెళ్లి చేయలేదని హత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ (వైఎస్ఆర్ జిల్లా)

కన్నకూతురే తండ్రిని హత్య చేసిన ఘటన వైఎస్ఆర్ జిల్లా మదనపల్లెలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి, సిఐ వల్లిబాషా తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఎగువకురవంక, స్థానిక ఆంజనేయ స్వామి గుడి వీధిలో నివాసముంటున్న ఈరపు ద్వారస్వామి (62) ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయనకు కుమార్తె హరిత ఉన్నారు. ఏడాదిన్నర క్రితం ఆయన భార్య లత అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నెలాఖరులో ద్వారస్వామి రిటైర్డ్ కానున్న నేపథ్యంలో హరితకు పెళ్లి చేయాలని నిశ్చయించుకున్నారు. తండ్రి కుదిర్చిన సంబంధం ఇష్టంలేదని, తాను మరో యువకుడిని ప్రేమించానని అతనితోనే పెళ్లి చేయాలని హరిత పట్టుబట్టింది. ఈ క్రమంలో తండ్రి కూతుర్ల మధ్య వాగ్వాదం జరుగుతోంది. బుధవారం రాత్రి మరో మారు ఘర్షణ పడగా ఆవేశానికి లోనైనా హరిత తండ్రిపై దాడి చేసి తీవ్రంగా కొట్టి చంపింది. డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి, సిఐలు వల్లిబాషా, శేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని మతదేహాన్ని పరిశీలించి ప్రభుత్వ సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. హరితను అదుపులోకి తీసుకొని విచారించగా తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. ప్రియుడి హస్తం కూడా ఉందా? మరి ఎవరి పాత్ర ఉందా అన్న కోణంలో విచారిస్తున్నట్లు డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి తెలిపారు.


పిన్నెల్లికి బెయిల్ పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి

పోలీసులు నమోదు చేసిన మూడు వేర్వేరు కేసుల్లో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి గతంలో మంజూరు చేసిన ముందస్తు బెయిల్ ఉత్తర్వులను హైకోర్టు ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించింది. ఈ మేరకు జస్టిస్ న్యాపతి విజయ్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. పిన్నెల్లిపై రెండు హత్యాయత్నం కేసులతోపాటు మరో కేసు నమోదైంది. పిన్నెల్లి తరపున సీనియర్ న్యాయవాది టి నిరంజన్‌రెడ్డి అభ్యర్థన మేరకు హైకోర్టు, గత మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. విచారణను ఈ నెల 20కు వాయిదా వేసింది.

నేరస్తులను వదిలిపెట్టం

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- శ్రీవారిని దర్శించుకున్న సిఎం దంపతులు



రంగనాయకుల మండపంలో అధికారులు, స్థానిక నాయకులతో సిఎం చంద్రబాబు కుటుంబం

ప్రజాశక్తి - యంత్రాంగం

నేరాలు చేసి తప్పించుకోవాలంటే వదిలిపెట్టమని, నేరం వేరే వాళ్లపై వేయడానికి ప్రణాళికలు వేసిన నేరస్తుడికే శిక్ష వేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తిరుమల శ్రీవారిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దర్శించుకున్నారు. గురువారం ఉదయం తనతోపాటు సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేష్, కోడలు బ్రహ్మిణి, మనవడు దేవాన్ష్‌తో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా చంద్రబాబు కుటుంబ సభ్యులు వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. మహద్వారం వద్దకు చేరుకోగానే ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న శ్రీబేడి ఆంజనేయ స్వామి వారిని దర్శించుకొని మొక్కు తీర్చుకున్నారు. దర్శనం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీవారి సన్నిధిలో రాజకీయం మాట్లాడటం సబబు కాదని, దొంగలే దొంగ దొంగ అంటూ గత ప్రభుత్వంలో వ్యవహరించారని విమర్శించారు. తిరుమలను ధనార్జన కేంద్రంగా మార్చారని అన్నారు. గంజాయి, అన్యమత ప్రచారం, మద్యం, మాంసం అంటూ విచ్చలవిడిగా గత ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. ఇష్టానుసారంగా తమకు నచ్చిన వారికి పదవులు ఇచ్చారని, ఎర్ర చందనం స్మగ్లర్లకు సీట్లు ఇచ్చారని ఆరోపించారు. దఢ సంకల్పంతో చెడును అణచివేస్తామని తెలిపారు. అనంతరం చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. టిటిడి జెఇఒ వీరబ్రహ్మం ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.

దుర్గమ్మకు మొక్కుల చెల్లింపు

విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్లను సిఎం చంద్రబాబు దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తిరుమల పర్యటన ముగించుకుని ఇంద్రకీలాద్రికి చేరుకున్న సిఎం దంపతులకు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఆర్‌జెసి రత్నరాజు, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎస్.రామరావు, విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంతరాలయంలో దుర్గమ్మకు సిఎం దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

త్వరలోనే అందరినీ కలుస్తా..

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అఖండ మెజార్టీతో గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను ఈ నెల 20వ తేదీ తర్వాత కలుస్తానని జనసేన పార్టీ అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించాల్సి ఉందని, శాసనసభ సమావేశాలు కూడా త్వరలోనే ఉంటాయని, వీటన్నింటినీ పూర్తి చేసుకుని ప్రజలను కలుస్తానని ఆయన గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పిఠాపురం అనంతరం జిల్లాల వారీ అందరినీ కలుస్తానని, ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను పార్టీ కేంద్ర కార్యాలయం త్వరలోనే తెలియజేస్తుందని వివరించారు. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక నలువైపుల నుంచి అభినందనలు, శుభాకాంక్షలు అందుతూనే ఉన్నాయి. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు, మేధావులు, నిపుణులు, సినీరంగంలో ఉన్నవారు, యువత, రైతులు, ఉద్యోగవర్గాలు, మహిళలు అభినందిస్తున్నారు. ప్రతిఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు' అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

రెండు రోజులపాటు వర్షాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రుతుపవనాల ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులపాటు వర్షాలు పడతాయని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రస్తుతం తెలంగాణ నుంచి బంగాళాఖాతం మధ్య ప్రాంతాల వరకు ద్రోణి విస్తరించి ఉందని, దీని ప్రభావంతో శుక్రవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం కూడా పైన పేర్కొన్న జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడతాయన్నారు. కాగా, గురువారం సాయంత్రం నాటికి ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో 45.7 మిల్లీమీటర్లు, బాపట్ల జిల్లా పర్చూరులో 32.54 మి.మీ, సత్యసాయి జిల్లా కదిరిలో 20.5 మి.మీ, అన్నమయ్య జిల్లా పెదతిప్పసముద్రంలో 18.5 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైందని ఆయన తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-నార్పల (అనంతపురం)



రామ్మోహన్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా నార్పల మండలం బి.పప్పూరు గ్రామంలో గురువారం వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన రామ్మోహన్‌రెడ్డి (44)కి నాలుగు ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. బోరు, వర్షాధారం కింద వేరుశనగ, వరి తదితర పంటలు సాగు చేసేవారు. సాగు నిమిత్తం దాదాపు రూ.10లక్షల వరకు అప్పులు చేశారు. పంటలు చేతికందకపోవడంతో అప్పుల భారం అధికమైంది. రుణదాతల ఒత్తిడి తాళలేక ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి పోయారు. ఈ క్రమంలో గురువారం ఉదయం నార్పల మండలం బి.పప్పూరులోని అరటి తోటలో ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడు రామ్మోహన్‌రెడ్డిగా పోలీసులు గుర్తించారు. అప్పులబాధ భరించలేక ఇంటి నుంచి బయటకు వచ్చిన రోజునే పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

క్షత్రియులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి

- ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

క్షత్రియులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పశ్చిమగోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు కోరారు. పెదఅమిరం గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. క్షత్రియులను గుర్తించలేదని అనుకోవద్దని, ఇంకా సమయం ఉందని, పదవులు ఉన్నాయని తెలిపారు. చట్ట సభలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు జాగ్రత్తగా పనిచేయాలని సిఎం చంద్రబాబు ఆదేశించారని చెప్పారు. పవన్ కల్యాణ్‌కు గ్రామీణాభివృద్ధి శాఖ ఇస్తారని తెలుస్తోందని, ఆయన సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి చేస్తామన్నారు.

వేధింపుల ఘటనపై ఫిర్యాదు

వైసిపి హయాంలో కస్టడీలో తనపై వేధింపులకు పాల్పడ్డారని, ఈ ఘటనపై ఇప్పటికే ఫిర్యాదు చేశానని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో కారకులపై కేసు కూడా నమోదవుతుందన్నారు. ఓదార్పు యాత్ర 2.0 స్టార్ట్ చేస్తారేమోనని జగన్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. తమ నేతలపై టిడిపి వారు దాడి చేశారని ఢిల్లీలో విజయసాయిరెడ్డి గొడవ చేశారని, వైసిపి వారు ఎంత దుర్మార్గులో తన కంటే తెలిసిన వారెవ్వరూ లేరన్నారు.



మద్యం దుకాణం వద్ద ధర్నా చేస్తున్న సిబ్బంది

మద్యం దుకాణాల సిబ్బంది ధర్నా

- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బంది గురువారం విజయనగరంలోని అయ్యన్నపేట మద్యం దుకాణం వద్ద ధర్నా నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల నేతలు సాయిరెడ్డి, కొసర దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో 580 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు మద్యం దుకాణాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. నూతన మద్యం పాలసీ ద్వారా ప్రభుత్వ మద్యం దుకాణాలు ఎత్తి వేసి పాత విధానంలో కొనసాగిస్తారని ప్రచారం జరుగుతోందన్నారు. ఇదే జరిగితే తాము ఉద్యోగాలు కోల్పోతామని, తమతోపాటు తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా విధులుగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్నామని, తమకు ఉద్యోగ భద్రత కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ధర్నాలో యూనియన్ నేతలు, ఎపి బేవరేజెస్ కార్పొరేషన్ సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌లు, సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో కనిపించని 'జన్‌మన్'

- అందని ద్రాక్షగా మిగిలిన కేంద్ర పథకం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గిరిజన ప్రాంతాల్లో మౌళికాభివృద్ధి కోసం కేంద్రం అమలు చేస్తున్న జన్‌మన్ పథకం ఆశించిన ఫలితాలను అందించడం లేదు. బ్యాంకుల ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు చెప్పడమే తప్ప క్షేత్ర స్థాయిలో కనిపించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. మారుమూల గిరిజన గ్రామాలను గుర్తించి అక్కడ ఉన్న గిరిజనులకు ప్రయోజనాలు కల్పించే ఉద్దేశ్యంతోనే ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. గతేడాది నవంబర్‌లో ప్రధానమంత్రి జన్‌మన్ (జన్‌జాతి ఆదివాసీ నయయ మహ అభియాన్) పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలను గుర్తించారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ఏలూరు, నంద్యాల, పల్నాడు, ప్రకాశం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని అత్యంత మారుమూల గిరిజన గ్రామాల్లో ఈ పథకాన్ని వర్తింపచేయాలని నిర్ణయించారు. 14 బ్యాంకుల ద్వారా 3,525 ప్రాంతాలను గుర్తించి అక్కడ సంక్షేమ పథకాలను గిరిజనులకు అందించాలన్నది లక్ష్యం. అత్యధికంగా గ్రామీణ వికాస బ్యాంకుకు 1151 ప్రాంతాలను కేటాయించగా, యూనియన్ బ్యాంకుకు 922, స్టేట్‌బ్యాంకుకు 835 ప్రాంతాలను కేటాయించారు. పివిటిజి (పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్) లలో సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో అభివృద్ధి కోసం ప్రారంభించిన ఈ పథకం అమలుకు నోచుకోకపోవడం పట్ల అధికార యంత్రాంగమే పెదవి విరుస్తోంది.

వైఎస్ఆర్ జిల్లా పేరును వైఎస్ఆర్ కడపగా మార్చాలి

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి డిమాండ్

ప్రజాశక్తి - వేంపల్లె (వైఎస్ఆర్ జిల్లా)

వైఎస్ఆర్ జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్ తులసిరెడ్డి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ జిల్లా వేంపల్లెలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1808లో కడప జిల్లా ఏర్పాటైందన్నారు. వైఎస్ఆర్ మరణానంతరం ఆయన జ్ఞాపకార్థం కడప జిల్లాను వైఎస్ఆర్ జిల్లాగా మార్చారని, అప్పుడే తనతో పాటు అనేక మంది జిల్లా ప్రజలు వైఎస్ఆర్ కడప జిల్లా అని పేరు పెడితే సమంజసంగా ఉంటుందని చెప్పారని తెలిపారు. అటు రాజశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఇటు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి గుర్తుగా ఉభయ తరణిగా ఉంటుందని ప్రభుత్వానికి సూచించినట్లు తెలిపారు. కాని ఆ ప్రయత్నం సఫలీకృతం కాలేదని చెప్పారు. ఇప్పుడైనా నూతన ప్రభుత్వం అన్ని కోణంలో ఆలోచించి వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చాలని కోరారు.

22న జిఎస్‌టి కౌన్సిల్ భేటీ

న్యూఢిల్లీ : ఏడు నెలల తర్వాత జిఎస్‌టి కౌన్సిల్ భేటీ కానుంది. జూన్ 22వ తేదీన న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ నెల 22న ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 53వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఆయా రాష్ట్రాలకు చెందిన ఆర్థిక మంత్రులు హాజరుకానున్నట్లు జిఎస్‌టి కౌన్సిల్ ఓ ట్వీట్‌లో వెల్లడించింది. కాగా.. ఈ సమావేశంలో ఏ అంశాలను చర్చించనున్నారో ప్రకటించలేదు. గతేడాది అక్టోబర్ 7న చివరిసారిగా జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం జరిగింది. అందులో క్యాసినో, గుర్రపు పందేలు, ఆన్‌లైన్ గేమింగ్‌లపై 28 శాతం పన్నులను విధించారు.

కార్పొరేట్లకు రూ.5 లక్షల కోట్ల రుణాలు..!

- అప్పులకు పెరిగిన డిమాండ్
- సాఫీగా రిటైల్, ఎంఎస్ఎంఇ రుణాలు
- ఈ ఏడాది 16% వృద్ధి అంచనా
- ఎస్‌బిఐ చైర్మన్ దినేష్ ఖరా వెల్లడి

న్యూఢిల్లీ : కార్పొరేట్ల రుణాల డిమాండ్‌లో భారీ పెరుగుదల ఉందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) చైర్మన్ దినేష్ కుమార్ ఖరా అన్నారు. బడా పారిశ్రామికవేత్తలకు సంబంధించి ప్రస్తుతం రూ. 5 లక్షల కోట్ల విలువైన రుణాల జారీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కార్పోరేట్‌ల వద్ద పుష్కలంగా నగదు నిల్వలు ఉన్నప్పటికీ.. ఇంతక్రితం మాదిరిగా కాకుండా, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, సామర్థ్య విస్తరణకు నిధులు సమకూర్చేందుకు రుణాలను కోరుతున్నారని తెలిపారు. టర్మ్ లోన్ శాతాన్ని 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గించామన్నారు. వర్కింగ్ మూలధనం వినియోగంలో పెరుగుదల ఉందని.. ప్రస్తుత రుణ డిమాండ్ స్పష్టం చేస్తుందన్నారు. ఈ మార్పులు గణనీయమైన ప్రయివేటు రంగ అవకాశాలను సూచిస్తాయని ఖరా తెలిపారు. రుణాల విలువను సృష్టించేందుకు ఎస్‌బిఐ మంచి స్థానంలో ఉందన్నారు.

ప్రాసెసింగ్ ప్రక్రియలోని కొత్త ప్రతిపాదనలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. దాదాపు రూ.5 లక్షల కోట్ల విలువ చేసే అప్పుల కోసం తమ వద్ద కార్పొరేట్లు ప్రతిపాదనలు పెట్టారన్నారు. ఈ ఏడాది రిటైల్, వ్యవసాయం, ఎంఎస్ఎంఇ రుణాల రంగాలలో 16 శాతం వృద్ధి చోటు చేసుకోవచ్చని అంచనా వేశారు. రిటైల్, అగ్రికల్చర్, ఎంఎస్ఎంఇ రుణాలకు సంబంధించి తమకు ఎలాంటి సవాళ్లు లేవని ఖరా తెలిపారు. ఈ రంగాలకు గత ఆర్థిక సంవత్సరం 2023-24లో రూ.21 లక్షల కోట్ల రుణాలు జారీ చేశామన్నారు. అధిక వడ్డీ రేట్లు ఉన్నప్పటికీ ఎస్‌బిఐ రిస్క్ అసెస్‌మెంట్, పూచీకత్తు ప్రక్రియల పటిష్టంగా ఉందన్నారు.

వడ్డీ రేట్ల ప్రభావం రుణ పుస్తకం నాణ్యతపై ప్రభావం చూపిస్తాయని భావించడం లేదన్నారు. గృహాలు, వాహన రుణాలపై ఎలాంటి ఒత్తిడి లేదన్నారు. మొత్తం రిటైల్ పోర్ట్‌ఫోలియోలో స్థూల ఎన్‌పిఎలు 0.7 శాతంగా మాత్రమే ఉన్నాయన్నారు. ఇది తమ పూచీకత్తు ప్రమాణాలు, సరైన నాణ్యమైన వ్యాపారాన్ని ఎంచుకునే తమ సామర్థ్యానికి నిదర్శనమన్నారు. తనఖా, కారు రుణాలను పూచీకత్తుతో చెల్లించడంతో తమకు అవకాశాలు పెరుగుతున్నాయని.. ఈ విభాగాల్లో ఎటువంటి సవాళ్లు లేవన్నారు.

నూతన బీమా ప్రీమియంలో 15% వృద్ధి

ముంబయి : దేశంలోని జీవిత బీమా కంపెనీల నూతన బీమా ప్రీమియం, పాలసీల్లో పెరుగుదల నమోదయ్యింది. ప్రస్తుత ఏడాది మేలో జీవిత బీమా కంపెనీల నూతన వ్యాపార ప్రీమియం (ఎన్‌బిపి) 15.5 శాతం పెరిగిందని లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ గణంకాలు వెల్లడించాయి. గడిచిన నెలలో పరిశ్రమ ప్రీమియం ఆదాయం రూ.27,034.2 కోట్లుగా నమోదయ్యింది. 2023 ఇదే నెలలో రూ.23,477.8 కోట్ల ప్రీమియం వసూల్లయ్యింది. గత మే నెలలో వ్యక్తిగత జీవిత బీమా కొత్త పాలసీలు 12.45 శాతం పెరిగి 18,68,096గా నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలో కొత్తగా 16,61,324 పాలసీలు జారీ అయ్యాయి. 2024 మేలో గ్రూపు పాలసీ ప్రీమియం వసూళ్లు 13.15 పెరుగుదల చోటు చేసుకుంది. వ్యక్తిగత, కార్పొరేట్ వినియోగదారుల నుండి మెరుగైన బీమా రక్షణకు బలమైన డిమాండ్ చోటు చేసుకుందని లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ తెలిపింది. ఇది బీమా విస్తరణలో భవిష్యత్ పురోగతికి అవకాశాలను సృష్టిస్తోందని పేర్కొంది.



బిఎండబ్ల్యు కొత్త బైక్.. రూ.20.95 లక్షలు

న్యూఢిల్లీ : బిఎండబ్ల్యు మోటారోడ్ తన ఆర్ 1300 జిఎస్‌ను ఆవిష్కరించింది. ఎక్స్‌షోరూం ధర రూ.20.95 లక్షలతో గురువారం దీన్ని భారత మార్కెట్లోకి విడుదల చేసింది. ఇప్పటికే మార్కెట్లో అందుబాటులో ఉన్న బిఎండబ్ల్యు ఆర్ 1250 జిఎస్ కంటే రూ.40వేలు ఎక్కువ. కాగా.. కొత్త బైక్ ఆర్ 1300 జిఎస్ బైక్ 1300సిసి లిక్విడ్ కూల్డ్ బాక్సర్ ట్విన్ ఇంజన్‌తో ఆవిష్కరించింది. ఇంజిన్ 6 స్పీడ్ గేర్‌బాక్స్‌తో డిజైన్ చేసింది. ఈ బైకు దాదాపు 237 కిలోలు బరువుంటుంది.

బిగ్ సిలో సామ్‌సంగ్ గెలాక్సీ ఎఐ సూపర్ సేల్

హైదరాబాద్ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ తన గెలాక్సీ ఎఐ సిరీస్ మొబైల్స్‌ను తాము అందుబాటులోకి తెచ్చామని బిగ్ సి ఫౌండర్, సిఎండి బాలు చౌదరి తెలిపారు. ఈ ఫోన్ల సూపర్ సేల్ తమ సంస్థ షోరూమ్‌లలో జూన్ 14 తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు. అంతర్జాతీయంగా అత్యంత పేరు ప్రఖ్యాతులు పొందిన గెలాక్సీ ఎఐ సిరీస్ మొబైల్ ఫోన్ల సూపర్ సేల్ తెలుగు రాష్ట్రాలలోని తమ షోరూంలల్లో లభ్యమవుతాయన్నారు. వీటి ప్రారంభపు ధర రూ.39,999గా ఉందన్నారు. సర్కిల్ టు సెర్చ్, లైవ్ ట్రాన్స్లేట్, చాట్ అసిస్ట్, నోట్ అసిస్ట్, 50 ఎంపి అడాప్టివ్ పిక్సెల్ టెక్నాలజీ తో కూడిన కెమెరా, నైటోగ్రఫీ, ఎఐ ఎడిట్ కెమెరా, గేమింగ్, స్నాప్ డ్రాగన్ 8 జెన్ 3, బిగ్గర్ వేపర్ ఛాంబర్ తదితర అత్యంత అధునాతన ఫీచర్లు ఈ ఫోన్‌లో ఉన్నాయన్నారు. వీటిని జీరో డౌన్ పేమెంట్, 24 నెలల నో కాస్ట్ ఇఎంఐ వంటి సదుపాయాలు లభిస్తాయని తెలిపారు. వీటి కొనుగోళ్లపై రూ.16000 వరకు ఇన్ స్టంట్ క్యాష్ బ్యాక్, రూ 18,000 వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ వంటి ఆకర్షణీయమైన ఆఫర్లు లభిస్తాయన్నారు.



శాంసంగ్ గెలాక్సీ AI సూపర్ సేల్ మరియు ఆఫర్లను ఆవిష్కరిస్తున్న బిగ్ 'సి' సంస్థ ఫౌండర్ మరియు సి.యం.డి. శ్రీ యం. బాలు చౌదరి

లారీ ఢీకొని దంపతులు మృతి

ప్రజాశక్తి-మేదరమెట్ల (బాపట్ల జిల్లా)

ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో దంపతులు మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా రొంపిచర్ల గ్రామం సుబ్బారెడ్డి కాలనీకి చెందిన బత్తుల కొండలు (49), లక్ష్మి (41) దంపతులు తమ పెద్ద కుమార్తె అత్తగారి గ్రామమైన ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామంలో నిర్వహిస్తున్న దేవుడి కొలుపులకు వెళ్లారు. తిరిగి ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తుండగా మేదరమెట్ల సమీపంలో రాంగ్‌రూట్‌లో వస్తున్న లారీ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో దంపతులిద్దరూ అక్కడికక్కడే మరణించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు పోలీసులు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపాదకీయం

ఆకాంక్షలు నెరవేర్చాలి

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రజా సమక్షంలో నాలుగోసారి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేశారు. 17 మంది కొత్త వారితో సహా 24 మందితో తన మంత్రి మండలి జట్టును కూడా ప్రకటించారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా విచ్చేసి, కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు చెప్పారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రమాణ సమయంలో కార్యకర్తల హర్షాతిరేకాలతో సభాప్రాంగణం మార్మోగిపోయింది! జూన్ 4న టిడిపి కూటమి విజయ కేతనం ఎగురవేయడంతో మొదలైన కూటమి శ్రేణుల సందడి నిన్నటి ప్రమాణ స్వీకారంతో పతాకస్థాయికి చేరింది. గురువారం చంద్రబాబు బాధ్యతలు స్వీకరించి, కొన్ని ఎన్నికల వాగ్దానాలపై తొలి సంతకాలు చేయడంతో పాలనాపర్వం మొదలైంది. వివిధ తరగతుల ప్రజలు పెట్టుకున్న ఆశలను, ఆకాంక్షలనూ నెరవేర్చే విధంగా కొత్త ప్రభుత్వం ఇక ముందుకు సాగవల్సి ఉంటుంది. నిరంకుశ విధానాలు, ప్రజలపై భారాలూ అమలు చేస్తే జనం ఎలా స్పందిస్తారో గత ప్రభుత్వ అనుభవాన్ని సదా గుర్తు పెట్టుకోవాల్సి ఉంటుంది.

విభజిత రాష్ట్రానికి రెండోసారి ముఖ్యమంత్రిగా ఎన్నికైన చంద్రబాబుకి, ఆయన మంత్రివర్గానికి ఇది చాలా బాధ్యతాయుత కాలం. రాష్ట్రం విడివడి పదేళ్లు గడచిపోయాక కూడా విభజన హామీలు నెరవేరలేదు. రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటునివ్వాల్సిన కేంద్రంలో ఈ పదేళ్లూ బిజెపియే అధికారంలో ఉంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల వ్యవధిలోనే ప్రత్యేక హోదా హామీకి మోడీ షా ప్రభుత్వం మంగళం పాడేసింది. మనం హక్కుగా పొందాల్సిన విభజన హామీలు చూస్తుండగానే తీవ్రమైన నిర్లక్ష్యానికి గురయ్యాయి. రైల్వే జోను మంజూరు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు, వివిధ సంస్థల ఏర్పాటు వంటి కీలక బాధ్యతల నుంచి కేంద్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా తప్పుకొంది. తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ మూడు రాజధానుల జపం చేసినప్పుడు మోడీ ప్రభుత్వం గోడ మీద పిల్లిలా అవకాశవాదాన్ని ప్రదర్శించింది. తన వైఖరిని స్పష్టం చేయకుండా నాన్చి, రాష్ట్ర ప్రభుత్వానిదే తుది నిర్ణయమని తేల్చి, రాష్ట్రానికి తీవ్రమైన ద్రోహం చేసింది.

అలాంటి బిజెపి ఇప్పుడు చంద్రబాబు మద్దతు తప్పనిసరైన పరిస్థితుల్లో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఒకరికొకరు చాలా కీలకమూ, అవసరమూ అన్నంత ప్రదర్శన మోడీ - చంద్రబాబుల్లో బయటికి బ్రహ్మాండంగా కనిపిస్తోంది. 2014లో వలె రాష్ట్రంలో బిజెపి అధికారాన్ని పంచుకుంటుంటే, కేంద్రంలో టిడిపి మంత్రిపదవులను అంది పుచ్చుకొంది. అయితే, బిజెపి సహజంగానే తన మిత్రులకు సమాన ప్రాతినిధ్యం ఇవ్వదని, సంపూర్ణ విశ్వాసం చూపదని అనేక రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీల అనుభవం. గతంలో చంద్రబాబు కూడా దీనిని చవి చూశారు కాబట్టి, అప్రమత్తంగా ఉండాలి.

రాష్ట్ర ప్రభుత్వం తొలినాళ్ల నుంచీ రాష్ట్ర ప్రయోజనాలే ప్రప్రథమ ప్రాధాన్య బాధ్యతగా తలకెత్తుకొని పనిచేయాలి. కేంద్ర బిజెపి మన రాష్ట్రానికి చేయాల్సింది చేయకపోగా, తెలుగు జాతి పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును కార్పొరేటు పరం చేయటానికి పూనుకొంది. ఏళ్ల తరబడి మొక్కవోని దీక్షతో ఉక్కు కార్మికులు సాగిస్తున్న నిరవధిక పోరాటమే దానిని ఇన్నాళ్లూ భద్రంగా ఉంచగలిగింది. చంద్రబాబు ప్రభుత్వం పూనుకొని, విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే నిలబెట్టి, సొంత గనులూ సాధించాలి. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో సహా అన్ని విభజన హామీలూ ఆచరణలోకి వచ్చేలా నిక్కచ్చిగా, నిరంతరాయంగా పనిచేయాలి. రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తి, నిర్వాసితులకు సంపూర్ణంగా పరిహారం, పునరావాసం కల్పన వంటి కీలక బాధ్యతలను నెరవేరుస్తూనే- ఎన్నికల ప్రాంగణంలో ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలనూ అమలు చేయాలి. మోడీ షాల మాటల మాయోపాయంలో కాలహరణం జరిగిపోకుండా తొలిరోజు నుంచీ న్యాయబద్ధమైన రాష్ట్ర హక్కుల కోసం, ప్రకటిత హామీల అమలు కోసం గొంతెత్తాలి. తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదంతో ఎన్‌టి రామారావు స్థాపించిన పార్టీ రాష్ట్రాల హక్కుల పరిరక్షణకు గట్టిగా పనిచేయాలి.

సందర్భం



అన్యాయం చట్టమైనప్పుడు ఎదిరించడమే నీ బాధ్యత కావాలి.
- చేగువేరా

జననం: 14.6.1928
మరణం: 9.10.1967

నరేంద్ర మోడీకి పరమాత్ముడు రాసిన లేఖ

విశ్లేషణ

తనకు తన తల్లితో బయలాజికల్‌గా సంబంధం లేదని, లాజిక్ లేకుండా తనను ఆ పరమాత్ముడే నేరుగా ఈ భూమి మీదికి పంపాడనీ భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించుకున్న నేపథ్యంలో-ప్రముఖ జర్నలిస్ట్ రవీష్ కుమార్ ప్రజెంటేషన్‌కు అనుసరణగా...తెలుగు పాఠకుల కోసం 'నరేంద్ర మోడీకి ఆయన చెప్పిన పరమాత్ముడు రాసిన లేఖ'ను పొందుపరుస్తున్నాను.

ఇంగ్లీషులో ప్రారంభమైన ఉత్తరంలోని ప్రారంభ వాక్యాల సారాంశం ఇలా ఉంటుంది.

ప్రియమైన నరేంద్ర,

నిన్ను ఎవరు భూమి మీదికి నేరుగా పంపించాడని చెప్పుకుని తిరుగుతున్నావో...ఆ నేను-పరమాత్మను!!

అసలు నీ ఐడియానే నాకు నచ్చలేదు-నేను ఎవరికీ అధికారిక పత్రం ఇవ్వను. వాళ్ళు మూల మూలలకూ వెళ్ళి నేను పంపించానని చెప్పుకుని తిరగడానికి ఈ పరమాత్ముడు అలా ఎవ్వరినీ పంపించడు. పరమాత్ముడి స్థాయి వేరే ఉంటుంది నరేంద్రా? నువ్వు అర్థం చేసుకోలేవు. అయన మృత్యులోకానికి సుదూరంలో ఉంటాడు. ఆయన చదివేవి కేవలం శ్లోకాలు. నీ లాగా జనానికి శోకాన్ని పంచడు. మోసాలు చేయడు.




డా॥ దేవరాజు మహారాజు

ప్యారే నరేంద్ర! ఆగే కి బాత్ హిందీమె కహనా చాహతా హూ- హిందీలో ఎందుకంటే. నీకు చదువు లేదని, ఇంగ్లీషు రాదని నాకు తెలుసు కదా? నేను నిన్ను నేరుగా భూమి మీదికి పంపలేదు. అన్ని జీవుల్లాగే నువ్వూ పుట్టావు. కానీ మనిషిగా పుట్టిన విషయం మరిచిపోయ్యావు. నువ్వు నా పేరుని వాడుకుని నాకు ద్రోహం చేశావు. నన్ను అప్రతిష్ట పాలు చేశావు.

జంబూ ద్వీపానికి ఒక నియమం ఉంది. ఇక్కడికి వచ్చిన వారు వెళ్ళిపోక తప్పదు. కుర్చీలు కూడా మారుతూ ఉంటాయి. కుర్చీలో కూర్చునే నియమాలూ, పద్ధతులు కూడా మారుతూ ఉంటాయి. కుర్చీలో కుర్చునే నియమాలూ, పద్ధతులు కూడా మారుతూ ఉంటాయి. వేరు వేరు భూభాగాల్లోని మానవులు వారి వారి శక్తులను సంకలన పరుచుకుని, రాజ్యాంగమనేది రూపొందించుకున్నారు. దాన్ని మించిన శక్తి వారికి మరొకటి లేదు. ఒకవేళ భగవంతుడే అంటే నేనే-భూమికి దిగి వచ్చినా అక్కడి ప్రజాస్వామ్య విలువల్ని కాపాడుతూ రాజ్యాంగబద్ధంగా పని చేయాల్సిందే! ఎందుకంటే, అక్కడ రాజ్యాంగమే ప్రధాన అంగం. అదే విధి, విధానం! ప్రజాస్వామ్య దేశాలలో దేవుడూ విధి వంటివి ముఖ్యం కాదు. రాజ్యాంగమే ముఖ్యం. విధి విధానాలన్నీ రాజ్యాంగబద్ధంగా నడవాల్సిందే. వారి పరమాత్మ ఎవరన్నది ఈ ఎన్నికల్లో దేశ ప్రజలు ఎలుగెత్తి చెప్పారు. రాజ్యాంగమే వారి పరమాత్మ, దాని ఆత్మే వారి నాగరికత!

నాకు కన్యాకుమారి చాలా ఇష్టం! కానీ, నువ్వు కాశీలో ఉండాల్సిన సమయంలో కాశీలో లేవు. భారత దేశం లోని అసంఖ్యాక ప్రజలు వారి వారి ఇల్లూ ముంగిలి, సంసారాలు వదిలేసి కాశీకి వచ్చారు. కానీ, నువ్వేం చేశావ్? కాశీలో లేకుండా కన్యాకుమారికి వెళ్ళిపోయావు. కాశీ ప్రజలు నీకు ఎందుకు తక్కువ ఓట్లిచ్చారో ఆలోచించావా? ఈ పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక వేషధారణలో తిరగొచ్చు. కానీ, ఆ కాశీ విశ్వేశ్వరుడి ఆదేశం ఎప్పుడైనా పాటించావా? విశ్వాస పాత్రులైన వారు మరి, ఆదేశాలు తప్పక పాటించాలి కదా? అది అందరి కర్తవ్యం. ఇతర పార్టీలను చీల్చగూడదు. వారి ఇళ్ళు కూల్చగూడదు. ప్రతిపక్ష నాయకులను జైల్లో వేయగూడదు. భిన్నమైన ఆలోచనా ధోరణిగల వారిని చంపించగూడదు-అని కదా ఆ దేవుడి ఆదేశం? పాటించావా మరీ? ఆ- ఒకవేళ నిన్ను పాలించమని ప్రజలు నీకు అత్యధికంగా సీట్లిస్తే వెళ్ళు. హాయిగా పరిపాలన చెయ్. ప్రజా సంక్షేమం చూడు-అంతే!!



> **కాశీ ప్రజలు నీకు ఎందుకు తక్కువ ఓట్లిచ్చారో ఆలోచించావా? ఈ పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక వేషధారణలో తిరగొచ్చు. కానీ, ఆ కాశీ విశ్వేశ్వరుడి ఆదేశం ఎప్పుడైనా పాటించావా? విశ్వాస పాత్రులైన వారు మరి, ఆదేశాలు తప్పక పాటించాలి కదా? అది అందరి కర్తవ్యం. ఇతర పార్టీలను చీల్చగూడదు. వారి ఇళ్ళు కూల్చగూడదు. ప్రతిపక్ష నాయకులను జైల్లో వేయగూడదు. భిన్నమైన ఆలోచనా ధోరణిగల వారిని చంపించగూడదు-అని కదా ఆ దేవుడి ఆదేశం? పాటించావా మరీ? ఆ- ఒకవేళ నిన్ను పాలించమని ప్రజలు నీకు అత్యధికంగా సీట్లిస్తే వెళ్ళు. హాయిగా పరిపాలన చెయ్. ప్రజా సంక్షేమం చూడు-అంతే!!**

ఆ స్వామి, ఆ విశ్వేశ్వరుడు మూడు లోకాలు పాలించడం లేదా? ఒక లోకానికి మరో లోకానికీ మధ్య ద్వేషం పెంచుతున్నాడా? కుల మతాలను, లింగ భేదాలకూ అతీతంగా ఆ భగవంతుడు అందరినీ సమంగా ప్రేమించడం నువ్వు చూడలేదా? ఏం నీకు కళ్ళు మూసుకు పొయ్యాయా? ఎవరి పట్లా కక్ష చూపడు కదా? ఎవైనా పొరపాట్లు జరిగితే అవి మానవ మాత్రుల అహంకారం వల్ల జరిగేవే, దేవుడి వల్ల కాదు- దేవుడన్న వాడికి మాయా వ్యామోహాలు ఉండవు. దేవుడి పుత్రుణ్ణని చెప్పుకునే నువ్వు ఆ మాయా మోహాలు దాటుకుని ఎందుకు రాలేదూ? తుచ్ఛ మానవుడిలా ప్రవర్తిస్తూ అందరి కన్నా ఉన్నతమైన వాడిననే భ్రమలో బతుకుతున్నావు.

ఘోరంగా విఫలమై ఓడిపోయినా, నైతిక బాధ్యత వహిస్తున్నావా? లేదే? ఇంకా ఎందుకు విర్రవీగుతున్నావ్? ఇంకా నీకు అధికారం మీద, కుర్చీ మీద వ్యామోహమే పోలేదు. నువ్వు దేవుడి పుత్రుణ్ణని ఎలా ప్రకటించుకున్నావ్? కొంచెమైనా సిగ్గుపడాలి కదా? నిజాయితీ, నిబద్ధత గల సామాన్య పౌరులు దేశంలో ఎంతో మంది ఉన్నారు. నీతి, నిజాయితీల విషయంలో ఎంతటి అధమ స్థాయిలో ఉన్నావో ఇకనైనా నువ్వు ఆలోచించుకో.

చెప్పు, నరేంద్రా! చెప్పు-నువ్వు కన్యాకుమారి వెళ్ళావు. ఆధ్యాత్మికతకు ఉండే మహోన్నతమైన స్థానాన్ని, హుందాతనాన్ని నువ్వు నవ్వులపాలు చేశావ్. గేలి చేశావ్. చులకన చేశావ్. పరమాత్ములమైన మేము ఇలాంటి తప్పిదాలు చేయము. సత్య మార్గాన్ని, న్యాయ మార్గాన్ని అనుసరించు. న్యాయాన్ని అభినయంతో జత పరచకు నరేంద్రా. అది ఘోరమైన తప్పిదం. అవి రెండూ వేరు వేరు. అభినయమంటే నటన- నటనతో ప్రజలకు న్యాయాన్ని అందించలేవు. నువ్వే కాదు. నీ గ్రూపులో చేరే కుట్రదారులు, వెన్నుపోటు దారులు ఎవరూ ప్రజలకు నటనతో న్యాయాన్ని అందించలేరు.

వ్యాఖ్య

ఇంతెందుకూ? కాశీలో గంగను చూసినప్పుడల్లా గొప్ప భావుకుడివై పోయినట్లు నటిస్తావ్. గొప్ప శ్రద్ధా భక్తులున్నట్లు - నువ్వు ఏర్పాటు చేసుకున్న ఇంటర్వ్యూలలో చెపుతుంటావు. ఎప్పుడైనా ఆ గంగమ్మ తల్లి రోదనను వినిపించుకున్నావా? గంగా నదిని ప్రక్షాళనం చేస్తున్నామని, శుద్ధి చేస్తున్నామని ప్రకటిస్తావే తప్ప-చేశావా? కాలుష్యపు కోరల నుంచి ఆ తల్లిని విడిపించావా? శుభ్రపడి శుద్ధి కావాలని గంగ తపించిపోతూ ఉంది. కాశీ ఘాట్‌ను ఒక 'మాల్' లాగా చేసి పెట్టావ్ నరేంద్రా- గ్రహించుకో.

చివరగా మరొక మాట! నా లాగా కనిపించాలని వేషాలెయ్యకు. దేశ ప్రజలకు అబద్ధాలు చెప్పకు. ఇతరుల బాధలు తెలుసుకో. వాటిని తగ్గించడానికి నీ అధికారాన్ని ఉపయోగించు. అంతే కానీ, అధికారం ఉంది కదా అని దుర్వినియోగం చెయ్యకు. అప్పుడు నేనే నీకు తగిన బుద్ధి చెప్పాల్సి ఉంటుంది. ఒక్కసారి ఆ జెఎన్‌యూ విద్యార్థి ఉమర్ ఖాలిద్‌ను గుర్తు చేసుకో. ఆ అబ్బాయి చేసిన అపరాధమేమిటీ? మూడేళ్ళ నుండి జైల్లో మగ్గుతున్నాడు. బెయిల్ కూడా దొరకకుండా చేశావ్. ఎంతో భవిష్యత్తు గల యువకుడు. ఎంతో వేదనను, యాతనను అనుభవిస్తున్నాడు. ఇలా దేశంలో ఎంతో మంది....

సూచన ప్రాయంగా నేను కొన్ని విషయాల్నే ప్రస్తావించాను నరేంద్రా-వీటి లోంచి నువ్వు ఎక్కువ విషయాలు గ్రహించు-బుద్ధిగా మసలుకో.

ఇట్లు,
నీ పరమాత్మ.

/ రచయిత సాహితీవేత్త, జీవ శాస్త్రవేత్త-మెల్బోర్న్ నుంచి /

ఇటలీలో జి7 మల్లగుల్లాలు!

వ్యాఖ్య

ఏడు ధనిక దేశాల కూటమి (జి7) యాభయ్యవ వార్షిక సమావేశం గురువారం నాడు ఇటలీలో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ భేటీకి రికార్డు స్థాయిలో భారత్, బ్రెజిల్‌తో సహా పన్నెండు దేశాల నేతలను అతిథులుగా ఆహ్వానించటం ఒక విశేషం. రష్యా మీద ఆంక్షలను వెయ్యి నుంచి నాలుగు వేల వరకు విస్తరించేందుకు. ఇప్పటికే స్థంభింపచేసిన 280 బిలియన్ డాలర్ల రష్యా ఆస్తుల మీద వచ్చే రాబడి నుంచి ఉక్రెయిన్‌కు 50 కోట్ల డాలర్ల సాయం అందించాలన్న అమెరికా ప్రతిపాదనలు, చైనా కట్టడి అనే నిరంతర ఎజెండా ప్రధానంగా ఈ సమావేశం ముందున్నాయి. తన మీద పడే భారాన్ని తప్పించుకొనే అమెరికా ఎత్తుగడ, ఎన్నికల్లో స్వలాభం పొందే జో బైడెన్ మంత్రాంగం ఉంది. ఉక్రెయిన్‌కు సాయంపై ఐరోపా సమాఖ్యలో ఏకాభిప్రాయం వస్తేనే అది వీలుపడుతుంది. అయితే అలాంటి హామీ ఇచ్చే పరిస్థితి లేదన్నది విశ్లేషకుల అంచనా. ఎన్ని ఆంక్షలు విధిస్తే అంతగా అన్నట్లు వాటి ప్రభావం రష్యా మీద ఇప్పటి వరకు పెద్దగా లేదు. ఈ కారణంగానే మరోసారి గట్టిగా ఊపి చూద్దాం అనే తెగింపుతో పశ్చిమ దేశాలు ఉన్నాయి. అంతా మీరే చేస్తున్నారు అంటూ రష్యా ఆర్థికంగా, ఇతరంగా నిలదొక్కుకోవటానికి కారణం చైనా అని పశ్చిమ దేశాలు చిందులు వేస్తున్నాయి. తాము ఇచ్చిన ఆయుధాలతో అన్నెంపున్నెం ఎరగని పిల్లలు, మహిళలను గాజాలో ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్ దుశ్చర్యలు దానికి కనిపించవు. చైనా అందిస్తున్న యంత్రాలు, చిప్స్ వంటి వాటిని ఆయుధాల తయారీతో సహా వినియోగ వస్తువుల తయారీకీ రష్యా వినియోగించవచ్చు. దీన్ని సహించలేక అనేక ఆరోపణలు చేస్తున్నాయి. అవసరానికి మించి అధిక ఉత్పత్తులు చేసి ప్రపంచ మార్కెట్లలో కుమ్మరిస్తున్నదనేది ఒకటి. ఆ సాకుతో చైనా విద్యుత్ వాహనాల దిగుమతులపై పన్ను మొత్తాన్ని 25 నుంచి 100 శాతానికి పెంచిన అమెరికా అడుగు జాడల్లో ఐరోపా దేశాలు 38 శాతం వరకు పెంచేందుకు నిర్ణయించి ఈ సమావేశానికి వచ్చాయి. అంటే రష్యా, చైనాలతో అమీతుమీ తేల్చుకొనేందుకు సిద్ధపడుతున్నాయి. ఇల్లలకగానే పండగ కాదన్నట్లు అమెరికా ప్రతిపాదనల మీద ఏకాభిప్రాయం కుదురుతుందనే పరిస్థితి లేదు. రష్యా ఆస్తులు ఐరోపా దేశాల్లో ఉన్నాయి. మీరు మమ్మల్ని ఇబ్బంది పెడితే మిమ్మల్ని ఇరికించే అవకాశం మాకూ ఉంది వెనుకా ముందు ఆలోచించుకోండని రష్యా హెచ్చరించింది. గత వారంలో జరిగిన ఐరోపా పార్లమెంటు ఎన్నికల్లో పచ్చి మితవాద శక్తుల బలం పెరుగుదల, దానితో ముడివడిన సమస్యలను ఈ సమావేశం విస్మరించే అవకాశం లేదు.



గాజాలో ఇజ్రాయిల్ మారణకాండ 250 రోజులుగా కొనసాగుతున్నది, హమాస్ తీవ్రవాదులను పట్టుకొనే పేరుతో ఇజ్రాయిల్ జరుపుతున్న ఈ దారుణ కాండలో ఇంతవరకు ఎంత మందిని పట్టుకున్నదీ చెప్పలేని స్థితి. మరోవైపు ప్రపంచ వ్యాపితంగా దానికి మద్దతు ఇస్తున్న పశ్చిమ దేశాల మీద ఒత్తిడి తీవ్రం అవుతున్నది. ఉక్రెయిన్‌లో రష్యా సైనిక చర్య 840వ రోజులో ప్రవేశించింది. రోజు రోజుకూ జెలెన్‌స్కీ సేనలు బలహీనపడటం తప్ప జరుగుతున్నదేమీ లేదు. పశ్చిమ దేశాలు అందించిన ఆధునిక ఆయుధాలు రష్యాను ఇప్పటి వరకు ఒక్క అడుగు కూడా వెనక్కు నెట్టలేకపోయాయి. తమ మీద జరుపుతున్న వాణిజ్య పోరును పశ్చిమ దేశాలు ఎంతకాలం, ఎలా కొనసాగిస్తాయో తగ్గేదేలే మేమూ చూస్తామన్నట్లుగా చైనా ఉంది. తన ఎత్తుగడలను తానూ అమలు చేస్తున్నది. పశ్చిమ దేశాలు కాటు వేసేందుకు అవకాశాలు దొరక్క ప్రస్తుతం బుసలు కొట్టే స్థితిలోనే ఉన్నప్పటికీ వాటి కోరల్లో దాగిన విషాన్ని విస్మరించకూడదు.

వివిధ ప్రపంచ పరిణామాల పట్ల డోలాయమాన స్థితి, విబేధాలు, అసాధారణ సవాళ్ల నడుమ ఈ కూటమి ఇటలీ మథనంలో ఏమి వెలువడుతుంది అన్నదానిపై ఆసక్తి నెలకొన్నది. తమ కంట్లో నలుసుల్లా, కొరుకుడు పడని ముక్కల్లా ఉన్న చైనా, రష్యా, ఇరాన్ వంటి దేశాలను ఎలా కట్టడి చేయాలి? ప్రపంచాధిపత్యాన్ని ఎలా నిలుపుకోవాలి, కొనసాగించాలనే యావతో ఉన్న జి7కు ఆత్రం తప్ప ఎలా ముందుకు పోవాలో తెలియని స్థితి గత జపాన్ సమావేశాల్లో వెల్లడైంది. గాజాలో జరుగుతున్న మారణకాండను నిలిపివేసేందుకు ఏ మాత్రం ముందుకు రాని ఈ గుంపు తమ కారణంగానే తలెత్తిన ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు చొరవ చూపకపోగా మరింత ఆజ్యం పోసి జనాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నది.

ఈ సమావేశాలకు వస్తూ కొన్ని దేశాలు తీసుకున్న నిర్ణయాలు ఘర్షణ, ఉద్రిక్తతలను పెంచేవిగా ఉన్నందున ఇటలీ భేటీలో జరిగేదేమిటో ఊహించుకోవచ్చు.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లు ...

సత్య

వ్యాఖ్య

అక్కటా ఏమిటీ విధి వైపరీత్యం! చంద్రబాబు పట్టాభిషేకానికి నేను వెళ్లటం ఏమిటి? వెళితిని పో.. ఏదో ఒక మూలన కూర్చోకుండా అమిత్ షా అన్నను మర్యాదగా పలకరించాలనుకోవటం ఏమిటి? అనుకుంటిని పో-నా నమస్కారానికి తిరస్కారంగా నన్ను చీవాట్లు పెట్టటం ఏమిటి? అన్నగనుక దాన్లో తప్పులేదు! పక్కనే మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఇంకా పార్టీ పెద్దలు, ఇతరులు అనేక మంది చూస్తుండగానే బహిరంగ వేదిక మీద అలా చేయవచ్చా? అయినా అంత తప్పు నేనేం చేశాను? పోనీ నా అపరాధం ఏదైనా ఉంటే నాలుగ్గోడల మధ్య చివాట్లు వేయవచ్చు. ఇలా బహిరంగ వేదిక మీద, టీవీల ప్రత్యక్ష ప్రసారం జరుగుతోందని తెలిసి కూడా అమిత్ అన్నకు అంత ఆగ్రహం రావటం ఏమిటి? నన్ను అవమానించటం ఏమిటి, తెలంగాణ గవర్నర్‌గా ఉండగా కెసిఆర్ చేసిన అవమానం దీనితో పోలిస్తే చాలా చిన్నది. అమిత్ అన్న చేసింది భరించలేనిదిగా ఉంది. బేటీ బచావో అంటూ మోడీ ఇచ్చిన నినాదాన్ని అమిత్ అన్న విస్మరించి ఇలా అవమానించటం ఏమిటి? ఉన్న గవర్నర్ ఉద్యోగం వదులుకొని కేంద్ర మంత్రి పదవి మీద ఆశతో బరిలో దిగి అటు ఎన్నికల్లో ఓడి ఇటు అమిత్ అన్నతో చివాట్లు తిన్న తరువాత నేను రాష్ట్రంలో తలెత్తుకోగలనా? కింకర్తవ్యం ఏమిటి? ఇలా పరిపరి విధాలుగా తెలంగాణ మాజీ గవర్నర్, తమిళనాడు బిజెపి నేత తమిళిసై సౌందర్‌రాజన్ మథనపడుతూ ఉండి ఉండాలి. ఎందుకంటే కొన్ని లక్షల మంది చూస్తుండగా జరిగిన ఉదంతాన్ని ఎవరైనా జీర్ణించుకోవటం కష్టం.

2024 జూన్ 12న బుధవారం నాడు విజయవాడ సమీపంలోని కేసరపల్లిలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, మంత్రుల ప్రమాణోత్సవానికి హాజరైన అనేక మంది బిజెపి ప్రముఖులలో తమిళసై ఒకరు. వేదిక మీద ఆసీనుడైన అమిత్ షా, పక్కనే ఉన్న వెంకయ్య నాయుడికి ఆమె నమస్కారం చేయగానే అమిత్ షా ముఖ కవళికలు మారిపోయాయి. అభివాదం చేసి వెళుతున్న ఆమెను వెనక్కు పిలిచి వేలు చూపుతూ తీవ్రంగా హెచ్చరిక లేదా మందలించినట్లు కనిపించింది. ఆమె ఏదో వివరణ ఇవ్వబోగా



అదేమీ కుదరదన్నట్లు కనిపించింది. ఇదంతా క్షణాల్లోనే జరిగింది. ఏం మాట్లాడింది పక్కనున్న వెంకయ్య నాయుడు, ఇతర బిజెపి నేతలు నోరు విప్పితేనే వాస్తవం తెలుస్తుంది. ఈ దృశ్యం సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున ప్రచారమైంది. మీడియా సంస్థలు విశ్లేషణలు వెలువరించాయి. తమిళనాడు బిజెపిలో ఉన్న కుమ్ములాటల గురించే అమిత్ షా మందలించినట్లు పేర్కొన్నాయి. మీడియా వ్యాఖ్యానాలను పక్కన పెడదాం. "తమిళసై అక్కను అమిత్ షా గారు తీవ్రంగా మందలించినట్లు దానిలో కనిపిస్తున్నది. అయితే బహిరంగంగా చేసిన ఈ "హెచ్చరిక"కు కారణం ఏదై ఉండవచ్చు? అవాంఛనీయ బహిరంగ వ్యాఖ్యలా?" అని ఏకంగా తమిళనాడు బిజెపి ఐ.టి విభాగపు ఉపాధ్యక్షుడు కార్తీక్ గోపీనాథ్ ఎక్స్‌లో స్పందించారు. ఎక్కడ జనాలు సదరు వీడియోను చూడలేదోనని దాన్ని కూడా జత చేశారు.

తాజా లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి నేత అన్నామలై అద్భుతాలు సృష్టించబోతున్నారు, తమిళనాడు రాజకీయ చరిత్రను తిరగ రాయబోతున్నారన్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఏ పార్టీతో పొత్తు లేకుండా డిఎంకె నాయకత్వంలోని కూటమిని మట్టి కరిపిస్తారని చెప్పారు. అది జరగకపోగా ఇప్పుడు పార్టీ ఖాతా తెరవక పోవటానికి కారణం నువ్వంటే నువ్వన్నట్లు అన్నామలై-తమిళసై వర్గాలు కుమ్ములాటలకు దిగాయి. ఎన్నికల ఓటమి గురించి ఒక యూట్యూబ్ ఛానల్‌తో తమిళసై మాట్లాడుతూ చీలికలు లేని అన్నా డిఎంకెతో సర్దుబాటు చేసుకొని ఉంటే మెరుగైన ఫలితాలు వచ్చి ఉండేవని చేసిన వ్యాఖ్య బిజెపిలో విబేధాలకు కారణమైంది. పార్టీ అధ్యక్షుడు అన్నామలై దీనికి వ్యతిరేకమైన వైఖరితో ఉన్నారు. అన్నామలై కారణంగానే అన్నాడిఎంకెతో

> **అసలే సంపూర్ణ మెజారిటీకి పార్టీ దూరమై కారణాలను బహిరంగంగా చెప్పుకోలేని స్థితిలో పడితే ఒక్క సీటు కూడా రాని చోట ఈ రచ్చేమిటని కేంద్ర నాయకత్వం తలలు పట్టుకుంది. ఈ పూర్వ రంగంలో అమిత్ షా బహిరంగ మందలింపు ఉదంతం చోటు చేసుకుంది. అమిత్ షా తీరు గురించి డిఎంకె ప్రతినిధి ఎస్ అన్నాదురై ఎక్స్ ద్వారా స్పందిస్తూ "ఇవేమి రాజకీయాలు? తమిళనాడుకు చెందిన ప్రముఖ మహిళా నేతను బహిరంగంగా మందలించటం సభ్యతేనా? ఇది చాలా చెడు ఉదాహరణ, ప్రతి ఒక్కరూ దీన్ని గమనిస్తారని అమిత్ షా తెలుసుకోవాలి" అని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ఓటమి తరువాత తమిళనాడు బిజెపిలో ఉన్న కుమ్ములాటల గురించి దేశంలోనే పెద్దగా తెలియదు. అమిత్ షా ఆగ్రహ ప్రదర్శనతో అది విశ్వవ్యాప్తమైంది.**

బిజెపి మైత్రి చెడిందని, దాంతో పార్టీ తీవ్రంగా నష్టపోయిందని పార్టీలో కొందరు మండిపడుతున్నారు. అన్నాడిఎంకె మాజీ మంత్రి ఎస్‌పి వేలుమణి మాట్లాడుతూ తమ పార్టీలో చీలికకు అన్నామలై పూర్తి కారకుడని విమర్శించారు. రెండు పార్టీలు పొత్తు పెట్టుకొని ఉంటే తమ కూటమి 35 సీట్లు గెలిచి ఉండేదన్న అతని అభిప్రాయాన్ని తమిళసై బలపరచటంతో రెండు వర్గాల మధ్య దూరం పెరిగింది. ఒక్క సీటు కూడా తెచ్చుకోని పార్టీ నేత చెప్పిన మాటలను ఎలా సమర్ధిస్తారంటూ అన్నామలై ధ్వజమెత్తారు. పన్నెండు స్థానాల్లో అన్నాడిఎంకెను మూడవ స్థానంలోకి నెట్టామని, ఇది బిజెపి సాధించిన విజయమని అన్నామలై సమర్ధించుకున్నారు. గతంలో తాను పార్టీ అధ్యక్షురాలిగా ఉన్నపుడు ఒక ప్రమాణం పెట్టుకున్నానని, సంఘ వ్యతిరేక శక్తులను ప్రోత్సహించలేదని, కానీ ఇటీవల అలాంటి వారిని పార్టీలోకి తీసుకున్నారని. అన్నామలై మంచి నేత అనటంలో తనకెలాంటి సందేహం లేదని, మనమంతా అనేక రకాల నేతలమని, భిన్నమైన నిర్ణయాలు తీసుకుంటామని తమిళసై పరోక్షంగా అన్నామలై మీద ధ్వజమెత్తారు. అయితే దీని మీద మాజీ నేత తిరుచ్చి సూర్య శివ స్పందిస్తూ ఆమె పార్టీ నేతగా ఉండగా రాష్ట్రంలో పార్టీలో చేరేందుకు ఎవరూ ముందుకు రాలేదని విమర్శించారు. దీంతో సామాజిక మాధ్యమంలో ఇద్దరి అభిమానులు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. కుమ్ములాటలు బహిరంగమై పార్టీ పరువు తీశాయి.

ఓటర్లలో మాజీ హీరోయిన్ కుష్బూకు ఉన్న ఆకర్షణను ఎన్నికల్లో ఉపయోగించుకొని ఉంటే ఫలితాలు వేరుగా వచ్చి ఉండేవని బాలీవుడ్ దర్శకుడు, బిజెపి అభిమాని ఆనంద కుమార్ చెప్పారు. అన్నామలై గనుక కుష్బూను ప్రచారంలోకి దించి ఉంటే తమిళనాడులో ఫలితాలు వేరుగా ఉండేవన్నారు. తమిళనాడు బిజెపిలో సమన్వయం లేదు. రాజకీయాల్లో ఒకే ఒక్కడు ప్రత్యేకించి రాజకీయాలకు కొత్తగా వచ్చిన అన్నామలై పోరాడలేరు. ఓట్ల శాతం పెరిగి ఉండవచ్చు తప్ప ఒక్క సీటూ రాలేదన్నారు. ఎంతగానో ఆకర్షణ ఉన్న కుష్బూను బిజెపి ఎందుకు వినియోగించు కోలేదో, ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా, జెపి నడ్డా వచ్చిన సభలకు ఎందుకు ఆహ్వానించలేదో ఆశ్చర్యంగా ఉందన్నారు.

అసలే సంపూర్ణ మెజారిటీకి పార్టీ దూరమై కారణాలను బహిరంగంగా చెప్పుకోలేని స్థితిలో పడితే ఒక్క సీటు కూడా రాని చోట ఈ రచ్చేమిటని కేంద్ర నాయకత్వం తలలు పట్టుకుంది. ఈ పూర్వ రంగంలో అమిత్ షా బహిరంగ మందలింపు ఉదంతం చోటు చేసుకుంది. అన్నామలై కేంద్ర నాయకత్వాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని బిజెపి మేథావుల విభాగపు నేత కల్యాణ రామన్ ధ్వజమెత్తారు. గత ఎన్నికల్లో పార్టీకి ఒక అంకెలో వచ్చిన ఓట్లు ఇప్పుడు రెండంకెల శాతానికి పెరిగాయని చెప్పటం తప్పుదారి పట్టించటమే అన్నారు. 2019లో తొమ్మిది సీట్లలో పోటీ చేసినపుడు 5.56 శాతం ఓట్లు వచ్చాయని తాజాగా 23 చోట్ల పోటీ చేస్తే 11.24 శాతం వచ్చాయి. దీన్ని మరోవిధంగా చెప్పాలంటే పోటీ చేసిన సీట్ల ప్రాతిపదికన ఈ సారి 14.25 శాతం రావాలని రామన్ వాదించారు. అన్నామలైకి నైతిక విలువలు లేవని పదవికి రాజీనామా చేయాలన్నారు. అమిత్ షా తీరు గురించి డిఎంకె ప్రతినిధి ఎస్ అన్నాదురై ఎక్స్ ద్వారా స్పందిస్తూ "ఇవేమి రాజకీయాలు? తమిళనాడుకు చెందిన ప్రముఖ మహిళా నేతను బహిరంగంగా మందలించటం సభ్యతేనా? ఇది చాలా చెడు ఉదాహరణ, ప్రతి ఒక్కరూ దీన్ని గమనిస్తారని అమిత్ షా తెలుసుకోవాలి" అని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ఓటమి తరువాత తమిళనాడు బిజెపిలో ఉన్న కుమ్ములాటల గురించి దేశంలోనే పెద్దగా తెలియదు. అమిత్ షా ఆగ్రహ ప్రదర్శనతో అది విశ్వవ్యాప్తమైంది. ●

మంత్రులకే పూర్తి బాధ్యతలు

- శాఖలో మరొకరి జోక్యం వద్దు
- ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కొత్త ప్రభుత్వంలో ఎవరి శాఖల్లో వారే కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజలకు న్యాయం జరిగేలా పాలన ఉండాలని సూచించారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలతో ప్రజలు విసిగిపోయారని, అదే పద్ధతులు పాటించొద్దని సూచించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రిగా గురువారం బాధ్యతలు తీసుకున్న వెంటనే మంత్రులు, అధికారులతో వేర్వేరుగా మాట్లాడారు. ఈ పాలనలో మంత్రులు బాధ్యతగా వ్యవహరించాల్సి ఉందని, ప్రతి ఫైలునూ చూసిన తరువాతే సంతకం చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా వేర్వేరు ప్రాజెక్టులు చేపట్టే సమయంలో గానీ, ఫైళ్లపై సంతకం పెట్టే సమయంలో గానీ ముందుగానే దానిపై కూలంకుషంగా చర్చించాలని, రికమండేషన్ల ఆధారంగా నిర్ణయాలు తీసుకొవద్దని తెలిపారు. అవసరమైతే శాఖలవారీ ఉన్నత విద్యావంతులైన నిపుణులను నియమిస్తామని చెప్పారు. అలాగే గత ఐదేళ్ల పాలనలో మంత్రుల వద్ద, అవినీతి అధికారుల వద్ద ఉన్న సిబ్బందిని ఎట్టి పిరిస్థితుల్లోనూ నియమించుకోవద్దని, కొత్త వారిని, నిజాయతీపరులను, నైపుణ్యం ఉన్నవారిని తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది. ఏ పనిచేసినా పేదలను దృష్టిలో పెట్టుకోవాలని, నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజల పట్ల నమ్మకంగా వ్యవరించాలని చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. మంత్రులు బాధ్యతలను హోదాగా కాకుండా బాధ్యతగా స్వీకరించాలనే పదాన్ని గుర్తుపెట్టుకోవాలని అన్నారు. ఇష్టం వచ్చినట్లు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. పాలన ఎలా ఉండకూడదో గత ఐదేళ్లలో జరిగిన వ్యవహారాలను చూస్తే తెలుస్తుందని, అటువంటి పాలన, అటువంటి పద్ధతుల్లో మంత్రుల్లో కనిపించకూడదని అన్నారు.

రక్తదాన కార్యక్రమాలను జయప్రదం చేయండి: సిఐటియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రపంచ రక్తదాతల దినోత్సవం అయిన జూన్ 14ను రాష్ట్రంలో జయప్రదం చేయాలని సిఐటియు పిలుపునిచ్చింది. రాష్ట్రంలోని సిఐటియు, సిఐటియు అనుబంధ సంఘాలు ఎక్కడికక్కడ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరింది. ఈ మేరకు సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎవి నాగేశ్వర రావు, సిహెచ్ నర్సింగరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రక్తదానం వల్ల మరొకరికి ప్రాణదానం చేయొచ్చని, సిఐటియు కార్యకర్తలంతా రక్తదానం చేయాలని కోరారు.

సమాఖ్యతత్వం పరిఢవిల్లేనా ?

- బిజెపి పాలనలో అంతా కేంద్రీకృత పాలనే
- రాష్ట్రాల రుణ పరిమితిపై ఆంక్షలు



న్యూఢిల్లీ : కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలో ఎన్‌డిఎ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన విషయం తెలిసిందే. గత పది సంవత్సరాల కాలంలో పరిపాలన యావత్తూ 'వన్ మ్యాన్ షో' తరహాలో సాగింది. అయితే ఇప్పుడు ఆ వాతావరణం లేదు. తెలుగుదేశం, జెడియు సహా పలు పార్టీలపై ఆధారపడి పరిపాలన సాగించాల్సి ఉంటుంది. తెలుగుదేశం, జెడియు పార్టీలకు కలిపి 28 మంది సభ్యులు ఉన్నారు. వారు కోరుకుంటే ఏమైనా జరగొచ్చు.

2014, 2019 ఎన్నికల్లో బిజెపికి స్పష్టమైన మెజారిటీ వచ్చింది. దీంతో ప్రధాని మోడీ ఆడింది ఆట... పాడింది పాట మాదిరిగా సాగిపోయింది. దీంతోపాటు పలు రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కేంద్ర నిధులపై కట్టుదిట్టమైన నియంత్రణల ద్వారా ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం అనేక ఇబ్బందులు పెట్టింది. ఆయా రాష్ట్రాల్లో గవర్నర్లు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. శాసనసభల్లో ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలపకుండా మోకాలడ్డారు. ప్రజా తీర్పును కాలరాస్తూ బిజెపియేతర ప్రభుత్వాలను కూలదోయడానికి కూడా మోడీ ప్రభుత్వం వెనకాడలేదు. దీంతో సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింది. అధికారాలన్నీ ఒకే వ్యక్తి చేతిలో కేంద్రీకృతమయ్యాయి.

ఇప్పుడు బిజెపి ప్రభుత్వం పోయి ఎన్‌డిఎ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోంది. ఈ నేపథ్యంలో దేశంలో ఆర్థిక పరంగా సమాఖ్యతత్వం రూపుదిద్దుకుంటుందా అనే ప్రశ్న తలెత్తుతోంది.

అప్పుడు రాష్ట్రాల చేతిలో అధికారాలు

బండి చక్రాల మాదిరిగా అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు సమాఖ్యతత్వాన్ని ముందుకు తీసుకుపోవాల్సి ఉంటుంది. అదే రాజ్యాంగం నిర్మించిన డబుల్ ఇంజిన్ సర్కార్. 72, 73వ రాజ్యాంగ సవరణల ద్వారా మన దేశం రాజ్యాంగపరంగా మూడు ఇంజిన్ల ప్రభుత్వంగా మారిపోయింది. స్థానిక సంస్థలు గతంలో మూడో ఇంజిన్‌గా పనిచేశాయి. అయితే దురదృష్టవశాత్తూ ఇప్పుడవి నిర్వీర్యమైపోయాయి. గతంలో రాష్ట్రాలకు స్వతంత్రంగా పన్నులు విధించుకునే అధికారం ఉండేది. రాష్ట్రాలను స్వతంత్రంగా అభివృద్ధి చేసుకునేందుకు, అందుకోసం నిధులు ఖర్చు చేసేందుకు వాటికి స్వేచ్ఛ ఉండేది. వ్యయంలో ఐదింట మూడో వంతు రాష్ట్రాల పరిధిలోనే జరిగేది. కేంద్రం వద్ద రుణ బకాయిలు ఉన్నప్పుడు మినహాయించి ఇతరత్రా రుణాలు తీసుకునేందుకు కూడా రాష్ట్రాలకు పూర్తి అధికారాలు ఉండేవి.

జిఎస్‌టి అమలుతో...

జిఎస్‌టి అమలుతో అంతా తారుమారై పోయింది. జిఎస్‌టి విధానాన్ని నిర్ణయించడంలో, దానిని అమలు చేయడంలో తమకు సమాన అధికారాలు ఉంటాయన్న నమ్మకంతో తమ అమ్మకపు/విలువ ఆధారిత పన్ను అధికారాలను, కొన్ని ఇతర పన్నులకు సంబంధించిన అధికారాలను జిఎస్‌టిలో కలిపేసేందుకు రాష్ట్రాలు అంగీకరించాయి. అయితే మోడీ ప్రభుత్వం కేంద్ర, బిజెపి పాలిత రాష్ట్రాల ఉమ్మడి అధికారాలను ఉపయోగించి జిఎస్‌టి విధానాన్ని, దాని అమలును కేంద్ర ప్రభుత్వ పన్నుల వ్యవస్థగా మార్చేసింది..

గుదిబండగా కేంద్ర పథకాలు

కేంద్ర ప్రభుత్వం స్పాన్సర్ చేసే పథకాలు (సిఎస్‌ఎస్) కూడా రాష్ట్రాలకు గుదిబండగా మారాయి. రాష్ట్రాల ఖర్చులు, అభివృద్ధిపై అవి ప్రభావం చూపాయి. సిఎస్‌-ఎస్‌ల పేరు మార్చి అవి కేంద్ర ప్రభుత్వ పథకాలన్న భ్రమ కల్పించే ప్రయత్నం చేశారు. ఈ పథకాలకు నిధుల కేటాయింపులపై కేంద్రానిదే నియంత్రణ. ఆయా పథకాల అమలులో కేంద్రం జోక్యం అధికంగానే ఉంటుంది. సిఎస్‌ఎస్‌లకు రాష్ట్రాలు అందించాల్సిన వాటాను గణనీయంగా పెంచారు. అదే సమయంలో రాష్ట్ర పథకాల పరిమాణాన్ని కుదించారు. మొత్తంగా పథకాల వ్యయ భారం రాష్ట్రాలపైనే అధికంగా పడింది. మరోవైపు కేంద్ర నిధుల విడుదలను నియంత్రించారు. ఆడిట్ల పేరుతో చిన్న చిన్న లోపాలను భూతద్దంలో వెతికిపట్టి, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు నిధులు విడుదల చేయకుండా ఆపేశారు.

అప్పుకు అడ్డుపడి...

ప్రతిపక్ష పార్టీల రాష్ట్రాలకు అప్పు పుట్టకుండా కేంద్రం అనేక సమస్యలు సృష్టించింది. ముఖ్యంగా కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రుణ పరిమితిని కుదించారు. గతంలో అధికంగా తీసుకున్న అప్పును రికవరీ చేసే పేరుతో తాజా రుణాలకు మోకాలడ్డారు. కోవిడ్ సమయంలో అదనపు రుణాలు పొందేందుకు అనుమతించినప్పటికీ సవాలక్ష షరతులు విధించారు.

కేంద్రం కబంధ హస్తాల నుండి రాష్ట్రాలు తప్పించుకోకుండా మోడీ ప్రభుత్వం వడ్డీ లేకుండా యాభై సంవత్సరాల మూలధన వ్యయ రుణాలను ఇవ్వడం ప్రారంభించింది. దీంతో రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ అప్పుల కోసం ఎగబడ్డాయి. ఇన్ని ప్రతికూల పరిస్థితుల మధ్య రాష్ట్ర ఇంజిన్ ఆగిపోయే పరిస్థితికి వచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఇంజిన్‌కు రాష్ట్రాలు ట్రాక్టర్ ట్రాలీ ఇంజిన్‌గా మారిపోయాయి.

కింకర్తవ్యం ?

రాష్ట్రాల అధికారాలను, స్వయం ప్రతిపత్తిని కాపాడాలంటే ఏం చేయాలి?. దీనిపై నిపుణులు ఏమంటున్నారంటే... జిఎస్‌టి మండలిలో నిర్ణయాలు తీసుకునే అధికారాలు రాష్ట్రాల చేతిలో కూడా ఉండాలి. కేంద్రానికి ఉన్న ఓటింగ్ అధికారాన్ని 15%కి తగ్గించాలి. దీనివల్ల జిఎస్‌టి మండలిలో కేంద్రానికి విశేషాధికారాలు ఉండవు. రాష్ట్ర ప్రభుత్వాలు సంప్రదింపుల ప్రక్రియ ద్వారా ఏకాభిప్రాయం సాధించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా నిలువరించాలి. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సిఎస్‌ఎస్ పథకాలను రద్దు చేసి, ఆ నిధులను రాష్ట్రాలకు బదిలీ చేయాల్సిన అవసరం ఉంది. దీనివల్ల రాష్ట్రాలకు కేంద్ర నిధులు అందుతాయి.

ఐఎఎస్‌లు లేరు

- దేశవ్యాప్తంగా 1,365 ఖాళీలు
- యుపిఎస్‌సి నియామకాలపై కేంద్రం ఆంక్షలు
- సంఖ్య పెంచాలని సిఫారసు చేసినా మౌనం
- టచ్ ఉన్న రిటైర్డ్ అధికారులతో ఖాళీల భర్తీ

న్యూఢిల్లీ : ఐఎఎస్ అధికారుల నియామకాలను పెంచాలని సిబ్బంది, శిక్షణ మంత్రిత్వశాఖ తన ఆంతరంగిక నివేదికలో అభిప్రాయపడింది. ఐఎఎస్ అధికారుల నియామకాలను ఏడాదికి 180 నుంచి 210-220కి పెంచాలని సిఫారసు చేసింది. 'ఐఎఎస్ అధికారుల సంఖ్యను పెంచాల్సిన అవసరం చాలా కాలం నుండే ఉంటోంది. ప్రతి సంవత్సరం అదనంగా మరో 30-40 మందిని యుపిఎస్‌సి నియమించాలని నివేదిక సిఫారసు చేసింది' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ప్రభుత్వ అధికారి ఒకరు 'ది ప్రింట్' పోర్టల్‌కు తెలిపారు. సిబ్బంది-శిక్షణ మంత్రిత్వ శాఖ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపిఎ) సంయుక్తంగా ఈ నివేదికను రూపొందించాయి.

జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో ప్రభుత్వ శాఖల్లో భారీగా ఖాళీలు ఉన్నాయని ఆ అధికారి చెప్పారు. 2014 తర్వాత దేశంలో మరో వందకు పైగా జిల్లాలు ఏర్పడ్డాయి. అక్కడ సిబ్బంది కొరత ఉంది. ఈ నేపథ్యంలో ఆ ఖాళీలన్నీ భర్తీ చేసే వరకూ పది సంవత్సరాల పాటు ఏడాదికి 30 మంది కొత్త ఐఎఎస్ అధికారులను నియమించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని ప్రభుత్వాధికారి వివరించారు. ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా 1,365 ఐఎఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏటా 180 మంది అధికారులను మాత్రమే యుపిఎస్‌సి నియమించాలని ప్రభుత్వం 2012 నుంచి ఆంక్షలు విధించింది.

ప్రతి ఏటా నియమించే ఐఎఎస్ అధికారుల సంఖ్యను పెంచే యోచన ఏదీ లేదని గత ప్రభుత్వంలో సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రిగా పనిచేసిన జితేంద్రసింగ్ 2023లో పార్లమెంటుకు తెలియజేశారు. అధికారుల నియామకాలు పెంచితే నాణ్యతలో రాజీ పడాల్సి వస్తుందని ఆయన తెలిపారు. అయితే ఖాళీల సంఖ్య అధికంగా ఉన్నందున నియామకాలను చేపట్టే విషయంపై ప్రభుత్వం ఆలోచన చేయవచ్చునని ప్రభుత్వాధికారి చెప్పారు. వీటికి అదనంగా డిప్యూటీ సెక్రెటరీ, డైరెక్టర్, జాయింట్ సెక్రెటరీ స్థాయిలో లేటరల్ ఎంట్రీ ద్వారా నియామకాలు జరిపేందుకు రంగం సిద్ధమైందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి 51 పోస్టుల భర్తీ కోసం త్వరలోనే ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

2018-2023 మధ్యకాలంలో అఖిల భారత సర్వీసుల్లో (ఎఐఎస్) ఖాళీల భర్తీకి ప్రయత్నాలు జరిగాయి. ఈ కాలంలో సివిల్ సర్వీసెస్ పరీక్షల ద్వారా జరిపిన నియామకాలు 812 నుంచి 1143కు పెరిగాయి. 2021లో 749 మంది అధికారులను మాత్రమే నియమించారు. ఇక ఐపిఎస్ అధికారుల విషయానికి వస్తే 2019లో 150 మందిని నియమించగా 2020 నుంచి ప్రతి ఏటా 200 మంది అధికారులను నియమించారు. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో కూడా అధికారుల నియామకాలు పెరిగాయి.

కేసరపల్లిలో కన్పించని నితీశ్ !

- గైర్హాజరుపై ఊహాగానాలు
- ఎన్‌ఎడి బీటలు వారుతోందన్న ఆర్‌జెడి
- ఇతర కార్యక్రమాలు ఉండడం వల్లనే అంటున్న బిజెపి

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడి ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షమైన జెడియు నేత, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ గైర్హాజరు కావడంపై రాజకీయంగా పలు ఊహాగానాలు చెలరేగుతున్నాయి. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటులో చంద్రబాబుతో కలిసి కీలక పాత్ర పోషించిన నితీష్, ఏపి ప్రభుత్వ ప్రమాణస్వీకారానికి దూరంగా ఉండిపోయారు. ఆ సమయంలో ఆయన బీహార్ రాజధాని పాట్నాలోనే ఉన్నారు. దీనిపై మిత్రపక్షాలే కాకుండా ప్రతిపక్షాలు కూడా స్పందించాయి.

చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఎన్‌డిఎకు చెందిన అతిరథ మహారథులు, సినీ ప్రముఖులు, వివిధ రంగాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఎంతో అట్టహాసంగా జరిగిన ఈ వేడుకకు నితీష్ దూరంగా ఉండడంతో భాగస్వామ్య పక్షాల ఐక్యతపై అనుమానాలు కూడా తలెత్తుతున్నాయి. ఇతర కార్యక్రమాలు ఉండడం వల్లనే నితీశ్ విజయవాడ వెళ్లలేకపోయారని బిజెపి చెబుతోంది. ప్రతిపక్షాలు మాత్రం దీనిని అంతర్గత విభేదాలుగా చూస్తున్నాయి.

ఇది వారి ఆంతరంగిక వ్యవహారమే అయినప్పటికీ ఎన్‌డిఎలో పరిస్థితులు సజావుగా లేదన్న విషయం స్పష్టమవుతోందని ఆర్‌జెడి ప్రతినిధి ఇజాజ్ అహ్మద్ వ్యాఖ్యానించారు. కూటమిలో బీటలు కన్పిస్తున్నాయని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రకటించడానికి ముందే ఎన్‌డిఎ కూటమిలో విభేదాలు ఏర్పడతాయని తమ పార్టీ నేత తేజస్వి యాదవ్ అంచనా వేశారని గుర్తు చేశారు. కాగా, క్యాబినెట్‌లో శాఖల కేటాయింపులపై అలిగారని జ్ఞాన్ రంజన్ అన్నారు.

ప్రతిపక్షాల వాదనను బిజెపి తోసిపుచ్చింది. 'బిజెపి వింధ్య పర్వత శ్రేణులకు ఉత్తర ప్రాంతంలోనే బలంగా ఉన్నదని మమ్మల్ని నిందించిన రోజులు పోయాయి. మాకు ఇప్పటికే ఒడిషాలో ప్రభుత్వం ఉంది. దక్షిణాదిన కూడా ఎన్‌డిఎ మెరుగ్గా కన్పిస్తోంది' అని ఆ పార్టీ జాతీయ ప్రతినిధి గురు ప్రకాష్ చెప్పారు. ఇతర కార్యక్రమాలు ఉండడం వల్లనే చంద్రబాబు ప్రమాణస్వీకారానికి నితీశ్ వెళ్లలేదని అన్నారు.

హిమాచల్ యూటర్న్

- యమునా రివర్ బోర్డ్‌ని సంప్రదించాలన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : హిమాచల్ ప్రదేశ్ యూటర్న్ తీసుకోవడంతో .. నీటిసరఫరా కోసం ఎగువ యమునా రివర్ బోర్డ్ (యువైఆర్‌బి)ని సంప్రదించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. దేశరాజధానిలో నీటి సంక్షోభం తీవ్రం కావడంతో హిమాచల్‌ప్రదేశ్ అందించే మిగులు జలాలను విడుదల చేయాల్సిందిగా హర్యానాకు ఉత్తర్వులు ఇవ్వాల్సిందిగా ఢిల్లీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై గురువారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. మానవతా ప్రాతిపదికన దేశ రాజధానికి నీటి సరఫరా చేయాల్సిందిగా కోరాలని వెకేషన్ బెంచ్ ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. గురువారం సాయంత్రం ఐదుగంటలలోగా యువైఆర్‌బికి దరఖాస్తు సమర్పించాలని, వెంటనే సమావేశం ఏర్పరిచి, తీసుకోవాల్సి వుంటుందని వెకేషన్ బెంచ్ తెలిపింది. ఈ విషయంలో వెంటనే నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. రాష్ట్రాల మధ్య యమునా జలాలను పంచుకోవడం సంక్లిష్టమైన, సున్నితమైన అంశమని, మధ్యంతర ప్రాతిపదికన దీనిపై నిర్ణయం తీసుకునే సాంకేతిక నైపుణ్యం కోర్టుకు లేదని ధర్మాసనం తెలిపింది. ఈ సమస్యను 1994 నాటి అవగాహనా ఒప్పందాలతో పార్టీల ఆమోదంతో ఏర్పాటు చేయబడిన కమిటీకి వదిలివేయాల్సిందిగా పేర్కొంది. తమ రాష్ట్రంలో 136 క్యూసెక్కుల మిగులు జలాలు లేవని హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఢిల్లీకి అవసరమైన సమయంలో సహాయం అందించేందుకు తమ రాష్ట్రం సిద్ధంగా ఉందంటూ గతంలో ఇచ్చిన ప్రకటనను కూడా వెనక్కు తీసుకుంది.

నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరుగలది)
రిజిస్టర్డు ఆఫీసు: 5వ అంతస్తు, టవర్-3, వింగ్-బి, కోహినూర్ సిటీ మాల్, కోహినూర్ సిటీ, కిరోల్ రోడ్, కుర్లా (వెస్ట్), ముంబయి-400070. రీజినల్ ఆఫీసు: 3వ& 4వ అంతస్తు, శ్రీ ప్రశాంతి సాయిటవర్స్, ప్లాట్ నెం.68, మున్సిపల్ నెం.8-2-248, నాగార్జున హిల్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, పంజగుట్ట దగ్గర, హైదరాబాద్-500082

ఇ-వేలం-చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకపు ప్రకటన

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 క్రింద ఇ-వేలం ద్వారా అమ్మకం.

29న జాతీయ లోక్ అదాలత్

పర్మినెంట్ లోక్ అదాలత్ ఛైర్ పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఈ నెల 29వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని పర్మినెంట్ లోక్ అదాలత్ ఛైర్ పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. ఏలూరు కోర్టు ఆవరణలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థ భవనంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మేరీ గ్రేస్ కుమారి మాట్లాడారు. జూన్ 29వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్, సివిల్ కేసులు, వాహన ప్రమాద భీమా కేసులు, కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు లావాదేవీల కేసులు, శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్, ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్సులకు సంబంధించిన ఇపిలను, ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ చేయనున్నట్లు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీయోగ్యమైన కేసులకు ఇరుపక్షాలకు మధ్యవర్తిత్వం ద్వారా ప్రీ సిట్టింగ్ లోక్ అదాలత్‌ను ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు న్యాయ సేవాధికార సంస్థ మొదటి అంతస్తులో నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజీ పడదలుచుకున్న కక్షిదారులు వారి కేసు వివరాలతో స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని సంప్రదించవచ్చని సూచించారు. ఇతర ప్రాంతాల్లో నివసించే వారికి ఆన్‌లైన్ ద్వారా మధ్యవర్తిత్వం నిర్వహించి రాజీ చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు. దీనిద్వారా సమయం, డబ్బు వృథా కాకుండా సత్వర న్యాయం పొందొచ్చని తెలిపారు.



టిడిపి కార్యాలయంలో వేడుకలు

- ప్రజలే నిర్దేశకులు : వర్ల, టిడి జనార్ధన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా టిడిపి కార్యాలయంలో బాణసంచా కాల్చి వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఐదు హామీలపై సిఎం చంద్రబాబు సంతకాలు పెట్టారని పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, టిడి జనార్ధన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. రెండు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు వేడుకలు చేయబోతున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నిర్దేశకులు అని అన్నారు.

చిత్తూరు ఓడినా వైసిపి తీరు మారలేదు : అనురాధ

ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చిత్తుచిత్తుగా ఓడించినా వైసిపి నేతల తీరు మారలేదని టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజలు వారిని ఓడించినా ఆత్మ పరిశీలన చేసుకోకుండా లేనిది విమర్శిస్తున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు సరిగ్గా లేవంటూ వైసిపి నేతలు రాష్ట్రపతికి లేఖ రాయడం సిగ్గుచేటని అన్నారు.

రాజకీయ నాయకుల చిత్రాలుంటే ఇవ్వొద్దు

- స్టూడెంట్ కిట్లపై విద్యాశాఖ ఆదేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే స్టూడెంట్ కిట్ (విద్యా కానుక)లో ఉన్న వస్తువులపై రాజకీయపర్యమైన ఏ నాయకుని పేర్లు, చిత్రాలు, లోగోలు ముద్రించకుండా సరఫరా చేయాలని సమగ్రశిక్షా డైరెక్టర్ బి శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలలు పున:ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కిట్లు పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండురోజుల క్రితం నిర్వహించిన సమీక్షలో అధికారులను ఆదేశించారని తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కిట్ నాణ్యతను తరువాత పరిశీలిస్తామని, లోపాలుంటే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి సూచించారని వెల్లడించారు. పాత స్టాకును సరఫరా చేయకూడదని స్పష్టమైన ఆదేశాలిచ్చామని పేర్కొన్నారు. ఆదేశాలు అతిక్రమిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పెనుమంట్ర (పశ్చిమగోదావరి జిల్లా)

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా నిర్వహించే వ్యవసాయ డిప్లమో కోర్సులకు నోటిఫికేషన్ విడుదలైందని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడిఆర్ వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు దరఖాస్తు చేయుటకు పదో తరగతి పాసైనవారితో పాటు ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా అర్హులేనని తెలిపారు. అభ్యర్థులు 31 ఆగస్టు 2023 నాటికి 15–22 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. 31 ఆగస్టు 2002 నుంచి 31 ఆగస్టు 2009 లోపు జన్మించి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదివిన వారికి, మున్సిపల్ పరిధిలో చదివిన వారికి మధ్య 75:25 నిష్పత్తిలో సీట్లు కేటాయింపు జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవటానికి ఈనెల 14 తేదీ నుంచి 20వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. సీట్ల కేటాయింపు విద్యార్థి పదవ తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగానే జరుగుతుందని, ఏవిధమైన ప్రవేశ పరీక్ష నిర్వహించడం లేదని తెలిపారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ %ఎఎఎ.ఐఅస్తీకిటా.ఐఎ.ఆఆ%ను వీక్షించవలసిందిగా కోరారు. స్థానికుల ఏమైనా సందేహాలుంటే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం మార్టేరు లేదా వ్యవసాయ పాలిటెక్నిక్ మార్టేరులో సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్‌ని 08814 297297 కార్యాలయ వేళల్లో సంప్రదించాలని తెలిపారు.

ఎర్ర సముద్రంలో పేలుడు

హౌదెరా : యెమెన్‌లోని వాయవ్య ప్రాంతంలో హొదెదాకు 82నాటికల్ మైళ్ళ దూరంలో వాణిజ్య నౌకలో పేలుడు సంభవించిందని బ్రిటన్ సముద్ర వాణిజ్య కార్యకలాపాల విభాగం తెలిపింది. నౌకకు పెద్దగా నష్టం సంభవించలేదని, సిబ్బంది కూడా సురక్షితంగా వున్నారని తెలిపింది.



త్రిపుల్‌ఐటీ ఉద్యోగుల నిరసన

- వేతనం పెంచాలని డిమాండ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వేతనం పెంచాలని నూజివీడు త్రిపుల్‌ఐటి ఉద్యోగులు క్యాంపస్‌లో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు సంవత్సరాల నుంచి జీతాలు పెంచకుండా తమను వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆర్జీయుకెటికి కొత్త ఛాన్సలర్‌గా కెసి రెడ్డిని యూనివర్సిటీకి రానివ్వకుండా అడ్డుకున్నారు. యూనివర్సిటీ అక్రమాలకు నిలయంగా మారిందన్నారు. ఆర్జేయు నుంచి జీతాలు పెంచకుండా ఉద్యోగుల జీవితాలు నాశనం చేశారని విమర్శించారు. అనంతరం ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శన చేశారు.

బాలికపై చిరుత దాడి

ప్రజాశక్తి - మహానంది

నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్‌లోని పచ్చర్ల చెంత వద్ద 12 ఏళ్ల బాలికపై చిరుత దాడి చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన కూలీల కుటుంబాలు చలమ రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే పనులు చేస్తున్నారు. ఉదయం పనులు చేస్తుండగా అడవిలో నుండి వచ్చిన చిరుత బాలిక పొండేపై దాడి చేసింది. వెంటనే కూలీలందరూ కేకలు వేయడంతో చిరుత పులి అడవిలోకి వెళ్లిపోయింది. వెంటనే వారు అధికారులకు సమాచారం అందించారు. గాయపడిన బాలికను రైల్వే అధికారులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

మళ్లీ వారే

- జాతీయ భద్రతా సలహాదారుగా దోవల్, పిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీగా పికె మిశ్రా

న్యూఢిల్లీ : కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం తమ కోటరీని ఏర్పాటు చేసుకుంటోంది. పలువురు ఉన్నతాధికారుల నియామక గడువు పూర్తవటంతో.. పాతవారినే కొనసాగించాలని నిర్ణయించారు. జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఎ)గా మాజీ ఐపిఎస్ అధికారి అజిత్ దోవల్‌ను, ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీగా పికె మిశ్రాను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పదవీకాలం వరకు లేదా, తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు వారి పదవీ కాలం కొనసాగుతుందని సిబ్బంది మంత్రిత్వశాఖ వేర్వేరుగా జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నెల 10 నుంచి అమల్లోకి వచ్చేలా అజిత్ దోవల్ పునర్నియామకాన్ని క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదించిందని తెలిపింది.

జి-7 సదస్సు కోసం ఇటలీకి ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : జి-7 దేశాల సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోడీ గురువారం ఇటలీ బయలుదేరి వెళ్లారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి విదేశీ పర్యటన ఇది. ఇటలీ బయలుదేరడానికి ముందుగా ప్రధాని మాట్లాడుతూ, 2021లో జి-20 సదస్సు సందర్భంగా తన ఇటలీ పర్యటనను గుర్తు చేసుకున్నారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోని కూడా భారత్‌లో రెండుసార్లు పర్యటించారని, దీనివల్ల ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతమయ్యాయని తెలిపారు. తమ ద్వైపాక్షిక ఎజెండాను మరింత ముందుకు తీసుకెళ్లడానికి, ఇరు దేశాల సంబంధాలను మరింత ప్రేరణనివ్వడానికి ఈ పర్యటనలు ఎంతగానో ఉపకరించాయని అన్నారు. భారత్, ఇటలీ పూర్వోత్తర భాగస్వామ్యాన్ని మరింత సంఘటితపరచడానికి కట్టుబడి వున్నామని చెప్పారు. ఇండో-పసిఫిక్, మధ్యధరా సముద్ర ప్రాంతాల్లో సహకారాన్ని పెంపొందిస్తామన్నారు.

జమ్ముకాశ్మీర్‌లో పరిస్థితిపై ప్రధాని సమీక్ష

జమ్మూకాశ్మీర్‌లో భద్రతా పరిస్థితిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురువారం సమీక్షించారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఇతర సీనియర్ అధికారులతో ఈ సమీక్ష జరిగినట్లు సంబంధిత అధికారులు చెప్పారు. ఈ సమావేశం నుంచి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, జమ్ముకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో ప్రధాని మోడీ వర్చువల్‌గా సంభాషించారు. భద్రతా దళాల మోహరింపు, ఉగ్రవాద నిరోధక చర్యల గురించి అమిత్‌షాతో మోడీ చర్చించారు.

సన్నగిల్లుతున్న కార్మిక హక్కులు

- ఇంటర్నేషనల్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ ఆందోళన

బ్రస్సెల్స్ : యాజమాన్యాల నుండి పెరుగుతున్న దాడులతో కార్మిక హక్కులు హరించుకుపోతున్నాయని ఇంటర్నేషనల్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ (ఐటియుసి) ఆందోళన వ్యక్తం చేసింది. ట్రేడ్ యూనియన్లపై, ప్రజాస్వామ్య విలువలపై దాడులు బాగా పెరిగిపోయాయని గ్లోబల్ రైట్స్ ఇండెక్స్-2024 నివేదిక పేర్కొంది. ఈజిప్ట్, ఎస్వాటిని, గ్వాటెమాల, మయన్మార్, ఫిలిప్పీన్స్, ట్యునీషియా, టర్కీ వంటి దేశాల్లో ట్రేడ్ యూనియన్ల పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొంది. బంగ్లాదేశ్, కొలంబియా, గ్వాటెమాల, హోండురస్, ఫిలిప్పీన్స్, రిపబ్లిక్ ఆఫ్ కొరియాలో ట్రేడ్ యూనియన్లకు చెందిన 22 మంది హత్యకు గురయ్యారని నివేదిక వెల్లడించింది. రుమేనియా, బ్రెజిల్ మాత్రమే తమ రేటింగ్‌ను మెరుగుపర్చుకున్నాయని తెలిపింది. యూరప్‌లో కార్మిక సంఘాలపై దాడులు పెచ్చుమీరుతున్నాయని, సమ్మె హక్కుపై దాడులు పెరిగాయని తెలిపింది.

విమాన ఛార్జీలు తగ్గేలా చూస్తా

- సమర్థవంతంగా విధులు నిర్వహిస్తామన్న కింజరాపు, పెమ్మసాని

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో




కేంద్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్

కేంద్ర మంత్రులుగా పలువురు గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాజ్‌నాథ్ సింగ్, జి కిషన్ రెడ్డితోపాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ ప్రతి డిపార్ట్‌మెంట్‌లో వంద రోజుల ప్రణాళికను అమలు చేయనున్నట్లు చెప్పారు. దేశంలో విమాన ఛార్జీలు తగ్గించడానికి ప్రయత్నిస్తానని, సామాన్యులు కూడా విమానయానం చేసేలా వంద రోజుల యాక్షన్ ప్లానింగ్, రానున్న 25 ఏళ్ల ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. పర్యావరణ హితంగా తమ శాఖను తీర్చిదిద్దుతామన్నారు. ఎయిర్ పోర్టులకు కావాల్సిన బడ్జెట్ లభిస్తుందన్నారు. టైర్ 2, టైర్ 3 సిటీలకు కూడా విమాన సదుపాయాలను విస్తరిస్తామన్నారు. 2014లో అశోక్ గజపతిరాజు కేంద్ర మంత్రిగా విమానయాన మంత్రిత్వ శాఖను నిర్వహించారని, ఆయన వచ్చాక ఎపిలో విమానయాన రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లారని, ఆయన దార్శనికతతోనే విమానయాన రంగం ముందుకు వెళ్లిందని తెలిపారు. దేశంలో మరింత డొమెస్టిక్, ఇంటర్నేషనల్ కనెక్టివిటీ అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. విమానయానశాఖలో సింధియా అమలుచేసిన సంస్కరణలు కొనసాగిస్తామన్నారు. ఎపిలో రాజమండ్రి, కడప, కర్నూలు విమానాశ్రయాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఏవియేషన్ రంగంలో నైపుణ్యాలను పెంచుతామని, అవసరాలకు అనుగుణంగా ఉపాధి రంగాన్ని మెరుగుపరుస్తామని తెలిపారు. విజయవాడ నగర విమానాశ్రయాన్ని రాజధాని అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి చేస్తామన్నారు.

గుంటూరు ఎంపి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తనకు కేటాయించిన శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు. 'నాకు కేంద్ర సహాయ మంత్రి పదవి ఇచ్చినందుకు ప్రధాని మోడీ, చంద్రబాబుకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. పదవి నిర్వహణలో రాణిస్తానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కువైట్ మృతుల్లో 45మంది భారతీయుల గుర్తింపు

- వారిలో 24మంది కేరళీయులే
- కువైట్ బయల్దేరిన కేరళ మంత్రి
- సమీక్షించిన పినరయి విజయన్ కేబినెట్



కువైట్ సిటీ : కువైట్‌లో బుధవారం ఏడంతస్తుల భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించిన వారిలో 45మంది భారతీయుల మృతదేహాలను గుర్తించారు. మరో ముగ్గురు ఫిలిప్పీన్స్ జాతీయులుగా పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో మొత్తంగా 49మంది విదేశీయులు మరణించగా, మరో 50మంది గాయపడ్డారు. బుధవారం తెల్లవారుజామున వంటగదిలో చెలరేగిన మంటలు త్వరితగతిన భవనమంతా వ్యాపించాయి. ఆ సమయంలో 195మంది వలస కార్మికుల్లో చాలామంది నిద్రపోతున్నారు. నల్లని దట్టమైన పొగలు అంతటా కమ్ముకోవడంతో చాలామంది ఊపిరాడక చనిపోయారని అధికారులు తెలిపారు. మృతదేహాలకు డిఎన్ఎ పరీక్షలు నిర్వహించి, వారిని గుర్తిస్తున్నట్లు కువైట్ అధికారులు తెలిపారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడతామని కువైట్ విదేశాంగ మంత్రి అబ్దుల్లా అలీ యహ్యా తెలిపారు. సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ఇప్పటికే కువైట్‌లో వున్న భారత విదేశాంగ శాఖ సహాయ మంత్రి కృతి వర్ధన్ సింగ్‌తో జరిగిన సమావేశంలో అబ్దుల్లా తెలిపారు.

కేరళ సిఎం అత్యవసర సమావేశం

కువైట్ బయల్దేరిన ఆరోగ్యమంత్రి వీణాజార్జి

మరణించిన వారి కుటుంబాలకు సాయం చేయడానికై కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జి అత్యవసరంగా కువైట్ బయలుదేరి వెళుతున్నారు. ఆమె వెంట జాతీయ హెల్త్ మిషన్ రాష్ట్ర డైరెక్టర్ జీవన్‌బాబు కూడా వుంటారు. గురువారం ఉదయం కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అత్యవసర మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితులపై సమీక్షించారు. మృతి చెందినవారి కుటుంబాలకు రూ.5లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. తొలుత ఈ ప్రమాదంలో మరణించిన వారిలో 19మంది కేరళవాసులు వుండగా, గురువారానికి ఈ సంఖ్య 24కి పెరిగింది. ఇదిలావుండగా, కేరళకు చెందిన ఇద్దరు ప్రముఖ వ్యాపారవేత్తలు ఎం.ఎ.యూసుఫ్ అలీ, రవి పిళ్ళైలు వరుసగా రూ.5, రూ.2 లక్షలు చొప్పున నష్టపరిహారాన్ని మరణించిన వారి కుటుంబాలకు ఇస్తామని తెలియజేశారని కేరళ కేబినెట్ ప్రకటించింది. దీంతో మొత్తంగా బాధితులకు అందే నష్టపరిహారం రూ.12లక్షలకు పెరిగింది. ప్రవాస కేరళ వ్యవహారాల విభాగం ద్వారా వారు ఆ మొత్తాన్ని అందజేస్తారని తెలిపింది. గల్ఫ్‌లోని కేరళ, మలయాళీ అసోసియేషన్లను కూడా సాయపడాల్సిందిగా కేబినెట్ కోరింది. కేరళ ప్రభుత్వం హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసింది. గ్లోబల్ కాంటాక్ట్ సెంటర్‌ను కూడా నెలకొల్పింది. కువైట్ నుండి భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఢిల్లీ సమీపంలో భారత వైమానిక దళానికి చెందిన రవాణా విమానాన్ని సిద్ధంగా వుంచినట్లు రక్షణ అధికారులు తెలిపారు.

22న జిఎస్‌టి కౌన్సిల్ మీటింగ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి)కు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం ఈ నెలలో నిర్వహించనున్నారు. ఈ నెల 22న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 53వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఆయా రాష్ట్రాలకు చెందిన ఆర్థిక మంత్రులు హాజరుకానున్నారు. ఈ విషయాన్ని జిఎస్‌టి కౌన్సిల్ ట్విట్టర్ (ఎక్స్)లో వెల్లడించింది. అయితే, ఈ భేటీలో ఏయే అంశాలపై చర్చించనున్నారో మాత్రం వెల్లడించలేదు. గతేడాది అక్టోబరు 7న చివరిసారిగా జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఆ సమావేశంలో క్యాసినో, గుర్రపు పందేలు, ఆన్‌లైన్ గేమింగ్‌కు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ తరువాత జరగాల్సిన కౌన్సిల్ మీటింగ్‌ను, కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకూ వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో కేంద్రంలో ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పడిన విషయం తెలిసిందే. కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా మరోసారి నిర్మలా సీతారామన్ బాధ్యతలు చేపట్టారు. దీంతో తదుపరి కౌన్సిల్ మీటింగ్‌ను నిర్వహించనున్నారు.

12 కోట్ల మంది బలవంతపు నిర్వాసితులు

- ఆందోళనకరంగా అంతర్జాతీయ పరిస్థితులు
- ఐక్యరాజ్య సమితి శరణార్థ సంస్థ వెల్లడి



జెనీవా : గతేడాది చివరి నాటికి బలవంతంగా నిర్వాసితులైనవారు రికార్డు స్థాయిలో 11.73కోట్ల మంది ప్రజలు వున్నారని ఐక్యరాజ్య సమితి శరణార్థ సంస్థ గురువారం తెలిపింది. అంతర్జాతీయంగా ప్రధానమైన రాజకీయ మార్పులు చోటు చేసుకోకపోతే ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని హెచ్చరించింది. వీరందరూ కూడా ఆశ్రయం కోరుతూ వెళ్లినవారే, శరణార్థులే, అంతర్గత ఘర్షణలు, కుమ్ములాటలతో ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లినవారే, వేధింపులు, ఘర్షణలు, హింస ఇంకా ఇతరత్రా కారణాల రీత్యా వీరందరూ తమ స్వదేశాలకు, స్వస్థలాలకు దూరంగా వుంటున్నవారేనని ఐక్యరాజ్య సమితి శరణార్థుల హై కమిషనర్ (యుఎన్‌హెచ్‌సిఆర్) ఫిలిపో గ్రాండీ తెలిపారు. ఇలా నిర్వాసితులు కావడానికి ఘర్షణలే ప్రధాన కారణంగా వుంటున్నాయని పేర్కొన్నారు.

బలవంతపు నిర్వాసితుల్లో అంతర్జాతీయంగా నెలకొన్న ధోరణులపై ఒక నివేదికను ప్రచురించింది. గత 12ఏళ్ల కాలంలో వీరి సంఖ్య పెరుగుతునే వస్తోందన్నారు. ఈ ఏడాది మొదటి నాలుగు మాసాల్లో ఇలా బలవంతంగా స్థానభ్రంశం చెందడమనేది పెరుగుతోందని యుఎన్‌హెచ్‌సిఆర్ అంచనా వేసింది. ఏప్రిల్ నాటికి ఈ సంఖ్య 12కోట్లు దాటిపోయింది కూడా. జెనీవాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఫిలిపో మాట్లాడారు. అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయాల్లో పెనుమార్పులు రావాలని, అప్పుడే పరిస్థితి మారుతుందని చెప్పారు. లేదా కొత్తగా ఘర్షణలు పుట్టుకొస్తునే వుంటాయన్నారు. సూడాన్‌లో అంతర్యుద్ధం కారణంగా ఇప్పటికే 90లక్షల మందికి పైగా అంతర్గతంగా నిర్వాసితులైతే, మరో 20 లక్షల మంది పొరుగుదేశాలకు పారిపోయారని తెలిపారు. గాజాలో పరిస్థితి మరీ భయంకరంగా వుందన్నారు. ఇప్పటికే 17లక్షల మంది అంతర్గతంగా స్థానభ్రంశం చెందితే వీరిలో చాలామంది హింసాకాండ భయంతో పలుసార్లు తాము వుంటున్న ప్రాంతాలు మారాల్సి వచ్చిందని తెలిపారు. గాజా నుండి ఈజిప్ట్‌లోకి వలస వెళుతున్నవారి సంఖ్య మరీ భయంకరంగా వుందన్నారు.

అదానీ చేతికి పెన్నా సిమెంట్

న్యూఢిల్లీ : గౌతం అదానీ సిమెంట్ తయారీ రంగంపై మరింత పట్టును పెంచుకుంటున్నారు. ఇప్పటికే అంబుజా, ఎసిసి సిమెంట్స్‌లో వాటాలు కొనుగోలు చేశారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా పని చేస్తోన్న పెన్నా సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించింది. దీన్ని అదానీకి చెందిన అంబుజా సిమెంట్ ద్వారా రూ.10,422 కోట్లకు కొనుగోలు చేయడానికి ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. పెన్నా సిమెంట్‌ను సొంతం చేసుకోవడం ద్వారా అదానీ గ్రూప్ సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం ఏడాదికి 89 మిలియన్ టన్నులకు పెరగనుంది. ఈ కొనుగోలు వల్ల దేశంలో అదానీ గ్రూప్‌కు సిమెంట్ రంగంలో మార్కెట్ వాటా మరో 2 శాతం పెరగనుండగా, దక్షిణాదిలో 8 శాతానికి చేరనుందని అంచనా. పెన్నా ప్రతాపరెడ్డి, ఆయన కుటుంబసభ్యుల నుంచి నూరు శాతం షేర్లను అంబుజా కొనుగోలు చేయనుంది. పెన్నాకు ఎపి, తెలంగాణ, రాజస్థాన్‌లో సిమెంట్ ప్లాంట్లు ఉన్నాయి.



కాలిఫోర్నియా యూనివర్సిటీలో పాలస్తీనాకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కాలిఫోర్నియా యూనివర్సిటీ చాన్సలర్ మార్పు

లాస్‌ఏంజెల్స్: పాలస్తీనియన్లకు సంఘీభావంగా విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది క్యాంపస్‌లో నిరసనలతో హోరెత్తిస్తున్న నేపథ్యంలో బైడెన్ ప్రభుత్వం కాలిఫోర్నియా యూనివర్సిటీ ప్రస్తుత చాన్సలర్ జెన్ బ్లాక్‌ను తొలగించి ఆయన స్థానంలో జులియో ఫ్రెంక్ అనే కొత్త వ్యక్తిని నియమించింది. పాలస్తీనా అనుకూల ప్రదర్శనలపై బ్లాక్ సరిగా వ్యవహరించలేదన్న కారణంతో ఆయనపై వేటు వేసింది. ఇటువంటి కారణంతో చాన్సరల్ ఉద్వాసనకు గురవడం యూనివర్సిటీ 105 ఏళ్ల చరిత్రలో ఇదే మొదటిసారి. మియామి యూనివర్సిటీ ప్రెసిడెంట్‌గా ఉన్న జులియో ఫ్రెంక్ కాలిఫోర్నియా యూనివర్సిటీ చాన్సలర్ పదవిని అధిష్టించిన మొదటి లాటినో కూడా. ఫ్రెంక్ అమెరికా పౌరుడే అయినప్పటికీ నిజానికి ఆయన మెక్సికో నుంచి వచ్చి అమెరికాలో పబ్లిక్ హెల్త్‌పై రిసెర్చి చేశాడు. ప్రపంచంలోనే టాప్ రిసెర్చి యూనివర్సిటీకి చాన్సలర్‌గా రావడం ఎంతో సంతోషంగా ఉందని ఫ్రెంక్ వ్యాఖ్యానించాడు. పాలస్తీనాకు సంఘీభావంగా కాలిఫోర్నియా యూనివర్సిటీలో మూడవసారి టెంట్ వేసి ఆందోళన చేస్తున్న విద్యార్థులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు.

అరుణాచల్ సిఎంగా ప్రేమ్‌ఖండు ప్రమాణ స్వీకారం



ఈటానగర్ : బిజెపి నేత ప్రేమ్‌ఖండు వరుసగా మూడోసారి అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు 11 మంది మంత్రులు ప్రమాణం చేశారు. ఈటానగర్‌లోని డికె స్టేట్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు అమిత్‌షా, జె.పి. నడ్డా, కిరణ్ రిజిజులతో పాటు అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ హాజరయ్యారు. ప్రేమ్‌ఖండు మొదటి సారి 2016లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ప్రేమ్ ఖండు బిజెపి శాసనసభ పక్ష నేతగా బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో రాష్ట్ర గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ కె.టి. పర్నాయక్ (రిటైర్డ్) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ఆయనను ఆహ్వానించారు.

ఇటీవల లోక్‌సభతో పాటు నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో అరుణాచల్ ప్రదేశ్‌లోని 60 స్థానాలకు గాను బిజెపి 46 స్థానాలను గెలుచుకుంది. ఎన్నికలకు ముందే పది స్థానాల్లో బిజెపి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఒడిషాలో 67 ప్రదేశాల్లో సిబిఐ సోదాలు

భువనేశ్వర్ : పోస్టల్ రిక్రూట్‌మెంట్ స్కామ్ విచారణలో భాగంగా ఒడిషా తొమ్మిది జిల్లాల్లో 67 ప్రాంతాల్లో సిబిఐ సోదాలు నిర్వహించింది. ఈ నెల 4న కలాహండి, నువాపడ, రాయగడ, నబరంగ్‌పూర్, కంధమాల్, కెందుఝర్, మయూర్ భంజ్, బాలాసోర్, భద్రక్ జిల్లాల్లో సోదాలు జరిగాయి. గ్రామీణ డాక్ సేవక్ పరీక్షకు సంబంధించి 63 మంది అభ్యర్థులపై ఫోర్జరీ కేసులు నమోదయ్యాయి. ఈ సోదాలు మొత్తంగా 204 మంది అధికారులు పాల్గొన్నారు. వీరిలో 122 మంది సిబిఐ అధికారులు, మిలిగిన 82 మంది ఇతర శాఖలకు చెందిన అధికారులు. ఈ నకిలీ సర్టిఫికెట్లు అందించిన అంతర్ రాష్ట్ర ముఠాల గురించి కూడా సిబిఐ సోదాలు చేపడుతుంది. సిబిఐ నమోదు చేసిన వివరాల ప్రకారం 1,382 గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగాల కోసం నియామక ప్రక్రియను నిర్వహించారు. ఈ ఉద్యోగాల కోసం దరఖాస్తుదారులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి, స్థానిక భాషలో ప్రావీణ్యం కలిగి ఉండాలి. దరఖాస్తు చేసిన వారిలో 63 మంది నకిలీ 10వ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్లను సమర్పించారు.

గాజాపై ఇజ్రాయిల్ దాడికి 250 రోజులు!

- ఇప్పటివరకు 37,202 మంది మృతి
- 15వేల మందికి పైగా పిల్లలే
- హమాస్ కోరిన మార్పులకు అమెరికా నో



గాజా నగరంలో ధ్వంసమైన భవనాలు

గాజా : నిరంకుశత్వంతో, ఆక్రమణే లక్ష్యంగా గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులకు గురువారంతో 250 రోజులు నిండాయి. ఈ దాడిలో ఇప్పటివరకు మొత్తంగా 37,202 మంది మరణించారని పాలస్తీనా వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇంకా లెక్కకు రాని మరణాలు కూడా వేలల్లోనే వుంటాయని అంతర్జాతీయ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ఈ దాడులకు ప్రధానంగా బలైంది మహిళలు, పిల్లలే, మరణించిన వారిలో సగం మంది (15,694 మంది) పిల్లలే వున్నారు. అలాగే మృతి చెందిన వారిలో 498 మంది ఆరోగ్య కార్యకర్తలు మరియు 150 మంది జర్నలిస్టులు ఉన్నారు. గాజాకు వెళ్లే అన్ని రహదారులను ఇజ్రాయిల్ దిగ్బంధించడం, మూసివేయడంతో ఆహారంతో సహా సామాగ్రి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో కరువు కాటకాల బారిన పడి ఇప్పటివరకు 33 మంది ఆకలితో మరణించారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారిక నివేదిక వెల్లడించింది. ఉత్తర గాజా పూర్తిగా కరువుతో అల్లాడుతోందని మీడియా వార్తలు తెలిపాయి. తక్షణమే నివారణ చర్యలు తీసుకోకపోతే పరిస్థితులు చేతులు దాటుతాయని హెచ్చరించాయి. మృతుల్లో 70 శాతం మంది మహిళలు, చిన్నారులే. ఇప్పటి వరకు ఇజ్రాయిల్ 79 వేల టన్నుల పేలుడు పదార్థాలను గాజాపై వేసింది. ప్రధాన ఆసుపత్రులు, ప్రార్థనా స్థలాలు ధ్వంసమయ్యాయి. 206 రక్షిత భవనాలు కూడా నేలమట్టమయ్యాయి. 17,000 మంది పిల్లలు తమ తల్లిదండ్రులను కోల్పోయారు.

గాజాపై ఇజ్రాయిల్ దాడి చేసిన తొలి రోజుల్లో లైంగిక హింస కూడా జరిగిందని యుఎన్ (ఐక్యరాజ్యసమితి) నిపుణులు తెలిపారు. ఇజ్రాయిల్ చేసిన ఈ దాడిని మానవాళికి వ్యతిరేకంగా చేసిన నేరంగా ఐక్యరాజ్య సమితి నివేదిక పేర్కొంది. గతేడాది అక్టోబర్ 7నుండి చివరి వరకు జరిగిన సంఘటనలను ఈ బందం పరిశీలించింది.

గత 24గంటల్లో సెంట్రల్, దక్షిణ గాజాల్లో ముమ్మర బాంబు దాడులు చోటు చేసుకున్నాయి. నుస్రత్ శరణార్థ శిబిరంలోని రెండు నివాసాలపై జరిగిన దాడుల్లో ఐదుగురు మరణించగా, 17మంది గాయపడ్డారు. రాఫాలో భవనాల విధ్వంసానికి సైన్యం పెద్దఎత్తున పేలుడు పదార్థాలను ఉపయోగించినట్లు వార్తలు అందుతున్నాయి. కాల్పుల విరమణ ప్రతిపాదన ప్రయత్నాలను తాము పూర్తి సానుకూలతతో పరిశీలిస్తున్నామని హమాస్ తెలిపింది. కాగా, కాల్పుల విరమణ ప్రతిపాదనకు హమాస్ చేసిన మార్పులు కొన్ని ఆచరణ సాధ్యంకానివని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ పేర్కొన్నారు.

హమాస్ కోరిన మార్పులకు అమెరికా నో

అమెరికా ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి హమాస్ కోరిన కొన్ని మార్పులు చేపట్టేందుకు బైడెన్ ప్రభుత్వం తిరస్కరించింది. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ బుధవారం దోహాలో మీడియాతో మాట్లాడుతూ, తాము ప్రతిపాదించిన ఒప్పందంలో బందీల విడుదలతో సహా పలు అంశాలపై హమాస్ మార్పులు చేయాలని కోరుతోందని, అవి తమకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కావని అన్నారు. గాజాలో శాశ్విత కాల్పుల విరమణకు మూడంచెల ప్రణాళికే సరైన పరిష్కారమార్గమని బ్లింకెన్ సెలవిచ్చారు. ఖతార్, ఈజిప్టు మధ్యవర్తిత్వంలో ఈ ఒప్పందానికి హమాస్‌ను ఒప్పించాలని అమెరికా చూస్తోంది. ఈ ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ప్రభుత్వం వ్యతిరేకిస్తుంటే, ఆ ప్రభుత్వ అంగీకారంతోనే ఈ ఒప్పందాన్ని తాము ముందుకు తెచ్చామని బ్లింకెన్ పునరుద్ఘాటించారు. ఇజ్రాయిల్ ప్రభుత్వంలో కొందరు కరడుగట్టిన ఛాందసవాదులే దీనిని వ్యతిరేకిస్తున్నారని, హమాస్ యస్ అని చెబితే చాలు ఈ ఒప్పందం ఖరారైపోతుందని బ్లింకెన్ చెప్పారు. గాజాలో ఇజ్రాయిల్ ఊచకోతకు వ్యతిరేకంగా అమెరికన్ విద్యార్థులు పెద్దయెత్తున ఉద్యమిస్తుండడంతో బైడెన్ ప్రభుత్వం కాల్పుల విరమణ పేరుతో కాలయాపన చేస్తోంది. మరో వైపు ఇజ్రాయిల్ రోజురోజుకీ దాడులను తీవ్రతరం చేస్తూ వందలాది మంది అమాయక పాలస్తీనా పౌరుల ప్రాణాలను హరించివేస్తోంది. అమెరికాకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, డబ్బు పంపడాన్ని వెంటనే నిలుపుచేయాలని హక్కుల కార్యకర్తలు పలువురు డిమాండ్ చేస్తున్నారు. గాజా నుంచి బలగాలను పూర్తిగా వెనక్కి తీసుకోవాలన్న హమాస్ డిమాండ్ తిరస్కరించాల్సినంత అంశమే కాదని సీనియర్ హమాస్ నాయకుడొకరు వ్యాఖ్యానించారు. ఆయన గురువారం నాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ అమెరికా ప్రతిపాదిత కాల్పుల విరమణ ఒప్పందానికి తాము కోరిన మార్పులు చాలా చిన్నవని, వీటిలో చాలావరకు ఆచరణ సాధ్యమైనవేనని అన్నారు. తామేదో గొంతెమ్మ కోర్కెలు కోరుతున్నట్లు బ్లింకెన్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

రష్యా మానవాళికి గొప్ప సహకారం అందించింది : వెనిజులా

కారకస్ : రష్యా మానవాళికి గొప్ప సహకారం అందించిందని వెనిజులా పేర్కొంది. బుధవారం కారకస్‌లో నిర్వహించిన 'రష్యా డే' 34వ వార్షిక వేడుకల్లో వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్, రష్యా రాయబారి సెర్గీ మెలిక్ పాల్గొన్నారు. మానవాళికి రష్యా అందించిన తోడ్పాటు, అందించనున్న సహకారం దృష్ట్యా తాము రష్యాడేను జాతీయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ పేర్కొన్నారు. సైన్స్, ఫైనాన్స్, ఎకానమీ, ఎనర్జీ, సెక్యూరిటీకి సంబంధించిన రంగాలలో 340 సహకార ఒప్పందాలపై వెనిజులా, రష్యా సంతకం చేశాయని తెలిపారు. అమెరికా, దాని మిత్రదేశాలు ఏకపక్షంగా విధించిన 21,000కు పైగా ఆంక్షల కారణంగా రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాని చూశాయని, కానీ వాటి తరం కాలేదని రోడ్రిగ్జ్ పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల మాదిరిగా స్వతంత్ర దేశాలు ఉమ్మడి కూటమిని ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. రష్యా, ఇతర దేశాలు బహుళ ధ్రువ ప్రపంచం కోసం కృషి చేస్తున్నాయని చెప్పారు.



యెమెన్ తీర ప్రాంతంలో బోటు బోల్తా

- 49మంది జల సమాధి
- మరో 140మంది గల్లంతు

సానా : యెమెన్ తీరప్రాంతంలో బోటు బోల్తాపడి అందులో ప్రయాణిస్తున్న 49మంది శరణార్థులు మరణించారు. వీరిలో 31మంది మహిళలు, ఆరుగురు పిల్లలు వున్నారు. సోమవారం ఈ దుర్ఘటన జరిగిందని అంతర్జాతీయ వలస సంస్థ (ఐఓఎం) మంగళవారం తెలిపింది. మరో 140మంది ఆచూకీ తెలియడం లేదని పేర్కొంది. సోమాలియా నుండి యెమెన్‌కు ఈ బోటు వెళుతోంది. యెమెన్‌లోని సబ్‌వా ప్రావిన్స్‌లో అల్ఘరీఫ్ పాయింట్ సమీపంలో బోటు బోల్తా పడింది. ఆ సమయంలో బోటులో 260మంది వున్నారు. వీరిలో ఎక్కువమంది సోమాలియా, ఇథియోపియాకు చెందినవారే వున్నారు. వీరిలో 90మంది మహిళలు. గల్లంతైన వారి కోసం గాలింపు, సహాయక చర్యలు చేపట్టినట్లు మంగళవారం ఐఓఎం తెలిపింది. ఆరుగురు పిల్లలతో సహా 70మందిని కాపాడినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. యెమెన్ కోస్తా ప్రాంతాల్లో తగినన్ని సహాయక బోట్లు లేకపోవడం, అవి రావడంలో ఆలస్యం జరగడంతో మృతుల సంఖ్య పెరిగిందని తెలిపాయి. పెద్ద సంఖ్యలో ప్రజల ప్రాణాలను కాపాడడంలో స్థానికులు, జాలర్లు కీలక పాత్ర పోషించారని ఐఓఎం వర్గాలు పేర్కొన్నాయి.

16,347 పోస్టులతో మెగా డిఎస్‌సి

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన కొందరు నిరుద్యోగులతో ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఎక్కువగా మన రాష్ట్రంలో 24 శాతం నిరుద్యోగ రేటు ఉందని చెప్పారు. నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకుని ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతో మెగా డిఎస్‌సిపై తొలి సంతకం చేశానని చెప్పారు.

ప్రజల భూములకు రక్షణలేని చట్టం

గత ప్రభుత్వం నిరంకుశంగా తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టులో అనేక సమస్యలు ఉన్నాయని చెప్పారు. ప్రజల భూములకు రక్షణ లేకుండా చేసే ఈ చట్టంతో ప్రజలకు ఇబ్బందులు వస్తాయని చెప్పారు. భూమి రికార్డులు మార్చేందుకు సెటిల్‌మెంట్లు కూడా చేసుకున్నారని చెప్పారు. ఒకసారి రికార్డులు మారిస్తే హైకోర్టుకు వెళ్లాలని, వెళితే పరిష్కారానికి సంవత్సరాలు పడుతుందని, అందువల్లే దాన్ని రద్దు చేస్తున్నామని చెప్పారు.

ఇబ్బందుల పడే వారిని గుర్తించి పెన్షన్ పెంచాం

మూడో సంతకం పెన్షన్ పెంపుపై చేస్తున్న సమయంలో ఆయన వెంట వికలాంగులు, పెన్షనర్లు ఉన్నారు. ఎన్‌టిఆర్ పెన్షన్ పెడితే తాను రూ.2000కు పెంచానని చెప్పారు. జగన్ ప్రభుత్వం విడతలవారీగా పెంచిందని అన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ రూ.4000 పెంచుతున్నామని తెలిపారు. ఏప్రిల్, మే,జూన్ నెలలకు కలిపి జులైలో ఏడువేల చెల్లిస్తామని తెలిపారు. వికలాంగుల పెన్షన్ ఆరువేలకు పెంచామని చెప్పారు. ఇబ్బందులు పడుతున్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని చెప్పారు.

నైపుణ్యాన్ని గుర్తిస్తాం

స్కిల్ సెన్సస్‌పై సంతకం చేసే సమయంలో యువతతో మాట్లాడారు. యువత కోరికలు సాధించుకోవాలంటే నైపుణ్యం కావాలని, ఉన్నత చదువులు చదివినా సరైన స్కిల్ లేకపోవడంతో ఉద్యోగాలు రావడం లేదని అన్నారు. నాలెడ్జ్ ఎకానమీలో ముందుకు వెళుతున్న సమయంలో తగిన స్కిల్ ఉంటే ప్రపంచంలో రాణించవచ్చని అన్నారు. పెట్టుబడులు వచ్చిన సమయంలో మన రాష్ట్రంలో ఉండే యువతకు ఉపాధి కల్పించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని అందువల్లే స్కిల్ సెన్సస్ చేపడుతున్నామని వివరించారు.

పేదల కడుపు నింపేందుకు అన్న క్యాంటీన్లు

పేదలకు అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో గతంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని, వాటిని వైసిపి ప్రభుత్వం మూసేసిందని తెలిపారు. వీటితో నిరుద్యోగులు, కూలీపనులకు వెళ్లే వారికి ఎంతో ఉపయోగంగా ఉందని అన్నారు. వెంటనే క్యాంటీన్ల ఏర్పాటు చేస్తామని, ఎన్ని పెట్టాలి, ఎక్కడ పెట్టాలనేది త్వరలోనే స్పష్టత ఇస్తామని చెప్పారు.

అమరావతి రైతుల పూల వర్షం

బాధ్యతలు చేపట్టేందుకు సచివాలయానికి ముఖ్యమంత్రి హోదాలో వెళుతున్న చంద్రబాబునాయుడి కాన్వాయ్‌పై రైతులు పూలవర్షం కురిపించారు. వెంకటపాలెం నుండి వెలగపూడి సచివాలయం వరకూ అమరావతి రైతులు రోడ్డుకూ అటూఇటూ నిలబడి పూలవర్షం కురిపించారు. వెయ్యికిలోలకుపైగా పూలను జల్లారు. అడుగడుగునా జననీరాజనం పలికారు. సిఎం కాన్వాయ్‌తోపాటు వందలాది కార్లు వెలగపూడి సచివాలయం వరకూ చేరుకున్నాయి. వాటిని నియంత్రించేందుకు పోలీసులు కొంత ఇబ్బంది పడాల్సి వచ్చింది.





మీకోసం

టీ పొడిని ఒక పాత్రలో వేసి కాల్చితే ఆ ఘాటుకు దోమలు దూరమవుతాయి. పుదీనా మొక్కను ఓ కుండీలో నాటి ఇంట్లో పెట్టుకుంటే ఈ ఘాటుకు దోమలు పారిపోతాయి.

జీవన సౌరభం

విజయానికి ఆత్మవిశ్వాసం ఎంత ముఖ్యమో.. ఆత్మవిశ్వాసానికి సాధన కూడా అంతే ముఖ్యం.

JEEVANA జీవన the family


చదువుతోపాటు ఆటలూ పాటలూ ...



మిత్రులూ,

వేసవి సెలవులు తరువాత మళ్లీ పాఠశాలలు మొదలయ్యాయి. ఒక్కసారిగా మిత్రులను, ఉపాధ్యాయులను, తోటి విద్యార్థుల సందడిని చూసి, నా మనసు ఉప్పొంగిపోయింది. మా పాఠశాలలో విద్యాబోధన చాలా చక్కగా జరుగుతుంది. చదువుతోపాటుగా క్రీడలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా మా ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తారు. విద్యార్థుల్లో ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ సాధించాలని చెబుతారు. మా పాఠశాలలో అన్ని సబ్జెక్టులకూ నిపుణులైన ఉపాధ్యాయులు బోధిస్తుండటం మాకెంతో గర్వకారణం. పరిసరాల విజ్ఞానంతోపాటుగా పర్యావరణ పరిరక్షణపైన కూడా మాకు అర్థమయ్యే రీతిలో క్షేత్రస్థాయి బోధన అందిస్తున్నారు. జాతీయ నాయకుల దినోత్సవాలు, వర్థంతులు, జయంతులు, తెలుగు భాషా దినోత్సవం ... వంటి సందర్భాల్లో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి మా అవగాహన పెంచుతున్నారు. సంస్కృతి, సంప్రదాయాలు, ప్రపంచం, కుటుంబ వ్యవస్థలపైనా, చారిత్రక, ఆర్థిక, శాస్త్ర పరిశోధనా రంగాల గురించి కూడా అవగాహన కల్పిస్తున్నారు. మా పాఠశాలలో నాతోపాటుగా 6వ తరగతి విద్యార్థిని ఎస్.శ్రావ్య ఇటీవల కాకినాడలో నర్తనకేళి నంది పురస్కారం అందుకున్నారు. 8వ తరగతి విద్యార్థిని వి.సాధన పలు అద్భుత ప్రదర్శనలలో పెద్దల ఆశీస్సులను అందుకున్నారు. నేను కూడా ప్రతిభ కనబరిచి ఎన్నో బహుమతులు అందుకున్నాను. మాకు నాట్యాచార్యులు సప్పా శివకుమార్ నాట్యాంశాల్లో మంచి శిక్షణ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయిని పద్మలత, మిగతా ఉపాధ్యాయులు మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు.


– ఆకురాతి రుత్విక, 8వ తరగతి, కొండపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఇబ్రహీంపట్నం, ఎన్‌టిఆర్ జిల్లా.



దారి చూపండి

లోపలికి వెళ్లి, బయటకు వచ్చే మార్గం చూపరూ!

నేను గీసిన బొమ్మ





బి.దినేష్, 1వ తరగతి, ఎంపిపిఎస్, వానపాముల (హెచ్‌డబ్ల్యు), పెద పారుపూడి మండలం, కృష్ణా జిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అతిసారను అశ్రద్ధ చేయొద్దు ..!

సాధారణంగా సీజన్ మారినప్పుడల్లా జ్వరం, దగ్గు, జలుబు వంటి రోగాలు వస్తుంటాయి. గత కొన్ని రోజులుగా అడపా దడపా వర్షాలు సైతం కురుస్తున్నాయి. ఈ క్రమంలో వాతావరణంలో మార్పులు, తాగునీరు కలుషితం కావటం, ఇతర వైరస్‌లు గాలి ద్వారా వ్యాపించటం, ఈగలు, దోమలు వంటివి సైతం విజృంభిస్తుండటం ఇప్పుడు వ్యాధి కారకాలుగా మారుతున్నాయి. అందువల్ల ఈ సీజన్‌లో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే చాలా జాగ్రత్తగా ఉండటం ఎంతో అవసరం. ఆరోగ్యపరమైన విషయాల పట్ల అప్రమత్తంగా ఉంటూ డాక్టర్ల సూచనలు పాటించటం ద్వారా మెరుగైన జీవితాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ప్రస్తుతం రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో అతిసార కేసులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అతిసార రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలుసుకుందాం.





అతిసార ఎలా వస్తుంది?


సాధారణంగా లూజు లేదా నీళ్ల విరోచనాలు అవటాన్నే అతిసార వ్యాధి (డయేరియా) అని అంటారు. అంతర్లీనంగా ఉండే గ్యాస్ట్రో ఇంటెస్టినల్ రుగ్మతలో భాగమే ఇది. ఎవరికైనా ఒక రోజులో మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు నీళ్ల విరోచనాలు అయితే దానిని అతిసారగా పిలుస్తుంటారు.

ఏటా ప్రపంచ వ్యాప్తంగా సుమారు 17 కోట్ల మంది ఈ వ్యాధి బారిన పడుతుంటారని అంచనా. పోషకాహార లోపంతో ఈ వ్యాధి బారినపడి వీరిలో 13 శాతం మంది మరణిస్తున్నట్లుగా సమాచారం. సామాన్యంగా వైరస్‌లు, బ్యాక్టీరియా, పరాన్న జీవుల వల్ల వ్యాధి తీవ్రస్థాయికి కూడా చేరే ప్రమాదం ఉంటుంది. కలుషిత నీటిని తాగటం, ఆహారాలను సరిగ్గా వండకపోవటం వల్ల అతిసార వ్యాధిని కల్గించే ఇన్ఫెక్షన్లు సోకుతాయి. వీటితోపాటు వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవటం, వాతావరణ కాలుష్యం వల్ల కూడా ఇన్ఫెక్షన్ పెరిగే అవకాశం ఉంటుంది. శరీరంలో నీరు తగ్గిపోవటం, ఎలక్ట్రోలైట్లు తగ్గిపోవటం వల్ల కూడా అతిసార తీవ్రత ముదిరే ప్రమాదం ఉంటుంది. సకాలంలో డాక్టరును సంప్రదిస్తే పరిస్థితి అదుపులోకి వస్తుంది. లేకపోతే రోగి ఆరోగ్యం బాగా క్షీణించి ప్రాణాంతకం కూడా అయ్యే అవకాశాలుంటాయి. రెండురోజులకు మించి తగ్గకపోయినా, బాగా నీరసం అనిపించినా, పొత్తి కడుపులో నొప్పిగా ఉన్నా మలం నల్లగా లేదా రక్తంతో కూడి ఉన్నా, జ్వరం 102 డిగ్రీల జ్వరం ఉన్నా ఏమాత్రం అశ్రద్ధ చేయకూడదు. ఓఆర్ఎస్, జింక్, ప్రోబయాటిక్స్ వంటి వాటితోపాటుగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత కూడా పాటించటం ద్వారా అతిసార లక్షణాలను త్వరగా తగ్గించుకోవచ్చు. భవిష్యత్తులో రాకుండా కూడా నివారించుకోవచ్చు. చిన్న పిల్లలకు రోటా వైరస్ వ్యాక్సిన్ వేయటం ద్వారా రాకుండా చేయొచ్చు.

అప్రమత్తంగా ఉండటం మేలు

అతిసార సీజనల్‌గా వచ్చే వ్యాధే. పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ దీని బారినపడుతుంటారు. అందువల్ల ప్రతి ఒక్కరూ మంచి జీవన శైలిని అలవర్చుకోవటం, వేడివేడి ఆహార పదార్థాలు తీసుకోవటం ద్వారా రాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు. అతిసార మొదలైనప్పుడే జాగ్రత్తలు తీసుకుంటే త్వరగా తగ్గుతుంది.

మూడు రోజులు దాటితే కాస్త ఇబ్బందికరం. అందువల్ల ప్రతి ఒక్కరూ వ్యాధి సోకిన వెంటనే సంబంధిత డాక్టరును సంప్రదించి వైద్య చికిత్సలు పొందితే త్వరగా నయం అవుతుంది. పరిశుభ్రత పాటించటం, పౌష్టికాహారం తీసుకోవటం, శారీరక శ్రమను పెంచుకోవటం కూడా ఆరోగ్యానికి దోహద పడుతుంది.




డాక్టర్ జాడి సాయి శిశిర్, ఎంబిబిఎస్, డిసిహెచ్, డిఎన్‌బి, చిన్నపిల్లల వైద్య నిపుణులు, గిద్దలూరు, ప్రకాశం జిల్లా. సెల్ : 9573971929

ఇవీ, లక్షణాలు

- బాగా దప్పిక అవుతుండటం
- బరువు తగ్గిపోవటం
- జ్వరం వచ్చిన లక్షణాలు
- కడుపులో వికారం
- పొత్తికడుపు పిండేసినట్లుగా ఉండటం
- కడుపులో నొప్పి, పొత్తి కడుపు ఉబ్బటం
- ఆకస్మిక మలవిసర్జనలు

తీవ్రమైతే కనబడే లక్షణాలు

- మలములో రక్తం కనిపించటం
- వదలకుండా వాంతులవ్వటం
- బాగా నీరసం, లేవలేని పరిస్థితి



ఈ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి!


- మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రపర్చుకోవాలి.
- వంట చేసే ముందు, చేసిన తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలి.
- డైపర్స్ మార్చిన తర్వాత చేతులను కడుక్కోవాలి
- కాచి చల్లార్చిన నీటినే తాగాలి
- పిల్లలకు వారి వయస్సుకు తగిన విధంగా ఆహారాన్ని ఇవ్వాలి.
- ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలి
- ఆరు నెలల వరకూ పిల్లలకు తల్లిపాలనే తప్పనిసరిగా ఇవ్వాలి.
- పాచిపోయిన, కలుషితమైన ఆహార పదార్థాలను తినరాదు
- నిల్వవుంచే జ్యూసులు, పానీయాలు, ఐస్‌లు తినకపోవటమే మంచిది
- అన్ పాస్చ్యురైజ్డ్ పాలు తాగొద్దు
- వీధుల వెంట విక్రయించే ఆహార పదార్థాల జోలికెళ్లొద్దు
- నిల్వవుంచిన మాంసం తినొద్దు
- ఆల్కాహాలు వంటివి సేవించొద్దు
- మసాలా ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి
- ఆరునెలల తర్వాత పిల్లలకు పోషక విలువలు (కాంప్లిమెంటరీ ఫీడ్) కలిగిన ఆహారాన్నే ఇవ్వాలి.

'అంతర్జాతీయ' ప్రదర్శనకు ధనుష్ సినిమా



తమిళ నటుడు ధనుష్ నటించిన చిత్రం 'కెప్టెన్ మిల్లర్' అరుదైన రికార్డు సృష్టించింది. ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్సులో ప్రదర్శనకు ఎంపికైంది అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం గత సంక్రాంతికి విడుదలై ప్రేక్షకాదరణ పొందింది. ఇందులో ప్రియాంక మోహన్, శివరాజ్ కుమార్, నివేద సతీష్ సహ పలువురు నటీనటులు ముఖ్య పాత్రలు పోషించారు. సత్యజ్యోతి ఫిల్మ్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించింది. జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. తాజాగా చిత్ర నిర్మాణ సంస్థ సత్య జ్యోతి ఫిలిమ్స్ తన ఎక్స్ పేజీలో ఒక పోస్ట్ చేసింది. లండన్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ 2024 కార్యక్రమంలో కెప్టెన్ మిల్లర్ చిత్రం ఉత్తమ విదేశీ సినిమా విభాగంలో నామినేట్ అయిందని తెలిపింది. కాగా, ధనుష్ ప్రస్తుతం తన 50వ చిత్రం రాయన్‌కి దర్శకత్వం వహించి, నటించారు. ఈ చిత్రాన్ని జూలై 26న విడుదల చేయనున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున కథానాయకులుగా కుబేర చిత్రంలో కనిపించనున్నారు.

నటి హేమకు బెయిలు



బెంగళూరు రేవ్ పార్టీ కేసులో అరెస్టయిన నటి హేమకు స్థానిక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆమె నుంచి డ్రగ్స్‌ను జప్తు చేసుకోలేదని, ఘటన జరిగిన పది రోజులకు వైద్య పరీక్షలు నిర్వహించారని హేమ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఆమె పార్టీలో పాల్గొన్నట్లు చూపే ఆధారాలను బెంగళూరు నేర నియంత్రణ దళం (సీసీబీ) న్యాయవాది కోర్టుకు అందజేశారు. ఇరువైపులా వాదనలను విన్న న్యాయమూర్తి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు.



అతిథి పాత్రలో నిత్యా మీనన్

తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న మలయాళ నటి నిత్యా మీనన్ తెలుగు సినిమా అంగీకరించి దాదాపు రెండేళ్లయింది. ప్రస్తుతం తమిళంలో 'కాదలిక్క నేరమిల్లయ్, డియర్ ఎక్సెస్' సినిమాలు చేస్తున్నారు. ఇవి తెలుగులోనూ విడుదలయ్యే అవకాశం ఉంది. నితిన్ హీరోగా వేణు శ్రీరామ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'తమ్ముడు' సినిమాలో అతిథి పాత్రలో నటించబోతున్నారు. గతంలో నితిన్, నిత్యా మీనన్ జంటగా 'ఇష్క్, గుండెజారి గల్లంతయ్యిందే' చిత్రాల్లో నటించిన విషయం తెలిసిందే. 'తమ్ముడు'లో సప్తమీ గౌడ కథానాయికగా నటిస్తున్నారు. నటి లయ ఓ కీలక పాత్ర చేస్తున్నారు.



నేడు 'హరోం హర హర' విడుదల

హీరో సుధీర్ బాబు, మాళవిక శర్మ జంటగా నటించిన చిత్రం హరోం హర. ఈ సినిమాను జ్ఞానసాగర ద్వారక దర్శకత్వంలో తెరెకెక్కించారు. శుక్రవారంనాడు ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమా నుంచి ఇటీవల విడుదల చేసిన టీజర్ నెట్టింట్లో ట్రెండింగ్‌లో ఉంది. విడుదలకు ముందు రోజు ప్రత్యేకంగా రూపొందించిన వీడియోను పంచుకున్నారు. 44 సెకన్ల నిడివి గల ఈ వీడియోలో ఫైట్స్, యాక్షన్ సీన్స్ తెగ ఆకట్టుకుంటున్నాయి. చివర్లో 'ఇక సెప్పేదేం లేదు.. 'సేసేదే' అనే సుధీర్ బాబు చెప్పే డైలాగ్ హైలెట్‌గా నిలిచింది.

హైదరాబాద్‌లో 'డకాయిట్' షూటింగ్



అడివి శేష్ హీరోగా, శ్రుతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'డకాయిట్'. హైదరాబాద్‌లో షూటింగ్ జరుపుకుంటోంది. కీలకమైన సన్నివేశాలు, యాక్షన్ పార్ట్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా శతి హాసన్, శేష్‌తో సెల్ఫీని షేర్ చేశారు. డకాయిట్ ఇద్దరు మాజీ ప్రేమికుల కథ. వారు తమ లైఫ్‌ని మార్చడానికి వరుస దోపిడీల కోసం కలిసి పనిచేస్తారు. అడివి శేష్ 'క్షణం', 'గూఢచారి'తో సహా పలు తెలుగు బ్లాక్‌బస్టర్‌లకు డివోపిగా పనిచేసిన షానీల్ డియో ఈ సినిమాతో డైరెక్టర్‌గా పరిచయమవుతున్నారు. ఈ ప్రాజెక్టును సుప్రియ యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాత. అన్నపూర్ణ స్టూడియోస్ ప్రజెంట్ చేస్తోంది. హిందీ, తెలుగు భాషల్లో ఏకకాలంలో చిత్రీకరిస్తున్నారు. అడివి శేష్, షానీల్ డియో ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే కూడా అందించారు.

నేటినుంచి నెట్‌ఫ్లిక్స్‌లో 'మహరాజ్'





బాలీవుడ్ సూపర్‌స్టార్ అమీర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ నటించిన తొలి సినిమా 'మహరాజ్'. అర్జున్ రెడ్డి ఫేమ్ షాలినీ పాండే ఇందులో కీలకమైన పాత్రలో నటించింది. సుమారుగా మూడేళ్లుగా చిత్రీకరణ జరుపుకున్న ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో శుక్రవారం నుంచి స్ట్రీమింగ్ కానుంది. సిద్ధార్థ్ పి మల్హోత్రా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఆదిత్య చోప్రాకు చెందిన వైఆర్ఎఫ్ ఎంటర్‌టైన్మెంట్ తెరకెక్కించింది. ఈ సినిమాను బ్యాన్ చేయాలంటూ నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ సినిమాలో బ్రిటీష్ కాలంలో భక్తి పేరుతో జరిగిన అన్యాయాలను ప్రశ్నించే జర్నలిస్ట్ పాత్రలో జునైద్ ఖాన్ కనిపించనున్నారని సమాచారం. ఈ చిత్రంలో భక్తుల మనోభావాలను చులకన చేస్తూ పోస్టర్స్ ఉన్నాయిని కొందరు నెటిజన్లు అభ్యంతరాలు వ్యక్తంచేశారు.

రాణించిన రూథర్‌ఫర్డ్

- సూపర్-8కు వెస్టిండీస్
- న్యూజిలాండ్‌పై 13పరుగుల తేడాతో గెలుపు



ట్రినిడాడ్: టి20 ప్రపంచకప్ సూపర్-8కు ఆతిథ్య వెస్టిండీస్ జట్టు దూసుకెళ్లింది. గ్రూప్-సిలో న్యూజిలాండ్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు 13 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో వెస్టిండీస్ సూపర్-8లోకి ప్రవేశించగా.. కివీస్ రెండు మ్యాచుల్లో ఓటమితో సూపర్-8కు చేరడం క్లిష్టం చేసుకుంది. తొలుత విండీస్ బ్యాటర్ రూథర్‌ఫర్డ్.. అజేయ అర్ధ సెంచరీకి తోడు పూరన్(17), హొసైన్(15) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో విండీస్ జట్టు తొలిగా బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. రూథర్‌ఫోర్డ్ అద్భుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. 39బంతుల్లో 68 పరుగులు చేసి విండీస్ నుంచి గట్టెక్కించాడు. అతని ఇన్నింగ్స్‌లో ఆరు సిక్సర్లు , రెండు ఫోర్లు ఉన్నాయి. ఓ దశలో విండీస్ 12.3 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 76 పరుగులు మాత్రమే చేసింది. ఆ దశ రూథర్‌ఫర్డ్ సాహసోపేత ఇన్నింగ్స్ ఆడాడు. విండీస్ జట్టు 112పరుగులకే 9వికెట్ల కష్టాల్లో పడ్డా.. చివరి వికెట్‌కు రూథర్ ఫర్డ్... పేసర్ మోంటీ(0) సహకారంతో జట్టు స్కోర్‌ను 149పరుగులకు చేర్చాడు. చివరి 12బంతుల్లో 37పరుగులు చేసి జట్టు విండీస్ జట్టు భారీస్కోర్‌కు దోహదపడ్డాడు. అనంతరం 150 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 136 పరుగులే చేసింది. వెస్టిండీస్ బౌలర్లలో అల్జారీ జోసెఫ్‌కు నాలుగు, మోంటీకి మూడు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రూథర్‌ఫర్డ్‌కు లభించింది.

టి20 ప్రపంచకప్‌లో నేడు

ఆఫ్ఘనిస్తాన్ × పప్పువాన్యుగేనియా
వేదిక: ట్రినిడాడ్; ఉ.6.00గంIIలకు

అమెరికా × ఐర్లాండ్
వేదిక: ఫ్లోరిడా; రా.8.00గంIIలకు

స్కోర్‌బోర్డు...

వెస్టిండీస్ ఇన్నింగ్స్: కింగ్ (సి)కాన్వే (బి)నీషమ్ 9, ఛార్లెస్ (బి)బౌల్ట్ 0, పూరన్ (సి)కాన్వే (బి)సౌథీ 17, రోస్టన్ ఛేస్ (సి)రచిన్ రవీంద్ర (బి)ఫెర్గుసన్ 0, రువాన్ పావెల్ (సి)కాన్వే (బి)సౌథీ 1, రూథర్‌ఫర్డ్ (నాటౌట్) 68, ఆకెల్ హొసైన్ (సి)నీషమ్ (బి)సాంట్నర్ 15, రస్సెల్ (సి)ఫెర్గుసన్ (బి)బౌల్ట్ 14, షెఫర్డ్ (ఎల్‌బి)ఫెర్గుసన్ 13, జోసెఫ్ (బి)బౌల్ట్ 6, మోంటీ (నాటౌట్) 0, అదనం 6. (20ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 149పరుగులు.

వికెట్ల పతనం: 1/1, 2/20, 3/21, 4/22, 5/30, 6/58, 7/76, 8/103, 9/112

బౌలింగ్: బౌల్ట్ 4-1-16-3, సౌథీ 4-0-21-2, ఫెర్గుసన్ 4-0-27-2, నీషమ్ 4-0-27-1, ఫిలిప్స్ 1-0-9-0, సాంట్నర్ 2-0-27-1, మిఛెల్ 1-0-19-0

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి)రోస్టన్ ఛేస్ (బి)ఆకెల్ హొసైన్ 5, ఫిన్ అలెన్ (సి)రస్సెల్ (బి)జోసెఫ్ 26, రచిన్ రవీంద్ర (సి)రస్సెల్ (బి)మోటీ 10, విలియమ్సన్ (సి)పూరన్ (బి)మోంటీ 1, మిఛెల్ (బి)మోటీ 12, ఫిలిప్స్ (సి)రువన్ పావెల్ (బి)జోసెఫ్ 40, నీషమ్ (సి)కింగ్ (బి)జోసెఫ్ 10, సాంట్నర్ (నాటౌట్) 21, సౌథీ (సి అండ్ బి)జోసెఫ్ 0, బౌల్ట్ (సి)రోస్టన్ ఛేస్ (బి)రస్సెల్ 7, ఫెర్గుసన్ (నాటౌట్) 0, అదనం 4, (20ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 136పరుగులు.

వికెట్ల పతనం: 1/20, 2/34, 3/39, 4/64, 5/63, 6/85, 7/108, 8/108, 9/117

బౌలింగ్: ఆకెల్ హొసైన్ 4-0-21-1, షెఫర్డ్ 3-0-36-0, రస్సెల్ 4-0-30-1, జోసెఫ్ 4-0-19-4, మోంటీ 4-0-25-3, ఛేస్ 1-0-4-0

నసావు క్రికెట్ స్టేడియం తొలగింపు



న్యూయార్క్: అమెరికాలోని నసావు కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియాన్ని తొలగించారు. ఈ టోర్నీ కోసం న్యూయార్క్‌లో నసావు కౌంటీ క్రికెట్ గ్రౌండ్‌ను ఆగమేఘాల మీద నిర్మించిన సంగతి తెలిసిందే. ఈ స్టేడియంలో జరగాల్సిన మ్యాచ్‌లన్నీ ముగియడంతో ఈ మైదానాన్ని తీసేశారు. ఆ స్టేడియాన్ని క్లీన్ చేసేందుకు కసరత్తులు సిద్ధం అయ్యాయి. బుధవారం అమెరికాతో భారత్ ఆడిన మ్యాచే ఆ వేదికలో చివరిది. ఈ పాక్షిక స్టేడియాన్ని క్రమంగా తొలగించనున్నారు. కేవలం వంద రోజుల వ్యవధిలోనే నసావు స్టేడియాన్ని నిర్మించారు. అయితే ఈ పిచ్‌పై ఆడిన అన్ని జట్లు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. అనూహ్యమైన బౌన్స్ ఉన్న ఈ స్టేడియంలో బౌలర్లే పైచేయి సాధించారు. బ్యాటర్లకు పరుగులు తీయడం కష్టం అయ్యింది. మైదానంలో ఉన్న పచ్చికను అడిలైడ్‌ను తీసుకువచ్చి ఇక్కడ పరిచారు. లాంగ్ ఐలాండ్‌లో ఉన్న ఈసన్‌ఓవర్ పార్కులో ఈ స్టేడియాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. పది రకాల డ్రాప్ ఇన్ పిచ్‌లతో ఇక్కడ మైదానాన్ని నింపేశారు. దీంట్లో నాలుగు గ్రౌండ్లు ప్రధానమైనవి కాగా, ఆరు శిక్షణ కోసం వాడారు. బుధవారం మ్యాచ్ తర్వాత క్రమ పద్ధతిలో నసావు స్టేడియాన్ని తొలగించనున్నారు. మైదానం నుంచి తీసిన పచ్చిక లాస్ వెగాస్‌కు తరలించనున్నారు. ఆరు వారాల వ్యవధిలో నసావు స్టేడియాన్ని పూర్తిగా నిర్మూలిస్తారు. ఈ స్టేడియం సామర్థ్యం 34 వేలు. జూన్ 9వ తేదీన భారత్, పాక్ మధ్య జరిగిన మ్యాచ్ అభిమానులతో కిక్కిరిసింది.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు తేజోన్మయి ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణా జిల్లా)

జాతీయ స్థాయి అండర్ 10 ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు కృష్ణా జిల్లా గన్నవరం వి.ఎస్. సెయింట్ జాన్స్ హైస్కూల్ 5వ తరగతి విద్యార్థిని కోటా తేజోన్మయి ఎంపికైనట్లు ఉమ్మడి కృష్ణాజిల్లా ఫెన్సింగ్ సంఘం కార్యదర్శి, కార్యనిర్వాహక కార్యదర్శి నాగం సతీష్ బాబు, ధనియాల నాగరాజు గురువారం తెలిపారు. ఈ నెల 16, 17 తేదీల్లో ఒడిశా రాష్ట్రంలోని కటక్ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడి యంలో జాతీయ స్థాయి అండర్-10, 12 బాల బాలికల ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నట్లు తెలిపారు. మన రాష్ట్రం నుంచి తేజోన్మయి శాబర్ విభాగం నుండి ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. తేజోన్మయి జాతీయ పోటీలకు ఎంపిక కావడంపట్ల విఎస్ఎస్‌టి జాన్స్ స్కూల్ ప్రిన్సిపల్ సంతోష్ కుమార్, ప్రముఖ సీనియర్ న్యాయవాది కలపాల వెంకట రమణ, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కెవిఆర్ కిషోర్, వాకర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు తిరివీధి వెంకయ్య, ఉపాధ్యక్షులు జల సూత్రం రామ్‌మోహన్ అభినందించారు.



జాతీయస్థాయి పెన్సింగ్ పోటీలకు ఎంపికైన కోటా తేజోన్మయి

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68